thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 184 కరీంనగర్ గురువారం, 11 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడిగా సతీశ్‌రెడ్డి

న్యూఢిల్లీ: జాతీయ భద్రత సలహా మండలి (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్డీవో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ భద్రత మండలి సచివాలయం ఉప కార్యదర్శి పుష్పేంద్ర కుమార్ ఉత్తర్వులిచ్చారు. సతీశ్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. 2027 జూన్ 9 వరకు.. లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా ఉంటారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి డీఆర్డీవో చైర్మన్‌గా, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ఆయనను విమానయానం, రక్షణ రంగాల్లో గౌరవ సలహాదారు(రాష్ట్ర క్యాబినెట్ హోదా)గా ఈ ఏడాది మార్చి 19న నియమించింది. ఆయన భారతదేశ క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.



# మావో అగ్రనేతల ఖిల్లా 'జగిత్యాల జిల్లా'

## నాడు గణపతి....నేడు తిరుపతి... ఇద్దరిది గురు శిష్యుల బంధం...

## మావో కేంద్ర కమిటీ సెక్రటరీ గా దేవ్ జీ... దేశవ్యాప్త దృష్టి జగిత్యాల జిల్లా వైపు...





చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 10: 47ఏళ్ల క్రితం నాటి జగిత్యాల జైత్రయాత్రను మంగళవారం తలుచుకుంటున్న సమయంలో అదే రోజు మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం కొత్త పేరు ఖారారు చేసింది. అది జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ని జనరల్ సెక్రటరీ గా నియమించారు అంటూ దేశవ్యాప్త ప్రచారాన్ని మీడియా ప్రారంభించారు. తిరుపతికి వచ్చిన పగ్గాలు రావడంతో మళ్లీ కేంద్ర సర్కార్ దృష్టి జగిత్యాల వైపు మళ్లింది. ఇంతకు ముందే జగిత్యాల జిల్లా కు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి సెక్రటరీ గా పనిచేశారు ఆయన దగ్గర శిష్యుడు మావో సిద్ధాంత నిపుణుడు గా మారిన తిరుపతికి పార్టీ పగ్గాలు అప్పగించారు. ఈ పదవి ఇచ్చారన్న వార్తతో జగిత్యాల జిల్లా అగ్రనేతలకు అడ్డాగా మారింది. తిరుపతి 1980 నుంచి ఆర్ ఎస్ యు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఎస్ ఆర్ ఆర్ కాలేజ్ పూర్వ విద్యార్థి. కోరుట్ల తిరుపతి మావోయిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి గా ఎన్నికయ్యారని ప్రచారం జరుగుతోంది .ఆయనపై కరీంనగర్ జిల్లా లో ఆర్ ఎస్ యు విద్యార్థి నాయకుడు ఉన్నప్పుడు బీజేపీ ఏబీవీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ తరువాత తిరుపతి అడవి బాట పట్టారు. ఇక ఆయన విప్లవ రాజకీయాలతో పాటుగా సైనికులవిభాగంలో ఆరితేరిన అనుభవం ఉంది. ప్రపంచదేశ విప్లవ రాజకీయాలపై అవగాహన కలిగి ఉన్న తిరుపతి మాజీ దళపతి గణపతికి ప్రియ శిష్యుడు. విప్లవ పాఠాలు బోధించే తిరుపతిని%ౌ%తిరుపతి సార్ అంటూ పిలిచే వారు. దళిత మాల వర్గంకు చెందిన తిరుపతి తండ్రి 1980 దుబాయ్ లో ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవారు. ఆర్థికంగా ఇబ్బందులు లేని కుటుంబం నుంచి విప్లవ రాజకీయాల్లోకి వెళ్లారు. 1984 లో ఆయన బస్తర్ వెళ్లారు. చంద్రబాబు పై దాడి స్కెచ్ గీసిన నలుగురిలో తిరుపతి ఒక్కరు. దేశంలో అమిత్షా బలగాలు ముప్పేట దాడులు జరుపుతున్నా కూడా కేంద్ర కమిటీ కీలక సమావేశం జరగినట్టుగా సమాచారం అందింది. ఈ సమావేశంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నాయకత్వ బాధ్యతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ కి అప్పగించినట్టుగా తెలుస్తోంది. సెంట్రల్ మిలటరీ కమిషన్ (సి యం సి) చీఫ్ గా, పొలిట్ బ్యూరో సభ్యునిగా పని చేస్తున్న దేవ్ జీ ని కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా సెక్రటరీ పనిచేసిన నంబాల్లా కేశవరావు మిలిటరీ చీఫ్ గా పనిచేసిన వారే దేశంలోని 6 రాష్టాల్లో నుండి కేంద్ర కమిటీలో ఉన్నప్పటికీ కేంద్ర కమిటీ కార్యదర్శి బాధ్యత మరోసారి తెలుగు రాష్ట్రాలకు చెందిన వారికే దక్కుతున్నాయి. నాటి పీపుల్స్ వార్ ఆవిర్భావం తరువాత కొండపల్లి సీతారామయ్య సీసీ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించగా ఆయనను ఆ బాధ్యతల నుండి తప్పించి ముప్పాళ లక్ష్మణ్ రావు సుదీర్ఘ కాలం **(మిగతా 3వ పేజీలో)**




## వెలుగులోకి సంచలన విషయాలు

నిజామాబాద్: బోధన్‌లో ఉగ్రవాదుల కదలికలు కలకలం సృష్టించాయి. పట్టణంలో ఉగ్రవాది ఉంటున్నట్లు సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు దాడి చేసిన అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాది పట్టణంలోని అనీసనగర్‌కు చెందిన డ్యానిష్ అనే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అతడి నుంచి ఓ తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. డ్యానిష్ అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సమయంలో కీలక విషయాలు బయటపడ్డాయని పోలీసులు వెల్లడించారు. డ్యానిష్‌కు ఐసిస్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

ఝూరండ్‌లోని రాంచిలో బాంబు బ్లాస్టింగ్‌కు కుట్రలు పన్నుతున్నట్లు పేర్కొన్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు బోధన్‌లోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం అతడిని విచారించాల్సి ఉందని ఢిల్లీ నిఘా వర్గాలు స్పష్టం చేశాయి. అయితే.. బోధన్‌లో డ్యానిష్ ఒక్కడే ఉన్నడా..? డ్యానిష్ ఒక్కడే ఉంటే తనకి చేతికి తుపాకీ ఎలా వచ్చింది...? ఝూరండ్‌లాగానే.. తెలంగాణలో కూడా ఏమైనా బాంబు బ్లాస్టింగ్ ప్లాన్ చేశాడా..? రాష్ట్రంలో డ్యానిష్ లాంటి ఉగ్రవాదులు ఇంకా ఉన్నారా..? అనే సందేహాలు ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి.




## హైకోర్టు తీర్పును సవాల్ చేయనున్న టీజీపీఎస్సీ

హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్‌పై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. గ్రూప్ 1 మెయిన్స్ మెరిట్ లిస్ట్‌ను రద్దు చేస్తూ జస్టీస్ నామావరపు రాజేశ్వరరావు ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ విషయంపై హైకోర్టు తీర్పును తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవాల్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈరోజు మధ్యాహ్నం కమిషన్ కీలక సమావేశమై న్యాయపరమైన అంశాలు చర్చించాక తుది నిర్ణయం తీసుకోనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళ్లే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. కాగా, ఏప్రిల్ నెలలో టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను ప్రకటించింది. అయితే, మ్యూలంకనంలో అవకతవకలు జరిగాయని కొంతమంది అభ్యర్థులు ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై విచారించిన న్యాయస్థానం అభ్యర్థుల వాదనలతో ఏకీభవించి మెయిన్స్ మెరిట్ లిస్ట్‌ను రద్దు చేయాలని సంచలన తీర్పు వెల్లడించింది. పేపర్లు రీ వాల్యూయేషన్ చేయాలని కుదరకపోతే మెయిన్స్ మరోసారి నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే టీజీపీఎస్సీ హైకోర్టు తీర్పును సవాల్ చేయనున్నట్లు తెలుస్తోంది.




## దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం... పేదలకు అందిస్తాం..

నల్గొండ: కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ- కారు రేస్, ధరణిలో దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తాం... పేదలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఇవాళ(బుధవారం) మీడియాతో మాట్లాడారు.. పక్క రాష్ట్రంలో మాజీ మంత్రులు ఎంపీ, ఎమ్మెల్యేలు అరెస్ట్ అవుతున్నారని తెలిపారు. ఇక్కడ అరెస్టులు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా ఖూనీ చేస్తుందని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తాము పాల్పడమని, చట్ట ప్రకారమే అన్ని జరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కమిటీల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని, ఒక్కో కమిటీ రిపోర్ట్ వచ్చాక దోషులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎఫ్ - 1 రేసులో క్యాబినెట్ తీర్మానం లేకుండా విదేశీ కంపెనీలకు ఇవ్వడం.. ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చినట్టు ఆధారాలు ఉన్నప్పుడు ఎవరు ఆపినా వారి అరెస్టులు ఆగవని ఆయన స్పష్టం చేశారు.




## ఆ భూములు తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలి..

ఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల రక్షణశాఖ భూములు తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. మూసీ, ఈసీ నదుల సంగమం సమీపంలో 'గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ' నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిలుస్తుందని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం నిర్మిస్తామన్నారు. చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ఘాట్లు, శాంతి విగ్రహం, మ్యూజియం ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలిపారు. **చాకలి ఐలమ్మకు రేవంత్ నివాళి...** అణచివేత, దమనకాండపై చాకలి ఐలమ్మ ధిక్కార పతాకాన్ని ఎగురవేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి, నిరంకు శత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల క్రితమే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు అని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినట్లు గుర్తుచేశారు.

# 2038 నాటికి జగజ్జేతగా భారత్.. వెంట్రుక కూడా పీకలేరు..!



ప్రస్తుతం భారత్ పై అమెరికా సుంకాల మోత మోగిస్తోంది. ఏ దేశానికీ లేనంతగా భారత్ పై ఏకంగా 50 శాతం టారిఫ్ లు విధించింది అమెరికా. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ ల కారణంగా భారత పరిశ్రమలకు, ఎగుమతి దారులకు కష్టాలు తప్పవు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్ పై ఒత్తిడి తెచ్చేందుకు తద్వారా అటు భారత్ తో పాటు రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బ కొట్టేందుకు ట్రంప్ మాస్టర్ ప్లాన్ వేశారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారత్ నుంచి అగ్రరాజ్యానికి ఎగుమతయ్యే 48 బిలియన్ డాలర్ల వాణిజ్యంపై ఇది ప్రభావం చూపనున్నట్లు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నాయి. అయితే ఇలాంటి ఒడిదుడుకుల సమయంలో భారత్ కు గుడ్ న్యూస్ చెప్పింది %జ్% రిపోర్టు. 2038 నాటికి భారత్.. కొనుగోలు శక్తి సమానత్వంలో ప్రపంచంలోనే రెండో స్థానంలోకి చేరుకుంటుందని అంచనా వేసింది. ప్రస్తుతం జీడీపీ ప్రకారం భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఈ విషయాన్ని ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ ఇటీవల పేర్కొంది. 2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న జీడీపీ విలువ 2025 నాటికి 4.27 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు స్పష్టం చేసింది. అలాగే 2025 నాటికి జపాన్, 2027 నాటికి జర్మనీను అధిగమించి 2038 నాటికి రెండో స్థానంలోకి చేరుతుందని EY రిపోర్టు అంచనా వేసింది. ప్రస్తుతం 30. 34 ట్రిలియన్ డాలర్లతో అమెరికా తొలి స్థానంలో ఉంది. చైనా, జర్మనీ, జపాన్, భారత్ మూడో స్థానంలో ఉన్నాయి. భారత్ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్ ఉన్నాయి. 2038 నాటికి భారత జీడీపీ విలువ 34. 2 ట్రిలియన్ వరకు చేరుకుంటుందని రిపోర్టు వెల్లడించింది. ఐఎంఎఫ్ నిర్దేశించిన లక్ష్యాల ఆధారంగా ఈ విలువను ఈవై సంస్థ అంచనా వేసింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 2025 నాటికి 28.8 మీడియాన్ రేంజ్ లో ఉంది. సేవింగ్స్ రేట్ లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. డెట్ టూ జీడీపీ రేషియో 2024 లో 81.3 శాతం ఉండగా 2030 నాటికి 75.8 శాతానికి చేరుకుంది. అలాగే 2030 నాటికి కొనుగోలు శక్తి సమానత్వం %జూబతీఛెష్ట్రుుంఱఅస్త్ర జూశీషవతీ జూఖతీఱ్‌ఎ (ూూూ%)లో చైనా తొలిస్థానంలోకి చేరుకుంటుందని ఈవై సంస్థ అంచనా వేసింది. చైనా జీడీపీ విలువ 42.2 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటుందని స్పష్టం చేసింది. అమెరికా శక్తివంతంగానే ఉన్నప్పటికీ డెట్ రేషియో భారీగా పెరుగుతుందని అంచనా వేసింది. అది అమెరికా జీడీపీలో 120 శాతం ఉంటుందని పేర్కొంది. ఇదే విషయంపై ఈవై సంస్థ చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీ వాస్తవ మాట్లాడుతూ.. భారత్ లోని యువత, నైపుణ్యమైన ఉద్యోగులు, సేవింగ్స్, పెట్టుబడుల రేట్లు, తదితర కారణాల వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఒడిదుడుకులు ఉన్నా భారత్ స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోందని తెలిపారు. భారత్ నిర్దేశించిన 2047 వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకుంటుందని స్పష్టం చేశారు. అమెరికా విధించిన సుంకాలు భారత్ జీడీపీలోని 0.9 శాతంపై ప్రభావం చూపుతాయన్నారు.



# యూరియా కోసం అర్ధరాత్రి నుంచే బారులు

మిరుదొడ్డి: సిద్దిపేట జిల్లాలోని మిరుదొడ్డి రైతువేదిక ఎదుట యూరియా కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచే రైతులు బారులు తీరారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం వరుసకట్టిన నేపథ్యంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అసహనానికి గురైన రైతులు వేదికలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేశారు. కేవలం 1120 యూరియా బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. అన్నదాతలు మాత్రం వేల సంఖ్యలో బారులు తీరారు. ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై కీర్తి కుమార్, మిరుదొడ్డి ఎస్సై సమతలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసుల సమక్షంలో భారీ బందోబస్తు మధ్య యూరియాను రైతులకు పంపిణీ చేశారు. 3 వేల మంది టోకెన్లు దొరకక నిరాశతో వెనుతిరిగారు. మెదక్ జిల్లా శివ్వంపేట సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం మంగళవారం రాత్రి అక్కడే పడుకొని వేచిచూశారు. బుధవారం ఉదయం టోకెన్ల కోసం బారులు తీరారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్‌లో యూరియా కోసం రాత్రి నుంచి క్యూలో నిరీక్షించారు.



# మందగమనంలో అమెరికా ఆర్థికవృద్ధి

అమెరికా ఆర్థికవ్యవస్థ అంతర్లీనంగా మందగమన సంకేతాలు చూపిస్తోందని ఫిచ్ రేటింగ్స్ హెచ్చరించింది. ఉద్యోగాల వృద్ధిలో క్షీణత, వినియోగంలో తగ్గుదల, అధిక సుంకాలతో పుట్టుకొస్తున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు అందుకు కారణమని పేర్కొంది. తాజా ఆర్థిక డేటా ఈవిషయాన్ని ధ్రువీకరిస్తోందని తెలిపింది. 'అమెరికాలో మందగమనానికి ఆధారాలు ఇప్పుడు హార్డ్ డేటాలో కనిపిస్తున్నాయి. సెంటిమెంట్ సర్వేలలో మాత్రమే కాదు' అని ఫిచ్ చీఫ్ ఎకనామిస్టు బ్రియాన్ కౌల్టన్ పేర్కొన్నారు. అమెరికా సుంకాల విధానంపై ఇటీవల వెలువడిన వివరణ అనిశ్చితిని తొలగించినప్పటికీ.. అత్యధిక సుంకాలు ప్రపంచ వృద్ధి రేటు, అమెరికా ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపిస్తాయని ఫిచ్ హెచ్చరించింది. అమెరికా ఆర్థికవ్యవస్థ వినిమయం తగ్గడం, ఉద్యోగాల క్షీణత, సుంకాల షాక్‌ల పరిణామాలు ఎదుర్కొంటోంది. ఇప్పటివరకు లాభాలపై పరిమితులు మాత్రమే కనిపించినప్పటికీ ఈ సంవత్సరం చివరికి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 'అధిక ద్రవ్యోల్బణం నిజ వేతన వృద్ధి రేటు తగ్గిస్తుంది. యూఎస్ వినియోగదారుల ఖర్చులపై ప్రభావం చూపిస్తుంది. 2025లో ఇప్పటికే గణనీయంగా మందగమనం కనిపిస్తోంది. ఉద్యోగాల వృద్ధి కూడా భారీగా తగ్గింది. వలసల కట్టడి ప్రభావం శ్రామికశక్తి పెరుగుదలలోనూ ప్రతిబింబిస్తోంది' అని ఫిచ్ తెలిపింది. పెరుగుతున్న ఆర్థికలోటు 2026లో డిమాండ్‌కు మద్దతివ్వాల్సి ఉంది. కానీ, అమెరికా వార్షిక సగటు జీడీపీ వృద్ధి రేటు వచ్చే ఏడాది 1.6 శాతం కంటే తక్కువ ఉంటుందని ఫిచ్ అంచనా వేస్తోంది. ఫెడరల్ రిజర్వ్ త్వరగా రేట్లు తగ్గిస్తుందని ఈ ఏజెన్సీ భావిస్తోంది. సెప్టెంబర్, డిసెంబర్‌లో 25 బేసిస్ పాయింట్లు ఉండొచ్చని అంచనా వేస్తోంది. ఇక, సుంకాలు ఉన్నప్పటికీ చైనా ఎగుమతులు నిలకడగా కొనసాగుతున్నాయని పేర్కొంది. ఆర్థిక సడలింపులు, కరెన్సీ విలువ తరుగుదల అందుకు దోహదపడినట్లు వెల్లడించింది. ద్వితీయార్థంలో యూరోజోన్ వృద్ధి నెమ్మదించనుంది. అమెరికా, యూకే, జర్మనీ, జపాన్‌లలో దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్ల పెరుగుదల కూడా ఒత్తిడి ఎదుర్కొంటోందని ఫిచ్ వెల్లడించింది. భారత వృద్ధి అంచనాలను కూడా ఫిచ్ సవరించింది. జూన్‌లో 6.5 శాతంగా పేర్కొనగా.. దానిని 6.9కి మార్చింది. దేశీయ డిమాండ్ వృద్ధికి ఇది చోదక శక్తిగా పని చేస్తుందని అభిప్రాయపడింది.

## పోటీ పరీక్షల విషయంలో గత ప్రభుత్వ వైఖరినే కాంగ్రెస్ కొనసాగిస్తోంది: రామచందర్‌రావు

హైదరాబాద్: గ్రూప్ – 1 పరీక్ష పత్రాలు రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి లక్షలాది మంది విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. టీజీపీఎస్సీ వ్యవస్థలో ఉన్న లోపాలు



బయటకు వచ్చాయని చెప్పారు. నోటిఫికేషన్ విడుదల నుంచి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం వరకు టీజీపీఎస్సీ చాలా లోపాలతో కూడిన విధానాలను అవలంబించిందని ఆరోపించారు. లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, ఈ తీర్పు ద్వారా వారికి న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. గత భారత రాష్ట్ర సమితి హయాంలో పేపర్ లీకేజీ ఘటనలతో వేలాది మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అదే పరంపరను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు.



## పత్తి పొలంలో కూలీలపై పిడుగు.. ముగ్గురి మృతి

అల్లంపూర్: జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ మండలం భూంపురం గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం పత్తి చేనులో పని చేసుకుంటున్న కూలీలపై పిడుగు పడింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఓ యువకుడు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతులను భూంపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ (22), సర్వేశ్ (20), సౌభాగ్యమ్మ (40)గా గుర్తించారు.




## ట్రంప్ టారిఫ్‌ల వేళ.. భారత్-రష్యా 'ఎక్సర్‌సైజ్ జాపడ్'


తాను బెదిరించినా పట్టించుకోకుండా రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాల మోత మోగించిన సంగతి తెలిసిందే. కానీ, భారత్ మాత్రం రష్యాతో ఉన్న తన చిరకాల స్నేహాన్ని కొనసాగిస్తోంది. ఈ తరుణంలో రెండు దేశాలు 'ఎక్సర్‌సైజ్ జాపడ్'ను నిర్వహిస్తున్నాయి. ఈ రోజు (సెప్టెంబర్ 10) నుంచి 16 వరకు భారత్-రష్యా బలగాలు ఆపరేషన్ జాపడ్ పేరిట సంయుక్తంగా సైనిక విన్యాసాల్లో పాల్గొంటాయి. సంప్రదాయ యుద్ధరీతులు, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల కోసం మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా సరికొత్త వ్యూహాలను మార్పిడి చేసుకుంటాయని భారత రక్షణశాఖ వెల్లడించింది. ఇందుకోసం భారత సైన్యానికి  చెందిన 65 మందితో కూడిన బృందం మంగళవారం రష్యాకు వెళ్లింది. నిజ్నీ నగరంలోని ములినో ట్రైనింగ్ గ్రౌండ్‌లో ఈ విన్యాసాలు జరుగుతాయని తెలిపింది. వీటివల్ల ఇరుదేశాల మధ్య రక్షణ సంబంధాలు బలోపేతం అవుతాయని, స్నేహబంధం మరింత పటిష్టంగా మారుతుందని పేర్కొంది. పరస్పర సహకారం, విశ్వాసం మెరుగుపడుతుందని వెల్లడించింది. ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంపై అసహనంగా ఉన్న ట్రంప్.. తన సహాయకుడు పీటర్ నవారోతో భారత్ గురించి ఇష్టారీతిగా మాట్లాడిస్తున్నారు. నవారో వ్యాఖ్యలను ఇప్పటికే ఖండించిన భారత్.. తన ప్రయోజనాలను కాపాడుకునే దిశగానే అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే ఎస్‌సీఓ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ సమావేశమయ్యారు. ఇద్దరూ కలిసి కారులో ప్రయాణించి, తమ ఆలోచనలను పంచుకున్నారు. వీరిద్దరు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి ఒకే వేదికపై కనిపించారు. ఇది ట్రంప్ అక్కసుకు కారణమైంది. దాంతో ఐరోపా దేశాలు కూడా భారత్‌పై 100 శాతం సుంకాలు విధించాలని సూచించారు. మిత్రదేశాలను కట్టడి చేసి.. రష్యాపై ఒత్తిడి తెస్తేనే ఉక్రెయిన్‌లో త్వరగా శాంతి నెలకొంటుందని ఒక అసంబద్ధ ప్రచారానికి తెరతీసిన ట్రంప్.. ఇప్పుడు ఐరోపాను కూడా తోడు తెచ్చుకుంటున్నారు. ఈ ఒత్తిడికి తలొగ్గని భారత్.. రష్యాతో స్నేహబంధాన్ని కొనసాగించేందుకే మొగ్గు చూపుతోంది. అందుకు తాజా పరిణామం ఓ నిదర్శనం.

## జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలి: కేటీఆర్



హైదరాబాద్: అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ మొదటి వారంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఉంటుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు అందరి ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో పార్టీని గెలిపించడమే గోపీనాథ్‌కు సరైన నివాళి అని పేర్కొన్నారు. ఓటుకు రూ.5 వేలు పంచితే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సీఎం సోదరుడు చెరువులో ఇళ్లు కట్టినా హైడ్రా వెళ్లదని.. కానీ పేదల బస్తీలకు వెళ్లి ఇళ్లు కూలగొడతారని విమర్శించారు. "ఉపఎన్నిక కోసం సర్వేలు చేయిస్తున్నాం.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగుంది. కొన్ని బస్తీల్లో వెనకంజలో ఉన్నాం. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు ఉంటే తొలగించాలి.. లేనివారివి చేర్చాలి. ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు బంద్ చేస్తామని.. ఇళ్లు కూలుస్తామని అంటారు. పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ మూసీ ప్రాజెక్టుకు డబ్బులు ఉన్నాయట. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సత్తా చూపాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరు. జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి జైత్రయాత్ర మళ్లీ ప్రారంభం కావాలి" అని కేటీఆర్ అన్నారు. మాగంటి గోపీనాథ్‌లాగే తనకూ అండగా నిలవాలని కార్యకర్తలను ఆయన సతీమణి సునీత కోరారు. గోపీనాథ్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరమూ కలిసి పనిచేద్దామన్నారు. భారత రాష్ట్ర సమితిలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉందని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు.

## కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా: రాజాసింగ్



హైదరాబాద్: భాజపా రాష్ట్ర నాయకత్వంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరో సారి విమర్శలు గుప్పించారు. "కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజీనామా చేస్తే.. నేను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇద్దరం కలిసి ఎన్నికలకు వెళ్దాం. భాజపా నాకు ఎలాంటి సహకారాలు అందించలేదు. పార్టీలో నేను ఎలాంటి పదవి ఆశించలేదు. ఇప్పుడున్న కమిటీతో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాదు. ఈ కమిటీతో అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా. పార్టీని నాశనం చేస్తున్నదెవరో మరోసారి చెబుతా. దిల్లీ పెద్దలు నాకు తరచూ ఫోన్ చేసి మాట్లాడతారు. నాకు ఎప్పటి నుంచో కేంద్రంలోని పెద్దల ఆశీర్వాదం ఉంది. వాళ్లను కలిసి పార్టీలో జరిగిందంతా చెబుతా. నేను ఎప్పటికీ భాజపా నేతనే. సెక్యులర్ వాదిని కాదు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీల్లో చేరను. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఫోన్ చేసి తిట్టారు. నేను చేసే కామెంట్స్ పార్టీపై కాదు.. కొందరు నేతలపై మాత్రమే. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దిల్లీ పెద్దలు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా" అని రాజా సింగ్ తెలిపారు.

## నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కోసం సహాయ కేంద్రం


హైదరాబాద్: నేపాల్‌లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో పలువురు తెలంగాణ వాసులు అక్కడ చిక్కుకున్నారు. వారికి సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ముగ్గురు అధికారుల బృందానికి బాధ్యతలు అప్పగించింది.  ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కాఠ్‌మాండూలోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దని సూచించింది.  నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ వాసులు చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు దిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను



ఈ కింది నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ – లైజన్ హెడ్ ౦91 9871999044, జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ ౦91 9643723157, సీహెచ్ చక్రవర్తి, ప్రజా సంబంధాల అధికారి ౦91 9949351270.

## మేడారం జాతరపై రాజకీయం చేయొద్దు : మంత్రి సీతక్క

ములుగు జిల్లా: మేడారం మహాజాతర నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి సీతక్క మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం అభివృద్ధిని విస్మరించారని, కానీ ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ముందుగానే జాతరకు ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధి పనులను స్వయంగా సమీక్షిస్తున్నారని సీతక్క అన్నారు. మేడారం గద్దెల దగ్గర మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. తాము, పూజారులు చేసిన మార్పులపై సీఎం రేవంత్ సంతృప్తి చెందలేదని.. అందుకే ఆయనే స్వయంగా గద్దెల దగ్గరకు వస్తున్నారని వివరించారు. ఈ నెల 13న లేదా 14న సీఎం మేడారం పర్యటనకు వస్తారని తెలిపారు. అయితే, గద్దెల మార్పుపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజారులు, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా మార్పులు చేస్తామన్నారు. మేడారం జాతరపై రాజకీయం చేయవద్దని, భక్తి భావంతో చూడాలని సూచించారు. మహాజాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా మార్పులు చేస్తున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు.




## ఫార్ములా ఈ కారు రేస్ కేసుపై హరీష్ రావుతో కేటీఆర్ భేటీ

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ సీనియర్ నేత హరీష్ రావు నివాసానికి చేరుకున్నారు. ఫార్ములా ఈ కారు రేస్ కేసు నేపథ్యంలో ఇరువురు నేతలు భేటీ అయ్యారు. ప్రభుత్వం దూకుడుగా ముందుకు వెళితే ఏం చేయాలనే దానిపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఫార్ములా ఈ రేసు కేసు లొట్టపీసు కేసు అంటోన్న కేటీఆర్.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకే కారు రేస్‌కు తానే చొరవ తీసుకున్నానన్నారు. ఒక్క రూపాయి కూడా ఇందులో అవినీతి జరగలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కాగా, మాజీ మంత్రి కేటీఆర్ నిందితుడిగా ఉన్న ఫార్ములా–ఈ కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగిందని ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.45 కోట్ల మేర నిధులు ఫార్ములా ఈ కారు రేస్‌లో భాగస్వాములైన కంపెనీకి బదిలీ చేయడం.. ఆ కంపెనీల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో తిరిగి రూ. 44 కోట్ల నిధులు బీఆర్ఎస్‌కు రావడం స్పష్టంగా కనిపిస్తోందని ఏసీబీ అంచనాకు వచ్చింది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్ ఉండటం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసు విషయంలో ఎలా ముందుకు వెళ్లాలి అని హరీష్ రావుతో కేటీఆర్ భేటీ అయినట్లు తెలుస్తోంది.

# మావో అగ్రనేతల ఖిల్లా 'జగిత్యాల జిల్లా'

**(మొదటి పేజీ తరువాయి)** పని చేశారు. 2005లో మావో యిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ (యం. సి సి) ఆవిర్భావం తరువాత కూడా ముప్పాళే ఆ బాధ్యతల్లో కొనసాగారు. పార్టీలో సంస్థాగత మార్పులు చేర్పుల జరిపినప్పుడు నంబళ్ల కేశవ రావును కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 2025 మే 21న ఛత్తీస్‌గఢ్ బస్తర్ డివిజన్‌లోని నారాయణపూర్ జిల్లా అడవుల్లో భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో నంబాళ్ల కేశవ్ రావు అలియాస్ బసవరాజ్ అలియాస్ గగనన్న 28 మంది సహచరులు చనిపోయారు. ఆ తరువాత పార్టీ పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలటరీ కమిషన్ కమిటీల సంయుక్త సమావేశం జరగలేదు. దీంతో పార్టీకి సీనియర్ నేత ముప్పాళ లక్ష్మణ్ రావు దిశా నిర్దేశం చేస్తున్నట్టుగా ప్రచారం జరిగింది. పెద్దపల్లి వేణుగోపాల్ రావు పై మొదట్లో ప్రచారం జరిగింది అయితే తాజాగా కేంద్ర కమిటీ బాధ్యతలను తిప్పిరి తిరుపతికి అప్పగించినట్టుగా వెలుగులోకి వచ్చింది. దీంతో మరోసారి తెలుగు నాయకత్వానికే పట్టం కట్టినట్టయింది. **జగిత్యాలకే జై.....**జగిత్యాలకే రెండో సారి మావోయిస్టు పార్టీ జై కొట్టింది. ఏపీలోని విజయవాడ ప్రాంతానికి చెందిన కొండపల్లి సీతారామయ్యను బాధ్యతల నుండి తప్పించిన తరువాత ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతనంగా ఆవిర్భవించిన జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రానికి చెందిన ముప్పాళ లక్ష్మణ్ రావు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాలి మండలం జియన్నపేటకు చెందిన నంబళ్ల కేశవరావు పార్టీ సుప్రీంగా వ్యవహరించారు. తాజాగా ఈ బాధ్యతలు అప్పగించిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజీ జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన వారు. పొలిట్ బ్యూరోలో కీలక బాధ్యతలు వహించిన వారికే ఇంతకాలం సీసీ కమిటీ కార్యదర్శి బాధ్యతలు అప్పగించే వారు. ఈ సారీ మిలటరీ కమిషన్ చీఫ్ గా, పొలిట్ బ్యూరో సభ్యునిగా ఉన్న తిప్పిరి తిరుపతికి ఈ బాధ్యతలు అప్పగించడం గమనార్హం. అయితే పెద్దపల్లి పట్టణానికి చెందిన మరో కీలక నేత మల్లోజ్జుల వేణుగోపాల్ పేరు కూడా పరిశీలనకు వచ్చినప్పటికీ దేవుజీ వైపే ముఖ్య నాయకత్వం మొగ్గు చూపినట్టుగా తెలుస్తున్నది. పార్టీ ఆర్థిక వేత్తగా, కేంద్ర కమిటీ సభ్యునిగా పని చేస్తున్న వేణుగోపాల్ అలియాస్ భూపతి అలియాస్ అభయ్ అలియాస్ సోనూ దాదా విధాన నిర్ణయాల్లో కీలక భూమిక పోషిస్తున్నారు.

మిలటరీ ఆపరేషన్లలో దిట్టగా పేరున్న ముఖ్య నేతల్లో ఒకరైన దేవ్ జీ కి ఈ బాధ్యతలు అప్పగించినట్టయితే సముచితంగా ఉ ఒటుందని భావించినట్టుగా సమాచారం. దండకారణ్యంలో పార్టీ కార్యకలాపాల నిర్వహణకు ప్రతికూల పరిస్థితులు నెలకొనడం, రెడ్ కారిడార్ ఏరియాలో చాలా భూభాగాన్ని బలగాలు కైవసం చేసుకున్నాయి. అంతేకాకుండా పార్టీ మెయిన్ లీడర్లే లక్ష్యంగా బలగాలు ఆపరేషన్లు చేపడుతున్న క్రమంలో ఎదురు దాడులు చేయాల్సిన ఆవశ్యతకను కూడా కేంద్ర కమిటీ నాయకులు గమనించినట్టుగా తెలుస్తోంది. ఈ కారణంగానే అటు మిలటరీ ఆపరేషన్లు, ఇటు రాజకీ య వ్యవహారాల్లో భాగస్వామ్యం ఉన్న దేవ్ జీ కి బాధ్యతలు అప్పగిం చినట్టయితే సముచితంగా ఉంటుందని ముఖ్య నాయకత్వం యోచించి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.డి కె జడ్ సి లో కూడా మార్పులు చేర్పులు జరిగితే హిడ్మా కు మరింత ఉన్నత పదవి దక్కుతుందని మావోయిస్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ప్రకృతి రక్షణకు ప్రాణ త్యాగం... అటవీ అమరవీరుల జ్ఞాపకం

## సెప్టెంబర్ 11...జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం




భారత దేశం ప్రకృతి ప్రసాదించిన అరణ్య సంపదతో, జీవ వైవిధ్యంతో, వన్య ప్రాణులతో విశిష్టమైన దేశంగా పేరుపొందింది. మన దేశ భూభాగంలో పర్వతాలు, నదులు, పచ్చని చెట్లు, ఔషధ మూలికలు, జంతువులు, పక్షులు సహజంగా లభించే ఈ అరణ్య సంపద మన పర్యావరణ సమ తౌల్యానికి, సాంస్కృతిక వారసత్వానికి, ఆర్థిక వ్యవస్థకు మూలం. అలాంటి అడవులను రక్షించడంలో తమ ప్రాణాలను అర్పించిన అటవీ సిబ్బందిని స్మరించు కోవడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం దేశ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఈ దినోత్సవం ద్వారా వన రక్షకుల ధైర్యం, త్యాగం గుర్తు చేసుకుంటూ అడవుల విలువను జాతీయ స్థాయిలో ప్రతిపాదిస్తారు. అడవులను కాపాడటం కేవలం వృత్తిపరమైన విధి కాదు, అది ఒక సవాళ్లతో కూడిన కర్తవ్యం. అరణ్య సంపదను కాపాడే క్రమంలో ఫారెస్ట్ గార్డులు, రేంజర్లు, అధికారులు ప్రతిరోజూ అనేక కష్టసుఖాలు భరిస్తారు. వేటగాళ్లు, అక్రమ కలప మాఫియాలు, వన్యప్రాణి స్మగ్లర్లు వంటి నేరగాళ్లను అడ్డుకోవడంలో వారు నిరంతరం ప్రాణహానిని ఎదుర్కొంటారు. అనేక మంది తమ కర్తవ్యాలను నిర్వర్తించే క్రమంలో ప్రాణాలను త్యాగం చేశారు. అలాంటి వీరుల జ్ఞాపకార్థమే ఈ దినాన్ని పాటిస్తారు. ఈ దినోత్సవానికి వెనుక ఒక చారిత్రక సంఘటన ఉంది. 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపంలోని ఖేజర్లీ గ్రామంలో బిష్ణోయీ తెగ ప్రజలు అమర త్యాగం చేశారు. అప్పటి రాజు అభయ్ సింగ్ తన రాజభవనం నిర్మాణం కోసం కలప సేకరించమని సైనికులకు ఆదేశించగా వారు ఆ గ్రామంలోని చెట్లను నరికేందుకు వచ్చారు. అప్పుడు అమృతా దేవి అనే బిష్ణోయీ మహిళ చెట్లను రక్షించేందుకు అడ్డుపడింది. ఆమె ధైర్య సాహసాలను అనుసరించి గ్రామంలోని 363 మంది పురుషులు, మహిళలు, పిల్లలు చెట్లను హత్తుకొని నిలబడ్డారు. సైనికులు వారిని క్రూరంగా హత్య చేశారు. ఈ సంఘటనలో 363 మంది అమరుల త్యాగంతో చెట్లు రక్షించ బడ్డాయి. ప్రకృతిని కాపాడటానికి, పర్యావరణాన్ని నిలబెట్టడానికి ఈ బలిదానం ఎంత ముఖ్యమో ప్రపంచానికి ఈ సంఘటన చాటి చెప్పింది. ఈ స్ఫూర్తి దాయక చరిత్ర ఆధారంగానే 2001లో కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవంగా పాటించాలని ప్రకటించింది. ఈ దినోత్సవం లక్ష్యాలు స్పష్టమైనవే. అటవీ సిబ్బంది చేసిన త్యాగాలను గుర్తించడం, వారికి గౌరవం ఇవ్వడం, అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామిగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేయడం. కఠిన పరిస్థితుల్లో విధులు నిర్వహించే అటవీ సిబ్బందికి నైతిక మద్దతు ఇవ్వడం. అడవులు మన ఊపిరితిత్తులని, అవి లేకుండా మనుగడ అసాధ్యమని ప్రతీ ఒక్కరికి గుర్తు చేయడం. దేశవ్యాప్తంగా ఈ రోజు అనేక కార్యక్రమాలు జరుగుతాయి. అమర వీరుల స్మారక స్థలాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అటవీ శాఖలు ప్రత్యేక సభలు నిర్వహించి, త్యాగుల జాబితాను చదివి గౌరవం అర్పిస్తాయి. విద్యాసంస్థల్లో అరణ్య సంరక్షణ ప్రాముఖ్యతపై సదస్సులు, చర్చలు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. వృక్షారోపణ కార్యక్రమాలు చేపట్టి కొత్త చెట్లను నాటుతారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞలు చేస్తారు. పర్యావరణ సంఘాలు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తాయి. ప్రస్తుతం దేశ భూభాగంలో సుమారు 21 శాతం మాత్రమే అరణ్య విస్తీర్ణం ఉంది. అది సరిపోదు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, వర్షాభావం, భూక్షయం పెరుగుతున్న ఈ కాలంలో అడవుల పరిరక్షణ అత్యవసరం. అటవీ అమరవీరుల త్యాగం మనకు శాశ్వత స్ఫూర్తి. ప్రకృతిని కాపాడటం అనేది మనందరి కర్తవ్యమని, మనం ప్రకృతిని రక్షిస్తేనే ప్రకృతి మనల్ని రక్షిస్తుందని ఈ దినోత్సవం మళ్లీ మళ్లీ గుర్తుచేస్తుంది. కాబట్టి జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం ఒక స్మారకదినం మాత్రమే కాదు, పర్యావరణ జాగరణకు చిహ్నం. అరణ్యాలను రక్షించేందుకు, జీవ వైవిధ్యాన్ని నిలబెట్టేందుకు, వనరక్షకుల త్యాగాన్ని స్మరించేందుకు, భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపదను అందించేందుకు ప్రతి భారతీయుడి మనసులో దీపంలా వెలిగే స్ఫూర్తి. బిష్ణోయిల త్యాగం, అటవీ సిబ్బంది ధైర్యం మనం మరవలేము. ఈ దినోత్సవం మనలో ప్రతి ఒక్కరినీ అడవులను రక్షించే కర్తవ్యానికి అంకితులను చేస్తూ, సహజ సంపద కాపాడే బాధ్యతను గుర్తు చేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# "రైతు చెమట పరిమళం... దువ్వూరి నింపిన కవిత్వం"

## సెప్టెంబర్ 11...కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి



తెలుగు సాహిత్య చరిత్రలో 20వ శతాబ్దం అత్యంత విప్లవాత్మకమైన కాలం. ఆ కాలంలో కవిత్వం, సాంప్రదాయ అలంకారాల కట్టుబాట్ల నుంచి విముక్తి పొంది, సమాజ వాస్తవాల వైపు పయనించింది. ఈ మార్గాన్ని నిర్మించడంలో, ముఖ్యంగా గ్రామీణ జీవన వాస్తవాలను కవిత్వంలో ప్రతిబింబింప జేయడంలో దువ్వూరి రామిరెడ్డి పేరు ఎల్లప్పుడూ ప్రథమ కక్ష్యలో నిలుస్తుంది. రైతు జీవితం లోని చెమట, కన్నీరు, ఆశలు, నిరాశలు, భూమి తల్లితో ఉన్న అనుబంధం – ఇవన్నింటినీ ఆయన కవిత్వం తన స్వర సౌందర్యంతో మిళితం చేసింది. అందుకే ఆయనను సాహిత్య ప్రపంచం "రైతు కవి", "కవి కోకిల" అని గౌరవంగా అభివర్ణించింది. దువ్వూరి రామిరెడ్డి 1895 నవంబర్ 9న ప్రస్తుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరులో జన్మించారు. తల్లిదండ్రులు సుబ్బరామిరెడ్డి, రంగమ్మ. చిన్నతనం నుంచే ఆయనలో సాహిత్యాసక్తి పుట్టి, కవిత్వంపై మక్కువ పెరిగింది. మెట్రిక్యులేషన్ వరకు చదివినా, తరువాత స్వయంగా సంస్కృతం, ఆంగ్లం, ప్రాకృతం వంటి భాషలలో దిట్ట అయ్యారు. పుస్తకాల పఠనం ఆయనకు దారి చూపగా, పల్లెటూరి వాతావరణం, పొలాల మధ్య రైతు శ్రమ, ప్రకృతి సౌందర్యం ఆయన మనసును ప్రభావితం చేశాయి. జీవితాంతం ఆయన వ్యవసాయాన్ని జీవనాధారంగా, కవిత్వాన్ని హృదయాధారంగా స్వీకరించారు. ఆయన సాహిత్య ప్రస్థానం తెలుగు కవిత్వానికి ఒక కొత్త దిశను చూపింది. 1925లో వెలువడిన "కృషీ వలుడు" ఆయనకు విశేష ఖ్యాతి తెచ్చిపెట్టింది. ఇందులో రైతు జీవనాన్ని అత్యంత వాస్తవికంగా, భావోద్వేగంతో వర్ణించారు. పల్లె జీవనపు సౌందర్యం, రైతు శ్రమలోని విలువ, భూమి తల్లి పట్ల ఆరాధన %–% ఇవన్నీ ఈ కావ్యంలో ప్రతిబింబించాయి. తెలుగు కవిత్వంలో రైతు వర్గం సమస్యలను ఇంత లోతుగా ప్రతిఫలింపజేసిన కావ్యాలు అరుదు. రైతు పాటను, రైతు కన్నీటిని, రైతు గుండె చప్పుళ్లను సాహిత్యంలో శాశ్వతంగా నిలిపిన కృషి దువ్వూరివే. 1927లో ఆయన చేసిన "పానశాల" అనువాదం తెలుగు పాఠకులకు కొత్త తాత్విక లోకాన్ని పరిచయం చేసింది. ఒమర్ ఖయ్యామ్ పర్షియన్ కవిత్వాన్ని తెలుగు భాషలో మలచి, క్షణికానందం, జీవన తాత్పర్యం, మానవ జీవితపు అనిశ్చితి వంటి అంశాలను సున్నితంగా ఆవిష్కరించారు. "వనకుమారి", "జలదాంగన", "అహల్య", "మధు సంచయం" వంటి ఇతర రచనల్లో ప్రేమ, ప్రకృతి వైభవం, పురాణ కథనాల మానసిక లోతులు ప్రతిఫలించాయి. "కృష్ణవేణి", "కార్షకులు", "కరుణ", "మల్లెపూలు" వంటి ఆయన సృజనాత్మక కృతులు గ్రామీణ జీవనాన్ని, మానవతను, ప్రకృతిని కవిత్వరూపంలో ఆవిష్కరించాయి. దువ్వూరి రామిరెడ్డి కవిత్వం సౌలభ్యం, మాధుర్యం, భావ పరిపూర్ణతతో నిండివుంది. ఆయన భాష పల్లెటూరి వాసనలాగే సహజసిద్ధంగా ఉంటుంది. ఆ మాధుర్యం వలననే నెల్లూరులోని సనాతన ధర్మ కళాశాల ఆయనకు "కవి కోకిల" బిరుదు ప్రదానం చేసింది. కవిసభల్లో, సాహిత్య వర్గాల్లో ఆయన కవిత్వాన్ని విన్నవారు కవిగానం అనుభూతిని పొందేవారు. ఆయన సాహిత్య సేవలకు గాను వివిధ విశ్వవిద్యాలయాలు, సాహిత్య సంఘాలు గౌరవించాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయనను జ్ఞానపీఠ అవార్డుకు తెలుగు రచయితల తరపున సిఫార్సు చేసిన సందర్భమూ ఉంది. ఆయన కీర్తి కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాక, భారత సాహిత్య వేదికలపై కూడా ప్రతిధ్వనించింది. 1947 సెప్టెంబర్ 11న ఆయన కన్నుమూశారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిన వేళలోనే తెలుగు సాహిత్యం ఒక మహనీయ కవిని కోల్పోయింది. అయినా ఆయన కవిత్వం ఇప్పటికీ పల్లె పొలాల్లో మురిపించే పల్లె పాటల్లా, రైతు చెమట పరిమళంలా నిలిచివుంది. నేటికీ రైతు సమస్యలపై చర్చలప్పుడు, గ్రామీణ వాస్తవాలపై విశ్లేషణలప్పుడు ఆయన కవిత్వం ప్రస్తావన తప్పనిసరిగా వస్తుంది. దువ్వూరి రామిరెడ్డి కవిత్వం భూమి తల్లిని స్తుతించిన రైతు స్వరమైతే, తెలుగు సాహిత్యానికి రైతు జీవితాన్ని పరిచయం చేసిన ప్రథమ యత్నం కూడా. ఆయన రచనలు మనకు జీవనాన్ని చూడటానికి కొత్త కళ్ళను ఇస్తాయి, రైతు జీవితాన్ని అర్థం చేసుకోవడానికి కొత్త మనసును అందిస్తాయి. అందుకే ఆయన సాహిత్య వారసత్వం నిత్యనూతనంగా మనతోనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పాక్.. లంక.. నేపాల్.. చైనాను నమ్మితే పరారే పరారే..



నాలుగేళ్లలో భారత్ ఇరుగుపొరుగున ఉన్న నాలుగు దేశాల్లో రాజకీయ అనిశ్చితి...! వీటిలో మూడు దేశాల్లో ప్రధానులు దిగిపోగా.. మరో దేశంలో అధ్యక్షుడు పరారయ్యారు. మరీ ముఖ్యంగా వీరిలో మూడు దేశాల వారు చైనాతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగారు. తర్వాత పదవులు కోల్పోయారు. మరో దేశాధినేత కూడా కాస్త చైనాతో సన్నిహితంగా మెలిగినా భారత్ వైపే ఎక్కువ మొగ్గుచూపారు.

**పరారే పరారే...** 2022లో శ్రీలంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్సేపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ధరలు విపరీతంగా పెరగడం, గొటబాయ సోదరుల అవినీతితో ప్రజలు విసుగెత్తారు. ఏకంగా అధ్యక్ష భవనంలోకి చొరబడి చేతికందిన వస్తువులను ఎత్తుకెళ్లారు. కొందరైతే భవనంలో విచ్చలవిడిగా ప్రవర్తించారు. గొటబాయలపై ప్రధాన ఆరోపణల్లో ఒకటి.. వారు చైనాకు తొత్తులుగా వ్యవహరించడం. భారత్‌కు వ్యతిరేకంగానా అన్నట్లు వీరు చైనా పెట్టుబడులను ప్రోత్సహించారు. ఓ పోర్టులో చైనా, గొటబాయ సోదరులు పెట్టుబడులు పెట్టడం గమనార్హం.

**హసీనాపై కుట్రలు...** నిరుడు ఆగస్టులో బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వంపై ఆందోళనలు మిన్నంటాయి. ఆమె ప్రభుత్వంలో అవినీతిపై అప్పటికే ఆగ్రహం ఉన్నా.. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు రిజర్వేషన్ల పొడిగింపును ఆసరాగా చేసుకుని ఆందోళనకారులు రెచ్చిపోయారు. రెండు మూడు నెలలైనా ఆగ్రహ జ్వాల ఎంతకూ చల్లారలేదు. దీంతో హసీనా దిగిపోక తప్పలేదు. ఆమె చివరకు భారత్‌కు వచ్చేశారు. హసీనా భారత్‌కు మద్దతుదారు. చైనాతో ఎప్పుడూ ఆమె సన్నిహితంగా ఉన్నట్లు కనిపించలేదు. కానీ, అమెరికా డిమాండ్లను నెరవేర్చకపోవడం హసీనాపై కుట్రకు దారితీసిందని చెబుతున్నారు.

**రష్యా వెళ్లి.. చైనా మద్దతుతో...** –ఉక్రెయిన్–రష్యా యుద్ధం మొదలైన సమయంలో రష్యాలో పర్యటించారు పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్. ఈయన చైనాతో భుజంభుజం రాసుకుని తిరిగారు. ఆ తర్వాత పదవిని కోల్పోయారు. చైనా... ఎప్పటినుంచో పాక్‌లో పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. అంతేగాక చైనా చెప్పినట్లు పాక్ ఆడుతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఆ దేశం సాయం పొందింది. ఇమ్రాన్.. పరారు కాకున్నా, జైల్లో ఉన్నారు.

**ఇప్పుడు నేపాల్ వంతు...** భారత్–చైనాకు మధ్యలో ఉండే నేపాల్ ఇప్పుడు అట్టుడుకుతోంది. ప్రధాని పదవికి రాజీనామా చేసిన కేపీ శర్మ ఓలీ.. చైనాకు సన్నిహితుడు. భారత్‌కు వ్యతిరేకి. నేపాల్‌లో అమెరికా సంస్థలు చేపట్టిన ప్రాజెక్టులకు ఓలీ ప్రభుత్వం అడ్డంకులు కల్పిస్తోందని, దీంతో ఆయనకు వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతమైంది. ఓలీ.. ఓ దశలో దుబాయ్‌కు పారిపోయినట్లు ఊహాగానాలు వినిపించాయి. కానీ, ఆయన నేపాల్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. –ఈ కథనంతో సంబంధం లేకున్నా.. 2021లో తాలిబన్లు రాజధాని కాబూల్‌లోకి రావడంతో అఫ్ఘానిస్థాన్ అప్పటి అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ దేశం విడిచివెళ్లిపోయారు. –తిరుగుబాటుదారులు పైచేయి సాధించడంతో గత ఏడాది చివర్లో సిరియా అధ్యక్షుడు అసద్ కూడా దేశం విడిచి వెళ్లిపోయారు.

# నేపాల్ ఇంతలా రగిలి పోవడానికి కారణం

నేపాల్‌లో ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చిన #NepoKids ఉద్యమం ఆ దేశ రాజకీయ, సామాజిక వాతావరణంలో పెను మార్పులకు నాంది పలికింది. ఇది కేవలం ఒక హ్యాష్‌ట్యాగ్ కాదు.. వ్యవస్థపై, అసమానతలపై యువతలో పేరుకుపోయిన కోపానికి, నిరాశకు ప్రతీకగా మారింది. ఈ ఉద్యమానికి ప్రధాన కారణం.. రాజకీయ నాయకుల పిల్లలు, వారి విలాసవంతమైన జీవితం. ఇది సామాన్య నేపాలీ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులకు పూర్తి విరుద్ధంగా ఉంది.

**విలాసానికి, వలస కష్టాలకి మధ్య అగాధం...** ప్రస్తుతం నేపాల్‌లోని చాలా మంది యువత నిరుద్యోగ సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక అవకాశాలు లేక, మెరుగైన జీవితం కోసం విదేశాలకు, ముఖ్యంగా గల్ఫ్ దేశాలు, భారత్ లాంటి ప్రాంతాలకు



వలస వెళ్తున్నారు. మరోవైపు దేశ రాజకీయ నాయకుల పిల్లలు విదేశీ విద్య, ఖరీదైన కార్లు, బ్రాండెడ్ దుస్తులు, విలాసవంతమైన టూర్లతో వారి జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఈ వైరుధ్యం సోషల్ మీడియా వేదికగా వెలుగులోకి రావడంతో యువతలో అసహనం, ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

**సోషల్ మీడియా నుంచి వీధుల వరకు...** ఈ నిరసనలు మొదట టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, పోస్ట్‌ల ద్వారా మొదలయ్యాయి. #NepoKids హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా ట్రెండ్ అయింది. అయితే కేవలం ఆన్‌లైన్ నిరసనలకు మాత్రమే ఇది పరిమితం కాలేదు. సోషల్ మీడియాలో మొదలైన ఈ ఆగ్రహం నెమ్మదిగా వీధుల్లోకి చేరింది.

యువత నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ ఉద్యమం రాజకీయ కుటుంబాల వారసత్వం, అవినీతి, మెరిట్ లేని అవకాశాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**భవిష్యత్తుపై ప్రశ్నార్థకం...** #NepoKids ఉద్యమం నేపాల్ రాజకీయ వ్యవస్థకు ఒక బలమైన హెచ్చరిక. ఇది కేవలం తాత్కాలిక నిరసన కాదని, భవిష్యత్తులో రాజకీయాల్లో భారీ మార్పులకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. యువత నిరాశ, అసంతృప్తి గమనించకపోతే ఈ ఉద్యమం మరింత విస్తరించి, వ్యవస్థాగత మార్పులకు దారితీయవచ్చు. ఈ ఉద్యమం నేపాల్‌లోని యువతలో పెరిగిన రాజకీయ చైతన్యాన్ని, తమ భవిష్యత్తును తామే నిర్మించుకోవాలనే వారి ఆకాంక్షను స్పష్టంగా సూచిస్తుంది. ఇది కేవలం ఒక హ్యాష్‌ట్యాగ్ కాదు, నేపాల్ రాజకీయ భవిష్యత్తుకు ఒక సంకేతం.

# రేంజ్ రోవర్ ప్రియులకు శుభవార్త..

## నిజం తెలిస్తే ఎగిరిగంతేస్తారు!

జీఎస్టీ లో గణనీయంగా మార్పులు తీసుకురావడం వల్ల.. చాలా వస్తువులపై ధరలు తగ్గుతున్న విషయం తెలిసిందే. ఇక మిగతా వస్తువుల సంగతి పక్కన పెడితే.. ముఖ్యంగా కారు ధరలలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తగ్గిన ధరలు సెప్టెంబర్ 22 నుండి అందుబాటులోకి వస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా చాలా వాహన తయారీ సంస్థలు సెప్టెంబర్ 22 నుండి తగ్గిన జీఎస్టీ అమలులోకి రాబోతూ ఉండగా.. సెప్టెంబర్ 6 నుండే మహీంద్రా కంపెనీ మాత్రం వినూత్నమైన ఆలోచనతో అతి తక్కువ ధరలకే తమ %ాఖఒ% కారులను వినియోగదారులకు అందివ్వడానికి సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఇప్పుడు జీఎస్టీ రేట్ల తగ్గుదలతో ఈ ప్రయోజనాన్ని కొనుగోలుదారులకు బదిలీ చేయడంలో భాగంగా రేంజ్ రోవర్ కూడా తన కష్టమర్లకు ఒక శుభవార్తను తెలిపింది. జాగ్వార్ లాండ్ రోవర్ తన వాహన మోడళ్ల ధరను రూ. 4. 5 లక్షల నుండి ఏకంగా రూ. 30. 4 లక్షల వరకు తగ్గించింది. ప్రస్తుతం ఈ రేట్ల తగ్గింపును తక్షణమే అమలులోకి తెచ్చినట్లు కూడా తెలిపింది. ఈ విషయం తెలిసి కష్టమర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా రేంజ్ రోవర్ పై రూ. 30. 4 లక్షల వరకు తగ్గుదల ఉంటుందని స్పష్టం



చేయడంతో అభిమానులు ఎగిరి గంతేయడమే కాకుండా ఇప్పుడు దీనిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. ఇక ఈ రేంజ్ రోవర్లో డిఫెండర్ ధర రూ. 7 –18. 60 లక్షలు, డిస్కవరీ ధర రూ. 4. 5 – రూ. 9. 90 లక్షల మేర తగ్గాయి. రేంజ్ రోవర్ తో పాటు ఈనెల 22 నుండి బజాజ్ ఆటో, హోండా కార్స్ ఇండియా ,వోల్వో కార్ ఇండియా, జీప్ ఇండియా తగ్గించిన కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. వోల్వో కార్ ఇండియా తన వాహన మోడల్ ధరలను రూ. 6.9 లక్షల వరకు తగ్గించనున్నట్లు తెలిపింది. నీ హోండా కార్స్ ఇండియాకు చెందిన కాంపాక్ట్ సెడాన్ ధర రూ. 95,000 వరకూ ధర తగ్గగా.. సిటీ మోడల్ ధర రూ. 57,500, ఎలివేట్ ధర రూ. 58,400 వరకు తగ్గినట్లు సమాచారం. కేటీఎం మోడల్స్ విషయానికి వస్తే.. ఈ మోడల్స్ తో పాటు మోటార్ సైకిల్ మోడల్స్ ధరలను కూడా తగ్గించారు.

ద్విచక్ర వాహనాలపై రూ. 20,000 త్రి చక్ర వాహనాలపై రూ. 24 వేల వరకు తగ్గించనున్నట్లు బజాజ్ ఆటో తెలిపింది. జీప్ ఇండియా వాహన మోడల్స్ అయిన కంపాస్, గ్రాండ్ చెరోకి, ర్యాంగ్లర్, మెరీడియన్ వంటి మోడల్స్ పై రూ. 1. 26 లక్షల నుండీ రూ. 4. 8 లక్షల వరకు ధరలు తగ్గనున్నాయి. ఏది ఏమైనా ఇప్పుడు వాహనాలపై ఈ రేంజ్ లో ధరలు తగ్గించడం నిజంగా సామాన్యుడికి మరింత ఊరట కలిగింది అని చెప్పవచ్చు.

చురకలు



చురకలు

## సంపాదకీయం

# శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్..

# భారత్ చుట్టూ అగ్రరాజ్యాల కుట్ర?

ఇటీవలి సంవత్సరాల్లో దక్షిణాసియాలో ఒక ఆందోళనకర దృశ్యం వెలిసింది. శ్రీలంక, బంగ్లాదేశ్, ఇప్పుడు నేపాల్.. మూడు దేశాలు మూడు వేర్వేరు సందర్భాల్లో ఆందోళనల తాకిడికి తలొగ్గాయి. ఒక్కో ఉద్యమం ఒక్కో రూపంలో ప్రారంభమై చివరకు దేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తూ, రాజకీయ వ్యవస్థలను కుదేలు చేస్తూ ముందుకు సాగాయి. ఇవి సహజసిద్ధంగానే జరిగాయా? లేక అగ్ర రాజ్యాల గూఢచర్య వ్యూహాల ఫలితమా? అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వెతికే అవసరం ఉంది. శ్రీలంకలో జరిగిన ఆందోళనలతోనే ఈ శ్రేణి ప్రారంభమైంది. కుటుంబ పాలన, అవినీతి వంటి సమస్యలే కారణమని అంతర్జాతీయ మీడియా ఆరాటపడింది. కానీ ఆ తరువాత ఏర్పడిన పరిణామాలు మరో దిశలో చూపించాయి. అమెరికాకు అనుకూల ప్రభుత్వం ఏర్పడి, వనరులపై ఆ దేశం ఆధిపత్యం పెరగడం యాదృచ్ఛికం కాదు. దీని తరువాత బంగ్లాదేశ్. అమెరికా వ్యతిరేక వైఖరి కనబరచిన ప్రధానమంత్రి షేక్ హసీనా ఆందోళనల దెబ్బకు పదవి కోల్పోవడం, దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి రావడం.. ఇది కూడా కేవలం ప్రజా ఉద్యమం ఫలితమని చెప్పడం కష్టం. ఉద్యమాల వెనుక అంతర్జాతీయ ఆటతీరు స్పష్టంగా కనిపించింది. ప్రస్తుతం నేపాల్‌లో పరిస్థితి కూడా అలానే ఉంది. పార్లమెంట్ భవనం దగ్ధమవ్వడం, ప్రభుత్వ ఆస్తులు నాశనం కావడం, సైన్యం నియంత్రణలోకి వచ్చినా అల్లర్లు ఆగకపోవడం.. ఇవి అన్నీ ఒక దేశాన్ని బలహీనపరిచే ప్రణాళికలుగానే అనిపిస్తున్నాయి. ఈ క్రమాన్ని గమనిస్తే.. దక్షిణాసియాలో అమెరికా–చైనా వ్యూహ పోరు ప్రధాన కారణమని అనిపిస్తుంది. అమెరికా తనకు అనుకూల ప్రభుత్వాలను కూర్చబెట్టుకోవాలని, చైనా భారతదేశాన్ని చుట్టుముట్టి బలహీనపరచాలని ప్రయత్నిస్తోంది. ఈ పోటీ వల్ల చిన్న దేశాలు బలహీనమవుతుండటం, ఆర్థికంగా దెబ్బతినడం అనివార్యం. కానీ ప్రశ్న ఏమిటంటే.. మన దేశం సురక్షితమా? రైతు ఉద్యమం రూపంలో గతంలో ప్రయత్నాలు జరిగాయి. సీఏఏ ఆందోళనలు సాగాయి. భవిష్యత్తులో మరో రూపంలో తిరిగి రాకుండా ఎవరూ హామీ ఇవ్వలేరు. పుకార్లకు, మాయాజాలాలకు, అవాంఛిత ఆందోళనలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. మొత్తానికి చుట్టుపక్కల రగులుతున్న నిప్పులు మనకూ తాకే ప్రమాదం ఉంది. దానిని ఆపేది అవగాహన, అప్రమత్తత, దృఢనాయకత్వమే.


# శ్రోతల జీవితాలలో భాగాలు... బావగారి కబుర్లు - సెప్టెంబర్ 11... ప్రయాగ నరసింహ శాస్త్రి వర్ధంతి



ఆకాశవాణి శ్రోతలకు చిర పరిచితులు ప్రయాగ నరసింహ శాస్త్రి. రేడియోనే ప్రధాన మనో రంజక సాధనంగా ఒకనాటి ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకున్న రోజులలో ప్రయాగ నిత్య విధి కార్యక్రమాలు శ్రోతల జీవిత భాగస్వాములు అయినా యంటే అతిశయోక్తి కాదేమో. ఆకాశ వాణి ప్రయోక్తగా, తెలుగు సినీ నటునిగా, హరికథకులుగా, రచయితగా, గాయకునిగా ప్రయాగ నరసింహ శాస్త్రి (నవంబరు 20, 1909 – సెప్టెంబరు 11, 1983) తెలుగు ప్రజలకు రేడియో ద్వారా చిర పరిచితులు. తన ప్రత్యేక కంఠ స్వరంతో ఖంగుమని పలుకుతూ, జానపద శైలిలో పాడుతూ శ్రోతల్ని ఉర్రూత లూగించిన వ్యక్తి శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి. మూడు దశాబ్దాలు ఆకాశవాణిలో పనిచేసి ప్రశంసా పాత్రుడైన వ్యక్తి. 1936 లో ప్రయాగ ఆకాశవాణి మదరాసు కేంద్రంలో నిలయ విద్వాంసు డుగా చేరారు. ' బావగారి కబుర్ల ద్వారా ఆయన శ్రోతలకి చేరువయ్యారు. ఆయన, గాడేపల్లి సూర్య నారాయణతో కలిసి బావగారి కబుర్లు నిర్వహించే వారు. అవి శ్రోతల జీవనంలో భాగమై పోయాయి. "ఏమండోయ్ బావగారు రావాలి రావాలి" అనే పలకరింపులు సహజమ య్యాయి. స్క్రిప్టు లేకుండా యధాలాపంగా అనర్గళంగా తన సంభాషణలతో వినోదాన్ని అందించేవారు ప్రయాగ. నరసింహశాస్త్రి 1909 నవంబర్ 20 న విశాఖపట్నం జిల్లా పెదగాడి గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యం నుండి సంగీత సాహిత్యాలపై అపారమైన ప్రీతి. విజయనగరం మహారాజా కళాశాలలో చదువు కొని పట్టభద్రులయ్యారు. శ్రీశ్రీ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ఆయన సహాధ్యాయులు. హరికథా పితామ హుడు ఆదిభట్ల నారాయణ దాసు వద్ద హరికథా గానంలో మెళుకువలు నేర్చు కొన్నారు. చక్కని గాత్రము రూపము ఉన్న ప్రయాగ 1935లో చలన చిత్రరంగ ప్రవేశం చేశారు. భీష్మ చిత్రంలో విచిత్ర వీర్యుని పాత్రను పోషించారు. నాగయ్య గారి త్యాగయ్య చిత్రంలో గణపతి పాత్రను పోషించారు. అనేక చిత్రాలకు పాటలు వ్రాశారు. 1969లో ఆకాశ వాణిలో పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ నటన పై ఆసక్తి తో చిత్రరంగంలో ప్రవేశించారు. చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం వంటి సినిమాలలో నటించారు. ఆకాశవాణి మదరాసు కేంద్రంలో 1936 నుండి రెండు దశాబ్దాలు పని చేశారు. అక్కడ వీరు ప్రసారం చేసిన మొద్దబ్బాయ్ హెచ్.ఎం.వి. గ్రామఫోన్ రికార్డు కంపెని వారు రికార్డు చేసి విడుదల చేశారు. 20కి పైగా హెచ్.ఎం.వి. రికార్డులు ఆయన విడుదల చేశారు. శ్రోతలలో వీరికంత ప్రశస్తి వుండేది. 1956లో ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి బదలీ అయ్యారు. అక్కడ పింగళి లక్ష్మీకాంతం, బందా కనక లింగేశ్వర రావు, బాలాంత్రపు రజనీ కాంత రావు, జరుక్ శాస్త్రి, బాల మురళి, ఓలేటి వంటి పండితుల సాహచర్యం లభించింది. విజయవాడలో ప్రయాగ గ్రామీణ కార్యక్రమాల ప్రయోక్తగా పనిచేశారు. ఎన్నో జానపద గేయాలను పాడి, పాడించి శ్రోతల మన్ననలందు కొన్నారు. హరికథలు స్వయంగా రచించి గానం చేశారు. త్యాగరాజ చరిత్ర, కన్యాకుమారి, గాంధీజీ, శంకర విజయం హరి కథలు ప్రముఖాలు. 1962లో భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సమక్షంలో గాంధీజీ బుర్రకథను వినిపించి బంగారు పతకంతో సన్మానించ బడ్డారు. ఆయన వివిధ బుర్రకథలు హెచ్.ఎం.వి. గ్రామఫోను రికార్డులుగా విడుదలైనాయి. వినోదాల వీరయ్యగా విజయ వాడ కేంద్రం నుండి ఎన్నో కార్యక్రమాలు సమర్పించారు. ఆకాశవాణిని ప్రయాగకు ఆరోప్రాణంగా భావించే వారు. 1969లో పదవీ విరమణ చేసేంత వరకు ఆయన ప్రయోక్తగా ఎన్నో కార్యక్రమాలు వెలువడ్డాయి. 1970 నుండి ఐదు సంవత్సరాలు కేంద్ర సంగీత నాటక అకాడమీ పక్షాన ' బాలాజీ ఆర్ట్ థియేటర్ ' పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. 1980 నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంగీత కళా పీఠంలో యక్షగానాలు, హరికథల అధ్యాపకులుగా పని చేశారు. హిందు ధర్మ ప్రచార పరిషత్ లో జానపద కళా ప్రచారకులుగా వ్యవహరించారు. 1983 సెప్టెంబరు 11న పరమ పదించారు. మాట, పాట, ఆటలతో శ్రోతల్ని సంబరపెట్టిన ప్రయాగ నిత్యోత్సాహి. ప్రయాగ నరసింహ శాస్త్రి కుమార్తె వేదవతి ఆకాశవాణిలో నిజామాబాద్ లో అసిస్టెంట్ స్టేషను డైరక్టరుగా సుపరిచితులు. భీష్మ – విచిత్ర వీర్యుడు, త్యాగయ్య – గణపతి, చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం తదితర చిత్రాలలో ఆయన నటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సంఘ సంస్కర్త ఆచార్య వినోబా భావే - సెప్టెంబర్ 11...వినోబా భావే జయంతి



వినోబా భావే (1895–1982) భారత దేశంలో ఆధ్యాత్మికత, సామాజిక, గ్రామీణ పునరుద్ధరణకు అపార కృషి చేసిన మహనీయుడు. ఆయన గాంధీయేతర కాలంలో కూడా గాంధీజీ ఆశయాలను జీవితమంతా పాటిస్తూ, సమాజ సుభిక్షత కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారు. వినోబా భావే మహాత్మా గాంధీ శిష్యుడిగా, సార్వజన సౌభ్రాతృత్వం, శాంతి, సామాజిక సమానత్వం కోసం తన జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేశారు. వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్ర లోని గగోడా గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనలో ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆయన తల్లి రుక్మిణీదేవి తనకు ఆధ్యాత్మికత మరియు మతంపై ప్రేమను పెంచగా, తండ్రి నారహరి శాస్త్రి గణితం, శాస్త్రాల పట్ల ప్రేరణను అందించారు. ఆయన ముంబైలో విద్య నభ్యసించి నప్పటికీ, గ్రంథాలపై, భక్తి మార్గంపై ఉన్న ఆసక్తి కారణంగా ఆయా రంగాల్లో అభ్యాసం కొనసాగించారు. 1916లో వినోబా మహాత్మా గాంధీని కలుసుకున్నారు. గాంధీజీ ఆత్మనిబద్ధత, సత్యం, అహింసా వంటి సిద్ధాంతాల పట్ల వినోబాను ప్రేరేపించారు. ఈ కలయికతో వినోబా తన జీవితాన్ని సార్వజన సేవకు అంకితం చేస్తూ గాంధీజీ ఆశయాలను స్వీకరించి నడిచారు. గాంధీజీ వినాయక నరహరి భావేను "వినోబా" అని నామకరణం చేశారు. గాంధీజీ మరణం తర్వాత వినోబా భావే భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఆత్మ నిర్భర గ్రామాల రూప కల్పనలో మరింత చురుకుగా పాల్గొన్నారు. 1951లో వినోబా భావే ఆంధ్రప్రదేశ్ లోని పోచంపల్లి గ్రామంలో భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. భూస్వాముల వద్ద ఉన్న భూమిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని ప్రజలను కోరుతూ వినోబా భారత దేశమంతా యాత్ర చేశారు. ఇది సామాజిక న్యాయానికి, భూముల పునరాగమనం కోసం వినూత్న మార్గం అయింది. ఈ ఉద్యమం వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు 40 లక్షల ఎకరాల భూమి పేదులకు లభించింది. భూదాన్ ఉద్యమం వినోబా భావేకు భారతీయ సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగించింది, కేవలం సామాజిక సమానత్వం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత మరియు దాన ధర్మాన్ని ప్రోత్సహించే ఉద్యమంగా గుర్తింపు పొందింది. వినోబా భావే సర్వోదయ ఉద్యమం ద్వారా సర్వజన సమానత్వాన్ని ప్రోత్సహించారు. "సర్వోదయం" అనగా సర్వ ప్రజల ఉజ్వలత అని అర్థం. ఈ ఉద్యమం ద్వారా ఆయన సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన లక్ష్యం సర్వ సమాజం ఒకటిగా ముందుకు సాగాలని, సమాజంలోని ప్రతిఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు. వినోబా భావే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక సుభిక్షత సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. అతని గ్రామస్వరాజ్య కల నేడు స్ఫూర్తిగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మరియు స్వయం–పోషణకు ప్రాముఖ్యతనిస్తూ ఆయన అనేక కార్యక్రమాలను నిర్వహించారు. వినోబా భావే అనేక గ్రంథాలను రచించారు, ఇందులో ప్రముఖమైనది "గీతా ప్రవచన్", ఇది భగవద్గీత పై ఉన్న ఆయన ప్రత్యేకమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. భగవద్గీత పై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది, మరియు ఆయన దానిని ఆచరణలోకి తీసుకురావడం, జీవితంలో సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను పాటించడం ఎంతో ముఖ్యమని నమ్మారు. ఈ రచనలలో వ్యక్తిత్వ పరిపూర్ణత, సామాజిక సవరణ వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి. వినోబా భావే చివరి రోజులను మధ్య భారత దేశంలోని పావ్నార్ లోని తన ఆశ్రమంలో గడిపారు 15 నవంబర్ 1982న అక్కడే తుది శ్వాస విడిచారు. ఆయన మరణించినప్పటికీ ఆయన చూపించిన మార్గం భారతదేశానికి ఒక దీపంగా నిలిచింది. ఆయన ఆదర్శాలు, ముఖ్యంగా భూదాన్ ఉద్యమం, సర్వోదయ ఉద్యమం, గ్రామస్వరాజ్యం – ఇవన్నీ భారతీయ సమాజంలో సతత మార్పులకు దారి చూపిస్తున్నాయి. వినోబా భావే చూపించిన మార్గంలో నడుస్తూ, సమాజసేవ, సామాజిక సవరణ కోసం యత్నించే వారందరికీ ఆయన ఒక స్ఫూర్తి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆల్ ఖైదా ఉగ్ర దాడికి 24 ఏళ్లు

సెప్టెంబరు 11 ఘటనగా పేరెన్నిక గన్న న్యూయార్క్ లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద దాడి జరిగి నేటికి 24 ఏళ్లు గడిచింది. ఈ సంఘటన ద్వారా బిన్ లాడెన్ గురించి ప్రపంచానికి మొత్తం తెలిసింది. అయితే కార్యాన్ని తన చేతుల మీద నిర్వహించిన వ్యక్తి లాడెన్ కాగా దీనికి సూత్రధారి మాత్రం వేరే ఉన్నాడు. 2001 సంవత్సరం సెప్టెం బరు 11న మంగళవారం ఉదయం 8.45కు అమెరికా దేశంలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ పైన లాడెన్ టీమ్ జరిపిన దాడులను చరిత్ర అంత త్వరగా మరవ లేదు. ప్రపంచ దేశాలన్నీ ఒక్కసారిగా ఈ ఘటన కారణంగా ఉలిక్కి పడ్డాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలపై ఆల్‌ఖైదా పక్కా వ్యూహంతో జరిపిన దాడులవి. ఆ రోజు ఉదయం 10 మంది ఆల్‌ఖైదా తీవ్రవాదులు.. వాణిజ్య సేవలందించే నాలుగు ప్రయాణికుల జెట్ విమానాలను దారి మళ్లించారు. హైజాకర్లు రెండు విమానాలను న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్(ప్రపంచ వాణిజ్య సంస్థ)కు చెందిన జంట సౌధాలను ఢీ కొట్టించారు. సౌదీ అరేబియా, ఇతర అరబ్ దేశాలకు చెందిన వారే ఈ ఘటనకు పాల్పడినట్లు తర్వాతి కాలంలో గుర్తించారు. ఈ బృందానికి అప్పటి ఆల్‌ఖైదా నాయకుడు ఓసామా బిన్ లాడెన్ నేతృత్వం వహించారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై జరిగిన దాడి ఘటనలో ప్రయాణికు లందరూ, భవనాల్లో పనిచేస్తున్న అనేక మంది ఇతరులు దుర్మరణం పాలయ్యారు. రెండు సౌధాలు (భవనాలు) అందరూ చూస్తుండగానే గంటల వ్యవధిలో కుప్పకూలి పోయాయి. సమీపంలోని భవనాలు ధ్వంసం అవడం, మరికొన్ని పాక్షికంగా దెబ్బతినడం జరిగింది. మూడో విమానాన్ని హైజాకర్లు వాషింగ్టన్ డీ సీ కి వెలుపల ఉన్న ఆర్లింగ్టన్, వర్జీనియాలోని పెంటగాన్ పైకి వదిలారు. నాలుగో విమానాన్ని అందులోని కొందరు ప్రయాణీకులు మరియు విమాన సిబ్బంది తిరిగి దానిని నియంత్రించే ప్రయత్నం చేసినప్పుడు, గ్రామీణ పెన్సిల్వేనియా లోని షాంక్స్ విల్లేకి సమీపంలో ఉన్న ఒక మైదానంలో అది కుప్ప కూలింది. దీనిని హైజాకర్లు



వాషింగ్టన్ డీ సీ వైపుకు మళ్లించారు. విమానాల్లో ప్రయాణించిన ఏ ఎక్కరూ ప్రాణాలతో బయట పడలేదని వార్తా సంస్థలు నివేదించాయి. 2001 సెప్టెంబరు 11 దాడుల్లో 2763 మంది బాధితులు, 19 మంది హైజాకర్లు మరణించారు. న్యూయార్క్ ప్రభుత్వారోగ్య శాఖ నివేదిక ప్రకారం, జూన్ 2019 నాటికి అగ్నిమాపక దళ సిబ్బంది మరియు పోలీసులు సహా రక్షణ చర్యల్లో పాల్గొన్న 836 మంది మరణించారు. రెండు భవనాల్లో దుర్మరణం పాలైన మొత్తం బాధితుల్లో 343 మంది అగ్నిమాపక దళ సిబ్బంది, 23 మంది న్యూయార్క్ నగర పోలీసులు, 37మంది పోర్ట్ అథారిటీలకు చెందిన పోలీసు అధికారులు ఉన్నారు. ఇంకా పెంటగాన్ భవనంపై జరిగిన దాడుల్లో అమెరికన్ ఎయిర్ లైన్స్ కు చెందిన 64 మంది, భవనాన్ని ఢీ కొన్న అమెరికన్ ఎయిర్ లైన్స్ ఫ్లయిట్ లోని 77 మందితో సహా 189 మంది ప్రాణాలు కోల్పోయారు. పెన్సిల్వేనియాలో కుప్ప కూలిన ఫ్లయిట్ లోని 44 మంది ప్రాణాలు అనంత వాయువులలో కలిసి పోయాయి. మరణించిన వారిలో అత్యధికులు సాధారణ పౌరులే. వారిలో 78 కి పైగా ఇతర దేశాలకూ చెందిన వారున్నారు. సెప్టెంబర్ 11 దాడుల కుట్ర వెనుక ప్రధాన సూత్రధారి ఖలీద్ షేక్ మహ్మద్. 1996లో అతను తన వ్యూహాన్ని ఒసామా బిన్ లాడెన్‌కు వివరించాడు. ఆ సమయంలో, బిన్ లాడెన్ మరియు అల్ ఖైదాలు మార్పు దశలో ఉన్నాయి. సూడాన్ నుంచి తిరిగి ఆఫ్ఘనిస్తాన్‌కు మకాం మార్చు కున్నారు. 1998 ఆఫ్రికన్ దౌత్య కార్యాలయంపై బాంబు దాడులు మరియు బిన్ లాడెన్ యొక్క 1998 ఫత్వా ఒక మలుపును గుర్తించాయి. అంటే బిన్ లాడెన్... అమెరికా సంయుక్త రాష్ట్రాలపై దాడులకు కుట్ర పన్నే యోచనలో ఉన్నట్లు అర్థమైంది. 1998లో విమానాల దారి మళ్లింపుకు వ్యక్తులకు శిక్షణ ఇవ్వడం సహా యూ.ఎస్. ఏ లో దాడులకు అల్‌ఖైదా సన్నద్ధ మవుతోందని అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు డైరెక్టర్ ఆఫ్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ తీవ్రవాద నిరోధన కేంద్రం తెలిపింది. అమెరికా రక్షణ శాఖ ఎంతో శక్తివంత మైనది, సీఐఏ ఎంతో ముందు చూపు కలిగి ఉన్నదైనప్పటికీ ఆల్‌ఖైదా టీమ్ పక్కా ప్రణాళికతో అనుకున్న విధంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పైన దాడులు జరప గలిగింది. 9/11సంబంధిత కమిషన్ 2004 జూలై 22న సమర్పిత తమ నివేదికలో, దాడుల కుట్ర వెనుక ప్రధాన సూత్రధారి వ్యూహ కర్తగా, ఖలీద్ షేక్ మహ్మద్ అని పేర్కొంది. ఈ సంఘటనకు బాధ్యుడని ప్రకటించుకున్న బిల్ లాడెన్ మే 2, 2011 నాడు యూఎస్ బలగాలు, పాకిస్తాన్ లో లాడెన్ తల దాచుకున్న స్థలాన్ని గుర్తించి, లాడెన్ ను హత మార్చాయి. %వి%7 బిలియన్ డాలర్ లను ఆ నాటి బాధిత కుటుంబాలకు 2001 నుండి 2004 వరకు అందజేశారు. 18, 2001 డిసెంబర్ 18న అమెరికన్ కాంగ్రెస్ సెప్టెంబర్ 11వ తేదీని ఆ నాటి మృతుల జ్ఞాపకార్థం దేశ భక్తుల దినంగా ఆమోదించింది. 2009లో అమెరికన్ కాంగ్రెస్, సేవ మరియు జ్ఞాపక దినంగా ప్రకటించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలంగాణ ఉద్యమానికి ఊతమిచ్చిన అగ్నివేశ్ - సెప్టెంబర్ 11... అగ్నివేశ్ వర్ధంతి



ఆర్య సమాజ్ నేత, సామాజిక ఉద్యమ కారుడు స్వామి అగ్నివేశ్ (80) తెలంగాణ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా జరిగిన అనేక సామాజిక ఉద్యమాలకు, పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారు. స్వామి అగ్నివేశ్ భ్రూణహత్యలు, వెట్టిచాకిరి, మహిళా సమస్యలపై, సామాజిక అంతరాలపై గొంతెత్తారు. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకు సంపూర్ణ మద్దతు తెలపడమే కాకుండా, ఉద్యమ కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొని, ఉద్యమ కారులను బలం చేకూర్చారు. 1939 సెప్టెంబర్ 21న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళంలోని సనాతన బ్రాహ్మణ కుటుంబంలో 1939 సెప్టెంబర్ 21న జన్మించారు. ఆయన అసలు పేరు వేపా శ్యాంరావు. నాలుగేళ్లకే తండ్రి మరణించడంతో అనంతరం ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న శక్తి అనే రాజ్యంలో దివాన్ అయిన తన తాత వారింట పెరిగారు. కోల్‌కతా లోని సెయింట్ గ్జేవియర్ కాలేజీ న్యాయశాస్త్రం, వాణిజ్యంలో డిగ్రీలు సంపాదించారు. కోల్‌కతా లోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశారు. సభ్యసాచి ముఖర్జీ అనే ప్రఖ్యాత న్యాయవాది వద్ద జూనియర్ లాయర్‌గా పనిచేశారు. ఆ తర్వాత సభ్యసాచి ముఖర్జీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అయ్యారు. ఆర్య సమాజ్ సూత్రాలతో 1970లో "ఆర్యసభ" అనే రాజకీయ పార్టీని స్థాపించారు. అంతేకాక, ఆయన ప్రముఖ న్యాయవాదిగా మత పరమైన సమస్యలపై మాత్రమే కోర్టులో వాదించే వారు. ఎన్నో సామాజిక సమస్యలపై పోరాటం చేశారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యలు ఎక్కువగా చేయిస్తున్న రోజుల్లో అందుకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల హక్కులు, భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మావోయిస్టులతో జరిగిన చర్చలకు ఆయన మధ్య వర్తిత్వం వహించారు. 1977లో హర్యానాలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతేగాక, మంత్రిగానూ ఆయన సేవలందించారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1981లో ఆయన మంత్రిగా ఉన్న సమయం లోనే బాలల వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు "బాండెడ్ లేబర్ లిబరేషన్ ఫ్రంట్"ను స్థాపించారు. మాయిస్టులతో చర్చలు జరపడంలో కీలకంగ పాత్ర పోషించారు. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా గళమెత్తారు. ముఖ్యంగా ఢిల్లీ చుట్టుపక్కల ఉండే క్వారీల్లో కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. హత్యానేరం ఆరోపణల్లో 14 నెలలు జైలు శిక్ష కూడా అనుభవించారు. 2011వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అగ్నివేష్ కూడా పాలు పంచు కున్నారు. కొందరు నిరసన కారులు తన మీద వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలతో దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆయన ఆందోళనల నుంచి విరమించు కున్నారు. 2011 సంవత్సరంలోనే మావోయిస్టులు కిడ్నాప్ చేసిన ఐదుగురు ఛత్తీస్‌గఢ్ పోలీసులను విడిపించడంలో మావోయిస్టులతో జరిపిన బృందంలో అగ్నివేష్ కూడా ఒకరు. 1970లో సన్యాసం స్వీకరించారు స్వామి అగ్నివేష్. అయితే, ఆయన మీద హిందూ వ్యతిరేక ముద్ర పడింది. ఒడిశాలోని పూరీ జగన్నాథ్ ఆలయాన్ని హిందుయేతరుల కోసం కూడా తెరవాలంటూ ఆయన డిమాండ్ చేశారు. హిందువులు అత్యంత పవిత్రంగా పూజించే అమర్‌నాథ్ శివలింగం కేవలం ఓ మంచు ముక్క అంటూ అగ్నివేష్ కామెంట్స్ చేయడంతో హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్‌పై జార?ండ్ తదితర ప్రాంతాలలో ఆయనపై ఏబీవీపీ, బీజేవైఎం, బీజేపీ కార్యకర్తలు పలుమార్లు దాడులు కూడా చేశారు. అయితే, అగ్నివేష్ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కోట్లాది మంది మనోభావాలను దెబ్బ తీయడం సరికాదని స్పష్టం చేసింది. సెంటిమెంట్ మిళితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. 2008లో ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో జరిగిన జమైత్ ఉలేమా ఈ హింద్ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలకు హిందూ సంఘాల నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఎవరో కొందరు ఉగ్రవాదులు చేసే తప్పుడు పనులకు మొత్తం మతాన్ని తిట్టడం సరికాదని ఆయన అన్నారు. అసలు అమెరికానే నెంబర్ వన్ టెర్రరిస్టు అని కూడా అన్నారు. అగ్నివేష్ బిగ్ బాస్‌లో కూడా పాల్గొన్నారు. 2011 సంవత్సరంలో నవంబర్ 8 నుంచి 11 వరకు హిందీ బిగ్ బాస్ హౌస్‌లో అతిథిగా ఉన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులతో జరిగిన చర్చలకు ఆయన మధ్యవర్తిత్వం వహించారు. భిన్న మతాల మధ్య పలు అంశాలపై ఆయన వారధిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమానికి స్వామి అగ్నివేష్ మొదటినుంచి సంపూర్ణ మద్దతుగా నిలిచి, ఉద్యమ సందర్భంలో జరిగిన సమావేశాలు, కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు. కాలేయ సంబంధిత సమస్యతో ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్‌లో చేరి, శరీరంలో కొన్ని అవయవాలు విఫలం (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) చెందడంతో కొద్ది రోజులు ఆయన వెంటిలేటర్ పైనే చికిత్స పొందుతూ, 2020 సెప్టెంబర్ 11న శుక్రవారం మృతి చెందారు. ఆధ్యాత్మికం, మత పరమైన అంశాలపై స్వామి అగ్నివేశ్ పలు పుస్తకాలు కూడా రాశారు. రాజీవ్ గాంధీ నేషనల్ సద్భావనా అవార్డు, రైట్ లైవ్లీహుడ్ అవార్డులు ఆయనను వరించాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# యూరియా ఉత్పత్తికి మరో వారం

రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్సీఎల్)లో మరమ్మతు పనులు వేగంగా సాగుతుండగా మరో వారం రోజుల్లో యూరియా ఉత్పత్తి ప్రారంభం కానుందని భావిస్తున్నారు. ఈ నెల 10న ఉత్పత్తి ప్రారంభించాలనే ప్రణాళికలతో మరమ్మతు చేపట్టినప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో మరో వారం రోజులు పట్టే అవకాశము ందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తరచూ అమ్మోనియా లీకేజీ ప్రధాన సమస్యగా మారింది. ఈసారి ఉత్పత్తి నిలిపివేత జాతీయ సమస్యగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు సార్లు కేవలం అమ్మోనియా పైపులైను లీకేజీ కారణంగానే ఉత్పత్తి నిలిపివేశారు. ఈ సారి మరమ్మతులపై యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.ప్రత్యేక నిపుణులతో..అమ్మోనియా ప్లాంటులోనే తరచూ లీకేజీలు ఏర్పడుతుండగా మరమ్మతు చేస్తూ ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్ట డం కొద్ది రోజుల్లోనే మళ్లీ లీకేజీ రావడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భాగస్వామ్య సంస్థ, అమ్మోనియా ప్లాంటు



నిర్మాణంలో కీలకమైన డెన్మార్క్‌కు చెందిన హల్దర్‌టాప్ ఇంజినీర్లు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎల్అండ్‌టీ సంస్థకు చెందిన నిపుణులు మరమ్మతు చేపడుతున్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా మరమ్మతు చేపడుతున్నట్లు భావిస్తున్నారు. సంస్థ కేంద్ర కార్యాలయం లోని ఉన్నతాధికారులు నిరంతరంగా సమీక్షిస్తున్నారు. ఆగస్టులో రాష్ట్రానికి 65వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేలా కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ ఆగస్టు 14న ఉత్పత్తి నిలిపివేసే సరికి కేవలం దాదాపు 20వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు నెలల్లో దాదాపు మూడు నెలల పాటు యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది.

# సంజీవని మూలకి.. ప్రాణాలు గాలికి

చౌటుప్పల్: ప్రజలకు అత్యవసర సేవలందించే అంబులెన్సు లను భారంగా నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వంలో మినరల్ ఫండ్‌తో మూడు, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిధులతో మరో మూడు అంబులెన్సులను కొనుగోలు చేశారు. వీటిని ఆలేరు, రామన్నపేట, భువనగిరి, చౌటుప్పల్ ఆస్పత్రులకు ఒక్కొక్కటి చొప్పున అందజేశారు. డీఎంహెచ్‌వో పరిధిలో రెండు కేటాయించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కీర్తిరెడ్డి ఇంకొక అంబులెన్సును జిల్లా కేంద్రాస్పత్రికి సమకూర్చారు. వీటి నిర్వహణ, డీజిల్, డ్రైవర్ వేతనం చెల్లింపుల విషయంలో ఆయా ఆస్పత్రులకు ఇబ్బందులు తలెత్తాయి. జిల్లాలో 108 అంబులెన్స్‌లు 12 ఉన్నాయి. భువనగిరి జనరల్ ఆసుపత్రిలో ఒక 108, నవజాత శిశువుల కోసం నియోనాటల్ అంబులెన్స్‌లున్నాయి.

రామన్నపేట ప్రాంతీయ ఆస్పత్రిలోని అంబులెన్సుకు అవసరమున్న రోగులు సొంత డబ్బుతో డీజిల్ పోసుకోవాల్సి వస్తుంది. ఆస్పత్రికి దుకాణాల సముదాయం ద్వారా నెలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నందున రోగులపై భారం వేయకుండా ఆ నిధులతో డీజిల్ పోయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, అనారోగ్య కారణాలతో భువనగిరి జనరల్ ఆసుపత్రికి వచ్చే వారిని ఎక్కువగా వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియాకు రెఫర్ చేస్తున్నారు. దీంతో 'ఫోర్స్'




అంబులెన్స్‌తోపాటు, 108 అంబులెన్స్‌లో తరలిస్తున్నాయి. రోజూ సుమారు మూడు కేసులను అక్కడికి తీసుకెళ్తున్నారు. ఒక్కోసారి తిరిగి వచ్చేందుకు సుమారు ఐదు గంటల సమయం పడుతుంది. స్థానికంగా లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**ఇక్కడ లేనేలేవు..**

సంస్థాన్ నారాయణపురం పీహెచ్‌సీకి అంబులెన్సు సౌకర్యం లేదు. అత్యవసరమైతే చౌటుప్పల్ నుంచి 108 రావాల్సి ఉంటుంది. గిరిజన తండాలు, శివారు గ్రామాలు కలిపి అరవై వరకున్నందున ఇక్కడ అంబులెన్సు ఏర్పాటు చేయాలి. రాజపేట పీహెచ్‌సీలో అంబులెన్స్ సౌకర్యం లేదు. యాదగిరిగుట్ట, ఆలేరు నుంచి రావాల్సిందే. అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), పీహెచ్‌సీలకు అంబులెన్స్ లేదు. మోత్కూరులోని 108ని ఆశ్రయించాల్సి వస్తుంది.

చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో అంబులెన్సు కొన్నేళ్లపాటు నిరుపయోగంగా ఉంది. తర్వాత కొన్నేళ్లు నిర్వహించారు. అంబులె న్సుకు డ్రైవరు లేకపోవటంతో లైసెన్సున్న ఆస్పత్రి సెక్యూరిటీ గార్డును, పేషంట్లను డ్రైవరుగా వినియోగించుకుంటున్నారు. ఆస్పత్రి నిధులతో దీన్ని నిర్వహిస్తున్నారు.

బీబీనగర్ పీహెచ్‌సీకి అయిదేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అంబులెన్సును అందజేశారు. మూడేళ్లపాటు దీన్ని నిర్వహించారు. ప్రభుత్వం మారిన తర్వాత నిర్వహణకు నిధులు లేకపోవడంతో పీహెచ్‌సీ పక్కన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మూలన నిరుపయో గంగా ఉంది.

నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం

డా.చిన్నానాయక్, డీసీహెచ్ఎస్, యాదాద్రి జిల్లా

అంబులెన్సులకు ముగ్గురు ప్రభుత్వ డ్రైవర్లున్నారు. మరో ఇద్దరిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించాం. వీటి నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యేల అనుమతితో ఆరోగ్యశ్రీ నిధులతో డీజిల్ ఖర్చులను కేటాయించి నిర్వహిస్తున్నాం.

# ఇక త్వరితగతిన నేర పరిశోధన




జగిత్యాల : నేరం రుజువు కావడానికి పోలీసులకు కావాల్సిం ది బలమైన సాక్ష్యం. నేర పరిశోధనలో నిందితులను పట్టుకోవటం ఒక భాగమైతే, ఆ కేసులో అన్ని రకాల ఆధారాలను సేకరిస్తేనే శిక్ష పడే అవకాశం ఉంది. ఈ క్రమంలో సాక్ష్యాల గుర్తింపులో అత్యంత కీలకమైనది ఫోరెన్సిక్ విభాగం. నేరం జరిగినప్పుడు ఘటనా స్థలంలోని సున్నితమైన ఆధారాలు, సాక్ష్యాలను సంపాదించే ఫోరెన్సిక్ బృందం జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో ఇప్పటివరకు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ నుంచి పిలిపిస్తున్నారు. ఇటీవలే మొబైల్ ఫోరెన్సిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత నెలలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో వ్యాన్‌ను ప్రదర్శించారు. ఈ వాహనానికి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌ను ఇన్‌ఛార్జిగా నియమించగా మరికొంత మంది నిపుణులను కేటాయించనున్నారు.

**రెండు నెలల్లో అందుబాటులోకి..**

జిల్లాకు చేరిన ఫోరెన్సిక్ వ్యాన్‌లో 14 రకాల కిట్లున్నాయి. 1. క్రైమ్ సీన్ కార్డనింగ్(ప్రొటెక్షన్ కిట్), 2.జనరల్ ఇన్వెస్టిగేషన్ కిట్, 3. సాక్ష్యం ప్యాకింగ్, కలెక్షన్ కిట్, 4. ఫింగర్ ప్రింట్ టేకింగ్ కిట్, 5. ల్యాటెంట్ ఫింగర్ ప్రింట్ డెవలప్‌మెంట్ కిట్, 6. ఫుట్, టైర్ కాస్టింగ్ కిట్, 7. హై-ఇంటెన్సిటీ ఫోరెన్సిక్ లైట్ సోర్స్, 8.రక్తం, శుక్ర కణాలను గుర్తించే కిట్, 9. డీఎన్ఏ సేకరణ, లైంగిక వేధింపుల పరీక్ష కిట్. 10.పేలుడు డిటెక్షన్ కిట్, 11. నార్కొటిక్ డిటెక్షన్ కిట్, 12.గన్‌షాట్ అవశేష పరీక్ష కిట్, 13. బుల్లెట్ హోల్ టెస్టింగ్ కిట్, 14. గ్యాస్ డిటెక్టర్‌తో కూడిన ఆర్సన్ ఇన్వెస్టిగేషన్ కిట్. జిల్లాలో హత్యలు, డీఎన్ఏ సేకరణ, అత్యాచారం, నార్కొటిక్ కేసుల పరిశోధనలో సాక్ష్యాలను గుర్తించనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఫోరెన్సిక్ సేవలు అందుబాటులో లేకపోవడంతో కొత్తగా వచ్చిన వ్యాన్‌తో సాక్ష్యాల సేకరణ త్వరగా జరిగి కేసు దర్యాప్తు వేగిరమవుతుందని పోలీసు ఉ న్నతాధికారులు తెలిపారు. మరో రెండు నెలల్లో మొబైల్ ఫోరెన్సిక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**సాక్ష్యాల సేకరణలో కీలకం**

ఫోరెన్సిక్ వ్యాన్ ఇటీవలే జిల్లాకు చేరుకుంది. పూర్తి సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. వివిధ కేసుల్లో డీఎన్ఏ, రక్త నమూనాల సేకరణతో పాటు నార్కొటిక్ కేసులకు బాగా ఉపయుక్తంగా ఉంటుంది. శాస్త్రీయ పద్ధతిలో సాక్ష్యాల సేకరణకు కృషి చేస్తాం.శ్రీధర్, ఇన్‌స్పెక్టర్, ఫోరెన్సిక్ మొబైల్ వ్యాన్ ఇన్‌ఛార్జి

# ఉల్లాస్.. లక్ష్యం నెరవేరేనా!



పెద్దపల్లి : నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులు గా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలు ఫలించడం లేదు. గతంలోని వయోజన విద్య మొక్కుబడిగా సాగడంతో ఆశించిన స్థాయిలో ఫలితమివ్వలేదు. ఈ సారి కేంద్రం నవభారత్ సాక్షరత(న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 15 ఏళ్లకుపైబడిన నిరక్షరాస్యులను గుర్తించాలని ఆదేశించింది. తొలి విడతలో మహిళలకు ప్రాధాన్యం కల్పించారు. నిరక్షరాస్యులను గుర్తించి 'ఉల్లాస్' యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. గత తప్పిదాలు అధిగమిస్తేనే అక్షరం పరిమళించనుంది.

**150 మార్కులతో తుది పరీక్ష**

స్వశక్తి సంఘాల మహిళలు, ఉపాధిహామీ కూలీలు, ఐసీడీఎస్ లబ్ధిదారుల్లో నిరక్షరాస్యుల గుర్తింపులో ప్రాధాన్యం కల్పిస్తున్నారు. రాయడం, చదవడం, చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పిస్తారు. వంద రోజుల్లో నేర్పించి 150 మార్కులతో తుది పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించినవారికి ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారు. ఆర్థిక అవగాహన, సాంకేతిక అక్షరాస్యత, న్యాయ పరిజ్ఞానంపై శిక్షణ, కుటుంబ సంక్షేమంపై అవగాహన కల్పిస్తారు. ఉమ్మడి జిల్లాలోని జగిత్యాలలో 60.23 శాతం, పెద్దపల్లి 65.59 శాతం, కరీంనగర్ 69.16 శాతం, సిరిసిల్లలో 62.71 శాతం అక్షరాస్యత ఉంది.

**1,181,456 మంది గుర్తింపు**

మహిళల నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు సంఘాల్లో లావాదేవీల సొమ్మును స్వాహా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,181,456 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వారిని 'ఉల్లాస్' యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. సంఘాల్లోని ఔత్సాహిక మహిళలను వాలంటీర్లుగా నియమించి శిక్షణ ఇచ్చారు. పాఠశాలల పరిధిలో ఒక ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులకు అప్పగించారు. తమ తల్లిదండ్రులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు పిల్లలకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

**లోపాలపై దృష్టి సారిస్తేనే..**

సాక్షార భారత్‌లో వాలంటీర్లకు పంపిణీ చేసిన పుస్తకాలు లబ్ధిదారులకు చేరుకోలేదు.

నామమాత్రంగా అర్హత పరీక్ష ఏర్పాటు చేసి అందరినీ ఉత్తీర్ణత సాధించేలా చేశారు.

కొందరు అక్షరాలు నేర్చుకుని మరిచిపోయారు. ఇళ్ల వద్ద సాధన చేసుకోవాలనే అవగాహన కల్పించలేదు.

ప్రధానోపాధ్యాయులు నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల అక్షర ప్రగతిపై పిల్లలతో సమీక్షించాలి.

జిల్లా స్థాయిలో అధికారులు వాలంటీర్లపై పర్యవేక్షణ పెంచాలి.

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన నిరక్షరాస్యులు

కరీంనగర్ : 66,464

పెద్దపల్లి : 50,257

జగిత్యాల : 41,797 సిరిసిల్ల : 22,938

# అంతర్జాలం.. వలపు గాలం!




నల్గొండ : పట్టణానికి చెందిన యువతి హైదరాబాద్‌లోని ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ యువకుడితో స్నేహం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లికి ముఖం చాటేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సామాజిక మాధ్యమంలో పరిచయమైన యువకుడిని ప్రేమించిన నాంపల్లి మండలానికి చెందిన యువతి ఇంట్లో చెప్పకుండా అతడితో కలిసి వెళ్లిపోయింది. కొన్నాళ్ల తర్వాత తప్పు చేశానని తెలుసుకొన్నా ఫలితం లేకపోయింది. అందమైన జీవితం అబాసుపాలయింది.

నాంపల్లి, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విషయాలను పంచుకోవడం, పరిచయం లేని వారిని నమ్మడం మూర?త్వమే. అంతర్జాలాన్ని మంచికి ఉపయోగించుకొని సమస్యల నుంచి బయటపడొచ్చు. చెడుతో తమను తామే దహించుకోవచ్చు. మారుతున్న జీవన గమనంలో సామాజిక మాధ్యమాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్‌తో అంతర్జాలంలో విహరిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని జనాభాలో దాదాపు 80 శాతానికి పైగా స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తుంటే అందులో 34శాతం మహిళలే. ఇటీవల సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని మహిళలను నమ్మించి మోసగిస్తున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉ న్నాయి. ఈ నేపథ్యంలో ఫోన్ వినియోగించుకునే తీరులోనే మార్పు రావాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత విషయాలు, సామాజిక మాధ్యమాల్లో చిత్రాలను పంచుకోవడం ఎప్పటికైనా ప్రమాదమే.

అపరిచితులతో జాగ్రత్త

రోజువారీ కార్యకలాపాల్లో భాగంగా అంతర్జాలాన్ని ఉ పయోగించుకునేది కొందరైతే.. కాలక్షేపానికి వినియోగించుకునేవారు మరికొందరు. ప్రొఫైల్ చిత్రం ఆధారంగా చాలామంది అపరిచితులు పలకరిస్తుంటారు. స్పందించి సమాధానమిస్తే ఉచ్చులో పడినట్లే. మోసగించిన వారితో గతంలో పరిచయం లేదని, ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారానే పరిచయమని చెబుతుండటంతో పోలీసులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చాటింగ్ జరిపేవారు తమ వ్యక్తిగత జీవితానికి భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిచయస్థులైనా సందేశాలను హద్దులు దాటి పంపుతుంటే వాటికి సమాధానం ఇవ్వకుండా సున్నితంగా తిరస్కరించాలి. పునరావృతమైతే అలాంటి వారిని పక్కన పెట్టాలి. ప్రాథమిక దశలోనే వారి పోకడలను గ్రహించగలిగితే వ్యక్తిగత సమాచారం బహిర్గతం కాకుండా జాగ్రత్త వహించవచ్చు.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి

పి.మౌనిక, ఏఎస్పీ, దేవరకొండ

సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న మహిళలు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. చిత్రాలు పోస్టు చేసే ముందు ఒకసారి ఆలోచించుకోవాలి. ఆకర్షితులు కావొద్దు. మీతో చాటింగ్ చేసేవారు మహిళా.. పురుషుడా మీరు గుర్తించలేరు. సోషల్ మీడియాలో పరిచయం పెంచుకున్నాక మానసికంగా, ఆర్థికంగా వేధిస్తారు. సైబర్ క్రైం పెరుగుతున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులకు గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

# నోరు తెరిచిన బావి.. ప్రమాదకరంగా మారి

పెద్దపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులు నిర్వహిస్తున్న అధికారులు రోడ్డు పక్కన ఉండే బావులు, చెరువులు, కాలువలపై నిర్లక్ష్యం చేయడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో ఎస్సారెస్పీ కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. సుల్తానాబాద్ శివారులోని డి-83 కాలువలో పలు వాహనాలు పడిపోయిన ఘటనలు న్నాయి. పెద్దపల్లిలోని కొంతంవాడ మీదుగా వెళ్లే ఎస్సారెస్పీ కాలువలోకి గతంలో కారు దూసుకెళ్లగా ఎవరికీ ఏం కాలేదు.

**ఇక్కడ బాగు..**

ధర్మారం, ఓదెల మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డుపక్కనే బావులుండగా రక్షణ కంచెలు నిర్మించారు. పెద్దపల్లి పట్టణ శివారులోని బంధం చెరువు నుంచి వచ్చే వరద ప్రవాహం వెళ్లే ఒర్రెను ఆనుకొని రాజీవ్ రహదారి వెళ్తుండటంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలుగా దారి వెంట బలమైన రేయిలింగ్ నిర్మించారు.

**రోడ్డు పక్కనే..**

పెద్దపల్లి పురపాలిక పరిధి బంధంపల్లి స్టేజీ వద్ద, బంధంపల్లి నుంచి గొల్లపల్లి వెళ్లే దారిలో మరో వ్యవసాయ బావి రోడ్డు పక్కనే ప్రమాద కరంగా ఉన్నాయి. పెద్దపల్లి నుంచి జూలపల్లి దారిలో వెంకట్రావుపల్లి,



వడ్కాపూర్ సమీపంలో పలు వ్యవసాయ బావులు రోడ్డుపక్కనే ఉ న్నాయి. కుమ్మరికుంట నుంచి జూలపల్లి వచ్చే ఆర్అండ్‌బీ రోడ్డు కొంత దూరం కాలువ వెంటే వెళ్తుంది. కుమ్మరికుంట నుంచి కొత్తూరు మీదుగా కటికనపల్లి దారిలో రోడ్డు పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి.

పెద్దపల్లి నుంచి కూనారం వెళ్లే దారిలో మారేడుగొండ, కాల్వశ్రీరాంపూర్ నుంచి గుంపులకు వెళ్లేదారిలో పలు బావులతోపాటు చెరువులు, కుంటలు రోడ్డు వెంటే ప్రమాదకరంగా ఉన్నాయి.

పెద్దపల్లి నుంచి ముప్పిరితోట మీదుగా దూళికట్ట వెళ్లే రోడ్డులోనూ వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి.

ముత్తారం మండలం మచ్చుపేట శివారు నుంచి దారి పొడవునా పది వరకు వ్యవసాయ బావులున్నాయి.

పాలకుర్తి మండల కేంద్రం నుంచి ఈసాల తక్కలపల్లి వెళ్లే దారిలో వ్యవసాయ బావి, బోడగుట్టపల్లి వద్ద ఎస్సారెస్పీ కాలువ వంతెన, జిల్లా కేంద్రం నుంచి తుర్కల మద్దికుంట వెళ్లేదారిలో గాంధీనగర్ దాటిన తర్వాత బావి ప్రమాదకరంగా ఉంది.

# పట్టణ హరితం.. అంతంతమాత్రం

కోరుట్ల: పచ్చదనం పెంపునకు ప్రభుత్వం ఏటా 'వన మహోత్సవం' కార్యక్రమం నిర్వహిస్తోంది. పట్టణాల్లో పురపాలక సంఘాల ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి నర్సరీలు ఏర్పాటు చేసి సుమారు 30 రకాల మొక్కలు పెంచుతున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు నాటుతున్నామని లెక్కల్లో చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టణ రహదారుల్లో, కాలనీల రోడ్లపై, ప్రజల నివాసాల్లో పచ్చదనం కనిపించడం లేదు. ఈ ఏడాదైనా మున్సిపల్ అధికారులు పట్టణాల్లో విస్తృతంగా మొక్కలు నాటించి లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల పరిధిలో మొత్తం 7.73 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు సుమారు 2.60 లక్షల మొక్కలు మాత్రమే నాటారు. మరో 5 లక్షలకు పైగా మొక్కలు నాటాల్సి ఉంది.

**పట్టణ ప్రగతి నిధులతో శాశ్వత నర్సరీలు**

జిల్లాలోని అయిదు పట్టణాల్లో అయిదేళ్ల క్రితం పట్టణ ప్రగతి నిధులతో శాశ్వత నర్సరీలు ఏర్పాటు చేసి ఏడాదంతా మొక్కల పెంపకం చేపడుతున్నారు.అనువైన నాణ్యమైన మట్టిని తీసుకొచ్చి కవర్లలో నింపడం, ప్రత్యేకంగా తెప్పించిన విత్తనాలను సిబ్బందితో నాటించడం, క్రమం తప్పకుండా నీటిని పట్టిస్తూ మొక్కలు పెంచుతున్నారు. పట్టణ ప్రగతి నర్సరీల్లో నీడనిచ్చే వాటితో పాటు, పండ్లు, పూల రకాలకు



చెందిన సుమారు 30 రకాల మొక్కల పెంపకం చేపట్టారు.

నీడనిచ్చే మొక్కలను ప్రత్యేక జాగ్రత్తల మధ్య 4, 5 అడుగుల ఎత్తు వరకు పెంచుతున్నారు.రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, కార్యాలయాల్లో మున్సిపల్ కార్మికులతో నీడనిచ్చే మొక్కలను నాటిస్తున్నారు. మొక్కల పెంపకంలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా ఇళ్ల ఆవరణలో పండ్ల, పూల మొక్కలు తప్పనిసరిగా నాటించేలా చర్యలు తీసుకుంటున్నారు.ఇంటికి రెండు, మూడు మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించిన అధికారులు త్వరలో అందజేసేందుకు నిర్ణయించారు.

**ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు**

పట్టణంలో నిర్దేశించిన మేరకు మొక్కలు నాటించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కార్మికులతో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో నాటిస్తున్నాం. ముఖ్యంగా ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేయించి మహిళలతో నాటించాలని నిర్ణయించాం. బొప్పాయి, జామ, నిమ్మ, బత్తాయి వంటి పండ్ల మొక్కలను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బి.రవీందర్, కోరుట్ల మున్సిపల్ కమిషనర్

## ఖాళీగా షెడ్లు.. ఇరుకుగా రోడ్లు

కరీంనగర్: జిల్లాలోని నగర, పురపాలికల్లో వీధివ్యాపారుల కోసం సౌకర్యాలు కల్పించి 'ఆత్మనిర్భర్' నింపాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. రహదారులపై చిరు వ్యాపారం సాగించకుండా షెడ్లు నిర్మిస్తున్నా వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. రోడ్లే అడ్డాలుగా మలుచుకోవడం, ఉన్న చోటనే వాటిని నిర్మించాలని కోరుతుండటంతో ప్రాంతాల్లో స్థలం దొరకడంలేదు.

**నెరవేరని ప్రభుత్వాల లక్ష్యం**

వీధివ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ కింద రుణాలు ఇస్తుండగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. పక్కా అడ్డాలు లేకపోవడంతో రోడ్ల మీద దుకాణాలకు ఎదురుగా కూర్చొని అమ్ముతుండగా ప్రైవేటు దుకాణాల యజమానులు అద్దె వసూలు చేస్తున్నారు. పురపాలికలు చూపించే షెడ్లలోకి వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ వారు వెళ్లడంలేదు. పథకం లక్ష్యం నెరవేరడంలేదు.

**అయిదు చోట్ల ఖాళీ**

పండ్ల మార్కెట్‌కు బస్టాండ్ వెనక రూ.17 లక్షలతో వెండర్ జోన్



ఏర్పాటు చేస్తే అక్కడికి వెళ్లకపోవడంతో ఇతరులకు కేటాయించారు. రూ.30 లక్షలతో ఇందిరానగర్‌లో నిర్మించగా ఒకరిద్దరు మినహాయించి వ్యాపారులు ఎవరూ ఉండటం లేదు.

రూ.23 లక్షలతో చైతన్యపురిలో నిర్మించగా ఒక్కరూ ఉండటం లేదు. బ్యాంకుకాలనీ రహదారిపై దుమ్ము, ధూళిలో కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు. రూ.25 లక్షలతో హౌసింగ్‌బోర్డుకాలనీలో మార్కెట్ నిర్మించగా అది నిరుపయోగంగా ఉంది. వెంకటసాయి థియేటర్ ఎదురుగా, పాతబజారులో కూర్చొనే వీధివ్యాపారులకు దీనిని నిర్మించారు. శ్రీనగర్, సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా ఉదయం ఒకరిద్దరు ఉంటున్నారు. టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా వీధి వ్యాపారం చేస్తున్నారు.

**ఇలా చేస్తే ప్రయోజనం**

ఏ ప్రాంతం వారిని ఆ ప్రాంతంలోనే ఖాళీగా ఉన్న మార్కెట్లు, షెడ్లలోకి పంపించాలి. రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారులు అడ్డాలు పెట్టకుండా కట్టడి చేయాలి. నాలుగు చక్రాలు, తోపుడుబండ్లను కూడా అదే ప్రాంతానికి తరలించాలి. దీ రహదారులపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు దొరకకపోతే ప్రజలు కూడా షెడ్ల వద్దకు వస్తారు.

## దెబ్బతిన్న వంతెన.. నరకయాతన

ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల-సిద్దిపేట జిల్లాల సరిహద్దు గ్రామాలైన మోహినికుంట-రాజక్కపేట మధ్యనున్న వంతెన అంచు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం మీదుగానే రెండు జిల్లాల వాహనదారులు సిద్ధిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించగా.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు ముందుకు సాగేలా చొరవ చూపాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

**రూ.1.80 కోట్ల నిధులు మంజూరు**

రాజక్కపేట కొత్తచెరువు నుంచి వంతెన కిందుగా వాగు ద్వారా నీరు మోహినికుంట, మద్దికుంట చెరువు నిండుకొని.. ముస్తాబాద్ చెరువుల్లోకి చేరుతాయి. అయితే ఇరుగ్రామాల మధ్యనున్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎంఆర్‌ఆర్ (మెయింటెనెన్స్ రూరల్ రోడ్డు) ద్వారా దాదాపు రూ.1.80 కోట్లు వరకు మంజూరైనట్లు సమాచారం. సంబంధిత అధికారులు మాత్రం పనుల వివరాలను వెల్లడించడంలేదు. వంతెన మరమ్మతుల కోసం నిధులు విడుదలయ్యాయా లేదా నూతన వారధి నిర్మాణానికి మంజూరయ్యాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**కోతకు గురైన వారధి రోడ్డు**

నిత్యం లింగన్నపేట నుంచి చిన్నబీకోడ్, మద్దికుంట, మోహినికుంట గ్రామాలతోపాటు సిద్ధిపేట జిల్లా రాజక్కపేట పరిసర గ్రామాల ప్రజలు



ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తాత్కాలిక రోడ్డు కోసం వేసిన పైపులు అక్కడే నిరుపయోగంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఇరు జిల్లాల వాహనదారులు కోరుతున్నారు.

**పనులు జరిగేలా చూడాలి**

మెర్గు లింగం, మోహినికుంట

రెండు జిల్లాలకు చెందిన వందలాది వాహనదారులు ఈ రోడ్డు మీదుగా తక్కువ దూరంతో వెంకట్రావుపల్లె మీదుగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. వెంటనే పనులు జరిగేలా చూడాలి.

**గుత్తేదారుకు సూచిస్తాం**

గత ప్రభుత్వ హయాంలో ఎంఆర్‌ఆర్ కింద నిధులు మంజూరయ్యాయి. సదరు కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. పనులు చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచిస్తాం.

సుదర్శన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

# నిధులు రావు.. నిర్మాణాలు సాగవు



గంగాధర మండలం గర్శకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా భవన నిర్మాణానికి రూ.21 లక్షలు కేటాయించగా రూ.6 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించారు.

ఉప్పరమల్యాలలో రూ.13 లక్షలతో చేపట్టిన డైనింగ్ హాల్ పిల్లర్లు వేశారు. ఇందుకు రూ.5.50 లక్షలు ఖర్చు చేయగా, నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారు అర్ధాంతరంగా వదిలేశారు.

చొప్పదండి బీసీ బాలికల పాఠశాలలో ఆరేళ్ల కిందట రూ.9 లక్షలతో అదనపు తరగతి గదులు నిర్మించారు. కేవలం రూ.1.50 లక్షలు మాత్రమే ఇవ్వగా మిగతా బిల్లు రాలేదని అర్ధాంతరంగా వదిలివేయడంతో తాత్కాలికంగా గోడలు పెట్టి తరగతులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని చాలా పాఠశాలల్లో గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో చేపట్టిన పనులకు నిధులు కేటాయించకపోవడంతో అర్ధా.ంతరంగా నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పూర్తయినా అప్పగించకపోవడంతో పాఠశాలల్లో సమస్యలు కొనసాగుతున్నాయి. అసంపూర్తి పాఠశాలల్లో విద్యార్థుల చదువులు సజావుగా సాగడం లేదు. సదుపాయాలు లేక విద్యార్థులు వెనుకబడిపోతున్నారు.

**పెండింగ్‌లో రూ.3.70 కోట్లు..**

2021-22లో చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం కింద కరీంనగర్ జిల్లాలో 230 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పనులకు ఎంపిక చేయగా, 214 పాఠశాలల్లో పనులు చేపట్టారు. వాటికి రూ.31.99 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ శాఖల అధికారులు అంచనా వేశారు. 2023 ఆగస్టులోపు ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది. బిల్లుల చెల్లింపుల జాప్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కార్యక్రమంతో పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు మొదలుపెట్టింది. ఈ పనులు పూర్తై విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు సమకూరాయి. గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పలు పాఠశాలల్లో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. అధికారుల లెక్కల ప్రకారం 180 పాఠశాలల్లో పనులు పూరైనట్లు అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. చేసిన పనులకు సుమారు రూ.3.70 కోట్లు రావాల్సి ఉంది. బిల్లుల మంజూరు చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌తోపాటు ఇన్‌ఛార్జి మంత్రిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు.

# ఆటల మాస్టారు కొలువుల బాటేశారు



మల్యాల : ఆయన ఓ ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు.. సొంతూరి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో విధులు.. నిత్యం బడిలో పిల్లలతో క్రీడా సాధన చేయించడంతోనే సరిపెట్టుకోలేదాయన.. నిత్యం వేకువజామునే లేచి స్వగ్రామంలోని పాఠశాల బాట పడతారు.. యువతకు దేహ దారుఢ్య శిక్షణ ఇస్తూ పోలీసు కానిస్టేబుల్, ఆర్మీలో ఎంపికయ్యేలా సన్నద్ధం చేస్తుంటారు.. తన వద్ద శిక్షణ పొందిన వారిలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో కొలువులకు ఎంపికయ్యారు.. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గంగాసాగర్ ఇదే మండలంలోని తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఉద్యోగంలో చేరకముందు నుంచే 2016లో గ్రామంలోని యువతకు స్వచ్ఛంద శిక్షణ ప్రారంభించారు. గతంలో తరచూ 'స్వాధ్యాయ పరివార్' తరగతులకు హాజరయ్యేవారు. తోటివారికి సాయం అందించాలన్న ఆలోచనతో స్వగ్రామంలోని స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో వివిధ రకాల వ్యాయామాలు చేయిస్తున్నారు.

**నిత్యం రెండు గంటల తర్ఫీదు**గంగాసాగర్ ప్రతి రోజూ ఉదయం పాఠశాల మైదానంలో రెండు గంటల పాటు యువతీ యువకులకు శారీరక దారుఢ్య శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా ఆర్మీ ఉద్యోగార్థులకు 'పుల్ అప్', 5.30 నిమిషాల్లో 1600 మీటర్ల దూరం పరుగెత్తేలా మెళకువలు నేర్పిస్తున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారికి 1600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్‌లో శిక్షణ ఇస్తున్నారు. మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల యువత తక్కళ్లపల్లి ఉన్నత పాఠశాలలోని మైదానికి చేరుకొని గంగాసాగర్ శిక్షణలో ఆయా అంశాల్లో రాటుదేలుతున్నారు.

**300 మందికి పైగా శిక్షణ**

ఇప్పటివరకు దాదాపు 300 మందికి పైగా గంగాసాగర్ ఉచిత శిక్షణ అందించగా 53 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిలో 30 మంది కానిస్టేబుళ్లుగా, 22 మంది ఆర్మీలో, ఒకరు నేవీలో కొలువులకు ఎంపికవడం విశేషం. శిక్షణకు అవసరమైన హర్డిల్స్, లాడర్, డంబెల్స్‌ను గంగాసాగర్ స్వయంగా సమకూరుస్తున్నారు. ఆర్మీ, కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రకటన వెలువడగానే వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగార్థులు తక్కళ్లపల్లికి వచ్చి ఆయన ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభిస్తారు.

**యువత చెడు దారి పట్టకూడదన్నదే లక్ష్యం**

యువత దురలవాట్ల బారిన పడకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న ఆలోచనతో ఆర్మీ, కానిస్టేబుల్ నియామక సమయంలో యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నా. ప్రస్తుతం తాటిపల్లి పాఠశాలలో పీఈటీగా పని చేస్తూనే స్వగ్రామంలోని పాఠశాల మైదానంలో ప్రతి రోజు రెండు గంటలు దేహ దారుఢ్య మెలకువలు నేర్పిస్తున్నా. యువత చెడు దారి పట్టకుండా జీవితంలో స్థిరపడితే సమాజం ప్రశాంతంగా ఉంటుంది.

గంగాసాగర్, వ్యాయామ ఉపాధ్యాయుడు

# నిబంధనలకు తిర'కాసు'

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో 83 లక్షలకుపైగా వాహనాలున్నాయి. వాటిలో 15శాతం అంటే 1.2లక్షల వాహనాలు 15 ఏళ్ల పైబడినవే. గ్రేటర్‌లో 350 కాలుష్య తనిఖీ కేంద్రాలున్నాయి. లైసెన్సు లేనివి రెండు రెట్లు ఉంటాయని అంచనా. నిబంధనల ప్రకారం.. కాలుష్య తనిఖీ కేంద్రాల్లో వాహనాలను భౌతికంగా పరిశీలించి..ఇంజిన్ ఆన్ చేసి ప్రోబ్‌ను ఎగ్జాస్ట్ పైప్‌లో ఉంచి కాలుష్య తనిఖీ చేపట్టాలి. అనేక కేంద్రాల్లో ఇష్టానుసారం డబ్బుల వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలతో పీఎం 2.5 ఉద్గారాల స్థాయి పెరుగుతోంది. అర్బన్ ఎమిషన్స్ గ్రూపు తెలిపిన వివరాల ప్రకారం..గ్రేటర్‌లో ఏటా 8,250 టన్నుల పీఎం 2.5 ఉద్గారాలు వెలువడుతున్నాయి.

**గ్రేటర్ పరిధిలో..**

ద్విచక్ర వాహనాలు: 55 లక్షలు

కార్లు: 15 లక్షలు

ప్రతి నెల కొత్తగా వచ్చేవి: 2500


"పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (పీయూసీ) కావాలా..?.డోర్ స్టెప్ సేవలందిస్తాం...మమ్మల్ని సంప్రదించండి' అంటూ ఆన్‌లైన్ ప్రకటన చూసిన సాగర్ అందులో ఉన్న నంబరుకు ఫోన్ చేశాడు. ఓ కారు, 2 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. అక్కడి వరకు రాలేం.. బేగంపేట్‌కి 5 కిలోమీటర్ల దూరంలో అయితే




వస్తామని సమాధానం వచ్చింది. ఆలోచిస్తున్న క్రమంలోనే..'మీ వాహనాల రిజిస్ట్రేషన్ నంబరు కనిపించేలా ఫొటోలు, రీడింగ్ వివరాలు పంపితే ధ్రువపత్రం జారీ చేసి పంపుతాం' అంటూ సదరు ప్రతినిధి ఆఫర్ ప్రకటించాడు. వాహనాలు తనిఖీ చేయకుండా ఎలా అని ప్రశ్నించగా అదంతా మేం చూసుకుంటామని ఫోన్ పెట్టేశాడు"ఆర్టీఏ అధికారుల కళ్లు గప్పి సంచార కాలుష్య తనిఖీ కేంద్రాల్లో ధ్రువపత్రాల జారీ ఎలా జరుగుతుందో సాగర్ అనుభవమే నిదర్శనం.

## ఇందిరమ్మ ఇల్లు.. చిత్రాలతో బిల్లు

నాంపల్లి,: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన యాప్‌లో కొత్త ఐచ్ఛికం వచ్చింది. బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపడంలో ఎదురవుతున్న జాప్యాన్ని నివారించేందుకు లబ్ధిదారులకే చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశాన్ని కల్పించింది. లబ్ధిదారుల ఇంటి నిర్మాణ చిత్రాలను నేరుగా యాప్‌లో పంపించే సదుపాయం కల్పించడంతో ఇకపై అధికారుల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదు. ఇల్లు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి నిర్మాణ దశలను గ్రామ పంచాయతీ కార్యదర్శి చిత్రాలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అవి గృహనిర్మాణశాఖ ఏఈ లాగిన్‌కు అటు నుంచి డీఈ, పీడీ తర్వాత కలెక్టర్‌కు వెళ్తాయి. బేస్‌మెంట్ పూర్తయితే రూ.లక్ష, గోడల దశలో మరో రూ.లక్ష, స్లాబు పూర్తయితే రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తయి రంగులు వేశాక మరో రూ.లక్షల చొప్పున మొత్తం రూ.5 లక్షలు విడతల వారీగా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమవుతాయి. ఈ ప్రక్రియలో ఆలస్యం కావడం, కొందరు అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో చిత్రాలను అప్‌లోడ్ చేసే అవకాశం లబ్ధిదారులకే ఇచ్చారు. కాకపోతే పైఅధికారులు ఆయా చిత్రాలు నిజమైనవేనా అని క్షేత్రస్థాయిలో విచారణ చేపడతారు.




లబ్ధిదారులు చరవాణిలో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. లాగిన్‌కు వెళ్లి తమ పేరు, చరవాణి నంబరు, గ్రామం వివరాలను నమోదు చేయాలి. ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో చిత్రం తీసి అప్‌లోడ్ చేయాలి. నిర్మాణ దశలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇస్తే ప్రక్రియ పూర్తవుతుంది.

**వాస్తవ ఫొటోలే అప్‌లోడ్ చేయాలి**

కె.నాగేందర్‌గౌడ్, డీఈ, గృహనిర్మాణ శాఖ

ఇళ్ల యాప్‌కు సంబంధించి లబ్ధిదారులకు త్వరలో అధికారులు అవగాహన కల్పిస్తారు. ఇందులో వాస్తవ చిత్రాలే నమోదు చేయాలి. తప్పుడు వివరాలు నమోదు చేస్తే విచారణలో బయటపడుతుంది. ఏవైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరు 1800 5995 991కు తెలియజేయవచ్చు.

## విధులకు వి'ముఖం'..!

సూర్యాపేట : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ అధికారులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామం నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తేనే లక్ష్యం నెరవేరుతుంది. కాగా కొందరు ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఆలస్యం అవుతోంది. గ్రామాల్లో, మండలాల్లో ఉద్యోగులు ఇలా వ్యవహరిస్తేనే శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నారు. అలాంటిది ఏకంగా కలెక్టర్ నిత్యం అందుబాటులో ఉండే కలెక్టరేట్‌లోనే ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పలు శాఖలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా ఆలస్యంగా వచ్చిన పలువురు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో మిగతారు అప్రమత్తమయ్యారు.

**సమయ పాలన కరవు...**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కొందరు ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతుండటంతో ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని ప్రవేశపెట్టారు. అందులో పని చేసే ప్రతి ఒక్కరూ




ఈ విధానం ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ పలుమార్లు ఆదేశాలు జారీచేశారు. అంతే కాకుండా తమ శాఖ కార్యాలయంలోనూ రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంటుంది. రిజిస్టర్ విధానం ద్వారా ఇష్టానుసారంగా హాజరైన ఉద్యోగులు ముఖ గుర్తింపు విధానాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సమయానుకూలంగా విధులకు హాజరయ్యేందుకు చాలామంది సానుకూలత చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొందరు ఉద్యోగులు నేటికీ ముఖ గుర్తింపు విధానాన్ని నమోదు చేసుకోవడం లేదని తెలుస్తోంది. కేవలం రిజిస్టర్‌లోనే సంతకం చేస్తుండగా విధుల్లో సమయపాలన పాటించడం లేదు. ఈ విషయమై ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా తమ పంథాను మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తెలిపారు. తనిఖీల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని సస్పెండ్ చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు.

# కబ్జాలు కనిపిస్తున్నా.. కనికరిస్తున్నారు!

తాండూరు: నాలాలు, కాలువలు సరిగా ఉంటే భారీ వర్షాలు కురిసినా ఎగువ నుంచి వచ్చే వరద దిగువకు సాఫీగా వెళ్లి పోతుంది. వీటిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, విస్తరణ తగ్గించినా పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాలు, లేదా నివాసాల మధ్యలోకి వెళుతోంది. జిల్లాలో అతి పెద్ద పట్టణంగా పేరున్న తాండూరులో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి ఇదే జరుగుతోంది. అయినా అధికారులు కబ్జాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవడంలేదు. వేసవిలోనే దృష్టి సారించాల్సి ఉన్నా, ఆ విషయాన్ని విస్మరించారు. ఫలితంగా శివారు కాలనీల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

**కాలువలపై నిర్మాణాలు .:** పట్టణ వాసులు వివిధ అవసరాలకు ఇళ్లల్లో వినియోగించిన నీరు చిన్న కాలువల ద్వారా దిగువకు వెళ్లిపోతుంది. ఇలా కొన్ని కాలనీల్లోని నీరంతా ఒక కాలువ నుంచి మరో కాలువకు అనుసంధానమై పెద్ద నాలాల్లోకి వెళుతుంది. ఇక్కడి నుంచి సాఫీగా దిగువకు వెళ్లే వ్యవస్థ ఉంది. అయితే వీటినే ఆక్రమించి కొందరు తాత్కాలిక, మరికొందరు శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఎగువ నుంచి వచ్చే వరద ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. మరికొన్ని చోట్ల కొందరు కాలువలపై సిమెంటు స్లాబులు వేశారు.



భారీ వర్షం కురిసినపుడు అంతర్గత రోడ్లకు సమాంతరంగా ఉన్న కాలువల్లోకి వరద వెళ్లే పరిస్థితి లేక, రోడ్లపైకి చేరి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శివాజీ చౌక్ (గౌతాపూరు రోడ్డు), శాంతినగర్, కొడంగల్ రోడ్డు, సాయిపూరు, ఇందిరానగర్, గ్రీన్‌సిటీ, మార్కండేయ నగర్, విశ్వంబర కాలనీ, సీతారాంపేట, గొల్లచెరువు, భవానీ నగర్‌తో పాటు మరికొన్ని కాలనీల్లో ఈ దుస్థితి నెలకొంది.

**వాగులదీ అదే పరిస్థితి** వరదంతా వాగుల ద్వారా ప్రవహించి కాగ్నానదిలో కలిసే వ్యవస్థను ఏళ్ల కిందటే ఏర్పాటు చేశారు. చాలా ఏళ్ల వరకు ఇవన్నీ సజావుగా ఉండడంతో వరద సాఫీగా దిగువకు వెళ్లి పోయేది. పట్టణం విస్తీర్ణం పెరుగుతున్న కొద్ది గృహాల నిర్మాణాలు ఎక్కువయ్యాయి. వాగులకు సమీపంలో నిర్మాణాలు చేపట్టిన వాటిని ఆక్రమించేశారు. నాపరాళ్ల పాలిష్ యూనిట్ల వారు వ్యర్థాలను వాటిల్లోనే గుమ్మరించడంతో మరింత కుంచించుకు పోయాయి. తాండూరు–చించోళి, కొడంగల్, కోకట్, చెంగేష్‌పూరు, వికారాబాద్ మార్గాల్లో ఉన్న వాగులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

## పచ్చ'ధనమే'

మునగాల: రైతుల మెట్టభూమిలో ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కొబ్బరి, మామిడి, నేరేడు, సపోటా, జామ, బత్తాయి, మునగ, డ్రాగన్, దానిమ్మ తదితర మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి ద్వారా మట్టి పనులే కాకుండా రైతులకు అనుసంధానంగా ఉచితంగా మొక్కలు అందజేసి, సాగు చేసేందుకు వేతనాలు కూడా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 156 మంది రైతులకు సంబంధించి 326 ఎకరాల్లో మొక్కలు నాటడం లక్ష్యంగా అధికారులు భూములు గుర్తించారు. ఇందులో ఇప్పటివరకు 163 ఎకరాల్లో పూర్తి చేశారు. త్వరలోనే మిగతా లక్ష్యాన్ని పూర్తి చేస్తామంటున్నారు.

**సంరక్షణకు వేతనం..** మామిడి రూ.45, దానిమ్మ రూ.40, కొబ్బరి రూ.90, మునగ విత్తనాలు రూ.8 లెక్కన ప్రభుత్వం కొనుగోలు చేసి



ముందుగా గుర్తించిన రైతులకు ఉచితంగా మొక్కలు అందజేస్తారు. ఒక ఎకరంలో మామిడి 80, నిమ్మ, బత్తాయి 100, మిగిలిన మొక్కలు 150 వరకు నాటాల్సి ఉంటుంది. ఉపాధి కూలీలతో గుంతలు తవ్వించి నాటుతారు. అనంతరం ఏడాదిలో ఎనిమిది నెలలు ఆ మొక్కలను సంరక్షించేందుకు రైతుకు వేతనం అందజేస్తారు. మస్టర్ పేమెంటు ద్వారా ఒక్కొక్క మొక్కకు నెలకు రూ.5 చెల్లిస్తారు. మొక్కలు పెరిగి పెద్దవైన తరువాత ఫలాలను రైతే అమ్ముకొని ఆర్థికంగా స్థిరపడవచ్చును. డ్రైలాండ్ హార్టికల్చర్ ఉపాధి పథకంలో భాగంగా ఐదెకరాలలోపు ఉన్న చిన్న సన్నకారు రైతులు మాత్రమే అర్హులని ఏపీవో శైలజ తెలిపారు. రైతు కుటుంబ సభ్యులు కూడా చేసుకోవచ్చునని, ఆర్థికంగా స్థిరపడటానికి ఉపయుక్తమని పేర్కొన్నారు.

## 'మీన'మేలా..?

భానుపురి : నీటివనరుల్లో చేప పిల్లల విడుదలపై ప్రభుత్వం నుంచి నేటికీ స్పష్టమైన ఆదేశాలు రాలేదు. గత వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు మత్తడి పోస్తున్నాయి.

అదును దాటుతుండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 154 మత్స్యసహకార సంఘాలు ఉండగా.. 15,540 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలో 621 నీటివనరుల్లో చేపపిల్లలను వదిలేందుకు ఎంపిక చేశారు. 190 చెరువులతోపాటు 2 జలాశయాల్లో 80–100 ఎంఎం సైజు గలవి, మిగతా 431 చెరువుల్లో 35–40 ఎంఎం సైజు గల చేపపిల్లలను ఏటా వదులుతున్నారు. అధికారులు 3.41 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు అంచనా రూపొందించారు. గతంలో జూన్, జులై నెలల్లో టెండర్లు పిలిచి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విడతల వారీగా చేపపిల్లలను వదిలేవారు. ఈ ఏడాది చేపపిల్లలను విడుదల చేస్తారా.. లేక గతేడాది మాదిరిగా కోత విధిస్తారా? అని మత్స్యకారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ నేటికీ ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారుల ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గతేడాది నవంబరులో చేప పిల్లలను వదిలారు. సాధారణంగా ఏటా జూన్‌లో టెండర్లు పిలుస్తారు.

# వలపు కాజా.. 'మోసాల బాజా'




హైదరాబాద్ : పాతబస్తీకి చెందిన పాతికేళ్ల కుర్రాడు ఓ మ్యాట్రిమోనీ గ్రూపులో అందమైన అమ్మాయి ఫొటో చూసి తనకు సరైన జోడని ఎంపిక చేసుకున్నాడు. అవతలి నుంచి సానుకూల స్పందన రావటంతో పొంగిపోయాడు. కొద్దిరోజులకు ఆ యువతి తన తల్లి ఆసుపత్రిలో ఉందని ఫోన్‌చేసి రూ.21లక్షలు కాజేసింది. బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు యువతి ఫొటో పాకిస్తాన్ నటిదని, సైబర్ మోసమని తేల్చారు. చిక్కడపల్లికి చెందిన విశ్రాంత ఉద్యోగి(68) భార్య మూడేళ్ల క్రితం మరణించారు. ఆయన వివాహ పరిచయ వేదికలో ప్రొఫైల్ ఉంచాడు. తనను సంప్రదించిన కరీంనగర్‌కు చెందిన మహిళను వివాహమాడేందుకు సిద్ధమయ్యాడు. రకరకాల అవసరాలు చెప్పి పలు దఫాల్లో రూ.7.75లక్షలు వసూలు చేసింది. మరో రూ.లక్ష కావాలని కోరటంతో బాధితుడు మోసపోయినట్టు గ్రహించాడు. వివాహ పరిచయ వేదికలను అడ్డాగా చేసుకుని మోసాలు అనేకం జరుగుతున్నాయి. ముఠాగా ఏర్పడి మ్యాట్రిమోనీ సైట్లలో నకిలీ పేర్లతో చేరుతున్నారు. అక్కడ తమ వలకు చిక్కిన వారి నుంచి వీలైనంత మొత్తం కొట్టేసి ముఖం చాటేస్తున్నారు.

బాధితుల్లో అత్యధికులు జీవిత భాగస్వామి కోల్పోయిన, దూరమైనవారే ఉంటున్నారు. రెండో పెళ్లికి సిద్ధమైన మహిళలు, పురుషులను లక్ష్యంగా చేసుకుని అందినంత వసూలు చేస్తున్నారు. జోడు కోసం వెతికే వారిని ఎంపిక చేసుకుని పురుషులైతే.. దేశ, విదేశాలకు చెందిన మోడల్స్, సినీనటులు, మహిళలైతే వ్యాపారులు, వైద్యులు, ఐటీ నిపుణుల ఫొటోలతో నకిలీ ప్రొఫైల్స్ తయారు చేస్తారు. ఇవన్నీ నిజమని భావించి సంప్రదించిన వారి ఫోన్ నంబర్లు, వ్యక్తిగత, కుటుంబ నేపథ్యం తెలుసుకుంటారు. ఆర్థికంగా బాగానే ఉన్నట్టు గుర్తిస్తే అందినంత కాజేసేంత వరకూ మాయమాటలతో మురిపిస్తారు. విదేశాల్లో ఉన్నట్టు నమ్మించేందుకు ఆయా దేశాల ఫోన్ నంబర్లను వాడుతూ, యాప్‌ల సాయంతో గొంతుమార్చి ఏమార్చుతారు. ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన ఇద్దరు మహిళల వలలో 120 మంది విశ్రాంత ఉద్యోగులు మోసపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వారిలో అత్యధికులు తమ పిల్లలకు తెలిస్తే ఇంటి నుంచి గెంటేస్తారని మౌనంగా ఉండిపోయారు.

**కట్టుకథలతో మురిపించి..**

వివిధ కారణాలతో భర్తకు దూరమైన, మూడు పదుల వయసు దాటిన మహిళలు భాగస్వామి కోసం మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. వీరి కోసమే కాచుకున్న మాయగాళ్లు నకిలీ ప్రొఫైల్‌తో ఆకట్టుకుంటారు. తాము విదేశాల్లో స్థిరపడిన ప్రవాసులమంటూ బోల్తా కొట్టిస్తారు. వారి కోసం ఇక్కడికే వచ్చి కొత్త వ్యాపారం ప్రారంభించి స్థిరపడతామని ఆశ చూపుతారు. వాట్సాప్‌లో గంటల కొద్దీ చాటింగ్ చేసి నమ్మకం కలిగిస్తారు. బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డులు బ్లాక్ అయ్యాయని, కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని కట్టుకథలు చెప్పి రూ.లక్షలు వసూలు చేస్తారు. ఇటీవల బంజారాహిల్స్‌కు చెందిన ఒక వైద్యురాలి నుంచి రూ.40 లక్షలు ఇలాగే కాజేశారు. ఇలాంటివి జరిగితే స్థానిక ఠాణా లేదా టోల్‌ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయాలి.

# పండుటాకులకు పోలీస్ 'భరోసా'



హైదరాబాద్: ఒంటరిగా ఉండే వృద్ధులపై నేరాల నియంత్రణ, వారి సంక్షేమం కోసం రాచకొండ పోలీసులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. సీనియర్ సిటిజన్ కేర్ అండ్ కన్సర్న్ డెస్క్ పేరుతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల వారీగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉండే ఒంటరి, దంపతులైన వృద్ధులను గుర్తించి స్థానిక సెక్టార్ ఎస్సైలు తరచూ వారిని కలిసి సమస్యలు తెలుసుకునేలా దీన్ని రూపొందించారు. భూములు, ఆస్తులు, డబ్బు కోసం ఒంటరిగా ఉండే వృద్ధులపై పెరుగుతున్న నేరాల నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆగస్టు 15 నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

**ఇలా గుర్తిస్తారు**

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం 47 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ ఠాణాల పరిధిలో వయసుమీరిన, పిల్లలు విదేశాల్లో ఉన్న, 70 ఏళ్లు దాటి ఒంటరిగా ఉండే వృద్ధులను గుర్తిస్తారు. పోలీస్‌స్టేషన్ల వారీగా వృద్ధులుండే ప్రాంతాల చిరునామా సేకరించి ఒక రికార్డు నిర్వహిస్తారు. స్థానిక సెక్టార్ ఎస్సైలు, పెట్రోలింగ్ సిబ్బంది ఆయా ప్రాంతాలకు గస్తీ కోసం వెళ్లినప్పుడు వీరిని కచ్చితంగా కలవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో 5 నుంచి 10 మంది వరకూ మొత్తం 550 మందిని గుర్తించారు. వివిధ సందర్భాల్లో సమస్యలపై పోలీసులను ఆశ్రయించిన వారిని ఇందులో చేర్చారు. నేరేడ్‌మెట్‌లోని కమిషరేట్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్ కేర్ అండ్ కన్సర్న్ డెస్క్ ద్వారా పోలీస్‌స్టేషన్లవారీగా తీసుకుంటున్న చర్యల్ని పర్యవేక్షిస్తుంటారు.

**ఎందుకోసమంటే..?**

ఇటీవల ఒంటరిగా ఉండే వృద్ధులపై నేరాల సంఖ్య పెరుగుతోంది. కొన్నిసార్లు దొంగల చేతుల్లో హతమవుతున్నారు.

అనారోగ్య సమస్యలతో మరణించినా పట్టించుకునేవారు లేక రోజుల తర్వాత వెలుగులోకి వస్తున్నాయి. అనారోగ్య సమస్యలతో బాధపడాన్ని గమనించి కొందరు సాయం చేస్తున్నట్లు నటిస్తూ ఆస్తి పత్రాలు, ఇంట్లో డబ్బు, విలువైన వస్తువులు కాజేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసగిస్తున్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు కేసుల్లో ఎక్కువ మంది బాధితులు వృద్ధులే ఉంటున్నారు. పోలీసులు తరచూ వెళ్లి కలవడం వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించేందుకు వీలుంటుంది. ఒంటరిగా ఉన్నామనే అభద్రతాభావం తగ్గిపోతుంది. నిత్యం కలవడం వల్ల వేధింపులు వంటివి వెలుగులోకి వస్తాయి.

# మధ్యమా'నీరు'పైనే ఆశలు



బోయినపల్లి: వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు)పై ఆశలు పెట్టుకున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వరి నాట్ల సమయంలో తీవ్ర ఇబ్బందులను రైతుల ఎదుర్కొన్నారు. పలు చోట్ల నాట్లు వేయడం ఆలస్యమైంది. జలాశయంలో ప్రస్తుతం నీటి నిల్వ 7.60 టీఎంసీలు ఉంది. తాజాగా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ నుంచి స్వల్పంగా వరద వస్తోంది. దీంతోపాటు బుధవారం ఎల్లంపల్లి నుంచి నీటిని మధ్యమానేరుకు తరలిస్తుండటంతో అన్నదాతలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

**మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా..**

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయానికి మానేరు, మూలవాగులతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి జలాశయం నుంచి వరదకాలువ ద్వారా వచ్చే నీరు ఆధారం. ఇక్కడి నుంచి దిగువమానేరు జలాశయం, అన్నపూర్ణ, మల్కపేట రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువలు, రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గుడి చెరువు, మిషన్ భగీరథకు నీరు వెళ్తుంది. జలాశయంలో మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా నీటి నిల్వ తక్కువ స్థాయిలో ఉంది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో జలాశయం కుడి కాలువ, దిగువన వరి నాట్లు ఆలస్యమయ్యాయి. నీటి విడుదల కోసం ఇల్లంతకుంట మండలం పొత్తూరు వంతెనపై రైతులు ఆందోళన చేసిన సంఘటన చోటు చేసుకుంది. కుడి కాలువ కింద సుమారు 57 వేల ఎకరాలు, ఎడమ కాలువ కింద 2 వేల ఎకరాల పంటలు సాగవుతున్నట్లు అంచనా. వరి నాట్లు వేయడం అధికశాతం పూర్తికావొచ్చింది. అయితే వర్షాలు కురుస్తున్నందున ప్రస్తుతం నీటి విడుదల చేసే అవకాశం ఉండకపోచ్చని అధికారులు భావిస్తున్నారు. అప్పటి వరకు ఎగువ నుంచి జలాశయానికి వచ్చిన ఇన్‌ఫ్లో ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల ఉంటుందని తెలిపారు.

**ఇదీ పరిస్థితి**

జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు (318 మీటర్లు) కాగా ప్రస్తుతం 7.60 టీఎంసీలు (307.19 మీటర్లు) నీరు నిల్వ ఉంది. జలాశయానికి మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ నుంచి 944 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

ఎల్లంపల్లి జలాశయం నంది, గాయత్రీ పంపుహౌస్ నుంచి వరద కాలువ ద్వారా బుధవారం 9450 క్యూసెక్కుల నీటి తరలింపు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు.

అన్నపూర్ణ జలాశయానికి నీటిని తరలించాలంటే జలాశయంలో సుమారు 11 టీఎంసీల నీరు ఉండాల్సి ఉంది.

జలాశయంలో 2022 ఆగస్టు నెలలో 20.07 టీఎంసీలు (314.83 మీటర్లు) 2023లో 20.37 టీఎంసీలు (314.97 మీటర్లు), 2024లో 17.08 టీఎంసీలు (313.35 మీటర్లు) నీరు నిల్వ ఉంది. అదే సమయంలో జలాశయానికి ఇన్‌ఫ్లో 2022లో 31.899 టీఎంసీలు, 2023లో 16.401 టీఎంసీలు, 2024లో 12.96 టీఎంసీల నీరు జలాశయానికి వచ్చింది. 2025లో ఇప్పటి వరకు 1.107 టీఎంసీల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదైంది.

**ఎగువ మానేరులో ఇలా..**

గంభీరావుపేట: మండలంలోని నర్మాల ఎగువమానేరు జలాశయం జలకళను సంతరించుకుంది. రెండు రోజుల నుంచి కామారెడ్డి జిల్లాలో కురిసిన వర్షాలకు మానేరు పల్వంచ వాగు నుంచి వరద మానేరు జలాశయంలోకి చేరుతోంది. బుధవారం రాత్రి వరకు మానేరు జలాశయంలో నీటిమట్టం 25 అడుగుల (గరిష్ఠం 31 అడుగులు)కు నీరు చేరిందని నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొన్నారు.

# నిధులు అందక.. సమస్యలు తీరక

కరీంనగర్ : గ్రామ పంచాయతీలకు అందాల్సిన నిధులు సకాలంలో రాకపోవడంతో అధికారులకు కష్టమవుతోంది. కార్యదర్శులు సొంతంగా అప్పులు తెచ్చి నిత్యం నిర్వహించాల్సిన పనులను చేపడుతున్నారు. ఆగస్టు 2024 నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో జిల్లాకు అందాల్సిన రూ.54 కోట్లు బకాయిపడ్డాయి. సాధారణ నిధులు రూ.8.80 కోట్లు వాడలేని పరిస్థితి. రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ నిధులూ 2023 నుంచి రావడం లేదు. కేవలం పంచాయతీ, పారిశుద్ధ్య సిబ్బంది జీతాలు మాత్రమే టీఎస్‌బీపాస్ ఖాతాలో వేస్తున్నారు.

**కార్యదర్శులపై భారం**

సర్పంచుల పదవీకాలం పూర్తయి 17 నెలలవుతోంది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ పాలన కొనసాగుతోంది. ఆ అధికారులు వారి సొంత శాఖకే సమయం కేటాయిస్తుండటంతో



భారమంతా గ్రామ కార్యదర్శులపైనే పడుతోంది. ఏ సమస్య ఎదురైనా కార్యదర్శి దృష్టికే తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వీధిదీపాలు, చేతిపంపులు, గేటువాల్వులు, నల్లా పైపులకు మరమ్మతులు, చెత్త సేకరణ, ట్రాక్టర్ల నిర్వహణ, మురుగు కాలువలు, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, వీటన్నింటి నిర్వహణ భారం వారిపైనే పడుతుండటంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

**రూ.లక్ష వరకు అప్పు చేశా..**

– ఓ గ్రామ కార్యదర్శి ఆవేదన

కరీంనగర్ గ్రామీణ మండలంలోని మా గ్రామ జనాభా ఆరు వేల వరకు ఉంటుంది. గ్రామంలో ప్రతి వార్డుకు ట్రాక్టర్ వెళ్లి చెత్త సేకరించాలి. వీధిదీపాల ఏర్పాటు, నల్లా పైపులైన్ల మరమ్మతు చేయాలి. వీటన్నింటికి ఇప్పటివరకు రూ.లక్ష వరకు అప్పులు తీసుకొచ్చి చెల్లించా. వడ్డీలు ఎలా కట్టలేక దిగులుగా ఉంది.

**ప్రభుత్వానికి నివేదిస్తున్నాం**


– వి.జగదీశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి, కరీంనగర్

సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో చాలాచోట్ల కార్యదర్శులే సొంతంగా డబ్బు తెచ్చి పనులు నిర్వహిస్తున్నారు. వారికి చెల్లించాల్సిన పెండింగ్ నిధులపై ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

# వేగంగా పోతున్నారు..!

చౌటుప్పల్: నిగనిగలాడే నాలుగు వరుసల రహదారి.. గంటకు 100 నుంచి 140 కిలో మీటర్ల వేగం అందుకో గల వాహనాలు.. ఇంకేముంది వాహన చోదకుల చేతిలో స్టీరింగ్ కళ్లెం లేని గుర్రమవుతోంది. మితిమీరిన వేగం ప్రయాణికులకే కాదు ప్రజలకూ ప్రాణాంతకం అవుతోంది. ఇటీవల హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై జరుగుతున్న వరుస ప్రమాదాలకు అతి వేగమే కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనదారులు అతి వేగంతో దూసుకెళ్తున్నారు. నిబంధనల ప్రకారం 80 కిలోమీటర్ల వేగంతోనే ఈ రహదారిపై ప్రయాణించాల్సి ఉంది. కానీ.. చాలా మంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి 90 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నారు. అతి వేగంతో వెళ్లే వారిలో ఎక్కువగా కారు చోదకులే ఉంటుండగా.. ఆర్టీసీ గరుడా, ట్రావెల్ బస్సులు కూడా అతి వేగంగా వెళ్లే వాటిలో ఉన్నాయి.

జులై చివరి వారంలో 256 కేసులు నమోదు చేసి రూ.2,64,960 జరిమానాను, ఆగస్టు నెలలో 13 నాటికి 435 కేసులు నమోదు చేసి



రూ.4,50,225 జరిమానా విధించారు. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న పంతంగి టోల్‌ప్లాజా మీదుగా రోజుకు 40 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వ్యవధిలోనే స్పీడ్ గన్‌ల ద్వారా గుర్తిస్తే రోజుకు 30కి పైగా కేసులు నమోదవుతున్నాయి.

జులై చివరి వారం నుంచి ఆగస్టు 13 వరకు ఒక్క చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులే 691 ఓవర్ స్పీడ్ కేసులను నమోదు చేశారు. నమోదు చేసిన కేసుల్లో వాహన చోదకులంతా 90 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్టు ట్రాఫిక్ పోలీసులు స్పీడ్‌గన్‌ల ద్వారా గుర్తించారు. అతివేగంగా వెళ్లినందుకు రూ.1035 జరిమానాను చెల్లించాలని వాహన చోదకుల చరవాణులకు సందేశం పంపిస్తున్నారు. అతివేగంగా వెళ్తున్నప్పుడు స్పీడ్ గన్‌లో తీసిన చిత్రంలో ఎంత వేగంతో వెళుతున్నారో కూడా ఉంటుంది. అతివేగంగా వెళ్లిన వాహనంపై పోలీసులు పంపిన చిత్రంలో ప్లస్() గుర్తు ఉంటుంది. జులై చివరి వారం నుంచి నమోదైన 691 కేసుల్లో ఓ ద్విచక్రవాహన చోదకుడు 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లడం గమనార్హం.

**వాహనాలు అదుపు తప్పుతాయి: విజయ్ మోహన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, చౌటుప్పల్** అధిక ప్రమాదాలకు కారణం అతివేగమే. అతి వేగంతో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారు. నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేస్తే ప్రమాదానికి ఆస్కారమే ఉండదు. అసలే వర్షాకాలం కాలంలో అతివేగంగా వెళ్తే వాహనాలు అదుపు తప్పుతాయి. వాహనం ఎక్కడైనా ఆగిపోతే దాని వెనుకాలే వచ్చే వాహనదారులకు సూచికలు పెట్టాలి.

# కొత్త కోర్సులొచ్చాయి.. చేరగ రారండి..!

గాజువాక : కాలం చెల్లిన కోర్సుల స్థానంలో గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కొన్నేళ్లుగా కొత్త కోర్సుల కోసం సాగిస్తున్న ప్రయత్నాలు ఇప్పుడు ఫలప్రదమయ్యాయి. ప్రభుత్వ ఉపాధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఐటీఐకి తాజాగా మూడు కోర్సులు మంజూరయ్యాయి. యువత ఉపాధికి ఇవి ఎంతగానో ఉపయోపడతాయని చెబుతున్నారు.

**పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా..:** గాజువాక ఐటీఐలో ప్రస్తుతం 13 ట్రేడ్లు ఉండగా, 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ రెండు దశాబ్దాలుగా పాత కోర్సులే నడుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఫార్మాసిటీ, హెచ్‌పీసీఎల్, కోరమాండల్, ఎస్ఈజెడ్, పలు ప్రైవేటు పరిశ్రమల యాజమాన్యాలు తరచూ రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, అటెండెంట్–కెమికల్ ట్రేడ్ల అభ్యర్థులను అడుగుతున్నా వాటిని అందించలేని పరిస్థితి. గత ప్రభుత్వంలో పలుమార్లు ఉన్నతాధికారులకు కొత్త కోర్సుల అవసరాలపై నివేదికలు పంపినా పట్టించుకోలేదు.

**అధ్యయనం చేసి..:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక బృందం అధ్యయనం చేసి గాజువాక స్టీల్‌సిటీ ఐటీఐకి రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్, అటెండెంట్–కెమికల్ ట్రేడ్లు అత్యవసరమని తేల్చింది. దీంతో సుమారు రూ.2 కోట్ల విలువైన పరిశోధన పరికరాలు, శిక్షణకు అవసరమైన యంత్ర సామగ్రి, నూతన భవన సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో కోర్సుకు 40 మంది చొప్పున పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులను తీసుకుంటారు. ప్రత్యేక ట్రైనింగ్ ఆఫీసర్లు సంబంధిత వృత్తి నైపుణ్య



శిక్షకులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. కొత్త భవనంలో ఆయా యూనిట్లకు పరికరాలను సమకూర్చారు. ప్రస్తుతం అసెంబ్లింగ్, టెస్టింగ్ పనులు, విద్యుత్తు సదుపాయ కల్పనలో సిబ్బంది బిజీగా ఉన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

**నిపుణులకు మంచి అవకాశాలు**

– కె.ఎస్.శ్రీనివాసరావు, గాజువాక మోడల్ ఐటీఐ ప్రిన్సిపల్

వృత్తివిద్యా కోర్సులు పూర్తి చేసిన వారికి పారిశ్రామిక రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయి. పరిశ్రమలు ఆయా కోర్సుల్లో నైపుణ్యం సాధించిన వారిని ఉద్యోగాలకు తీసుకుంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త కోర్సులను సాధించాం. ఇప్పటికే అభ్యర్థులు చేరడానికి సిద్ధంగా ఉన్నారు.

# ఆక్రమించి.. ఆయకట్టును ముంచి

ఎమ్మిగనూరు : నేతల అండదండలతో పలువురు రెచ్చిపోతున్నారు. విలువైన స్థలాలను ఆక్రమించేస్తున్నారు. చివరికి కాలువ స్థలాలను సైతం వదలడం లేదు. ఏకంగా కాలువలను పూడ్చేస్తున్నా అధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని ఆయకట్టు భూములకు నీరందించేందుకు గాను డిస్ట్రిబ్యూటరీ పరిధిలో కాలువలు నిర్మించారు. ముగితి ఫారం సమీపంలో ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందేలా పట్టణం మధ్యన కాలువలో ఏర్పాటుచేశారు. చివరికి అది కబ్జాకు గురైంది. ఫలితంగా



సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.

**దుకాణాలు ఏర్పాటుచేసుకుని..**

కాలువ స్థలంలోనే అక్రమంగా కట్టడాలు నిర్మించి వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు అనుకూలంగా మార్చుకున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకుపైగా ఉంది. కాగా కాలువ పొడవునా 250కిపైగా దుకాణాలు, పక్కా కట్టడాలు నిర్మించారు. 50 సెంట్లకుపైగా స్థలం ఆక్రమణలకు గురైంది. దీని విలువ రూ.కోట్లలో ఉంటుంది. ఓంశాంతి సర్కిల్ ప్రాంతంలోనూ కాలువ పొడవునా ఆక్రమించేశారు. అప్పట్లో వైకాపా నేతలు కొందరి వద్ద డబ్బులు తీసుకొని డబ్బాలు వేయించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

**ఇష్టానుసారంగా పూడ్చేసి..**

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో 79 డిస్ట్రిబ్యూటరీ కాలువ ఐదు కిలోమీటర్ల మేర ఉంది. దీని కింద 200 ఎకరాలకుపైగా ఆయకట్టు విస్తరించి ఉంది. సులువుగా నీరు ప్రవహించేలా 40 నుంచి 80 అడుగుల వెడల్పుతో కాలువ కోసం స్థలం సేకరించారు. కొన్ని దశాబ్దాలపాటు ఈ కాలువ ఉండేది. పంట పొలాలు సాగయ్యేవి. పట్టణంలోని లక్ష్మణ్ టాకీస్ ఏరియా నుంచి దాదాపు 2.5 కిలోమీటర్లకు పైగానే కాలువ ఉంది. విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదురుగా సుమారు 80 అడుగుల మేర వెడల్పు ఉంది. ఓ వైకాపా నేత దీనిపై కన్నేసి కొద్దిదూరం పూడ్చేశాడు. వంతెన నిర్మించి ఇక్కడ ప్లాట్లు విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు.

# దారిన పడుతున్నాయ్

బేతంచెర్ల : ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి డోన్ సమీపంలో గుత్తి జాతీయ రహదారి వరకు రూ.650 కోట్లతో 340బి హైవే నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. బేతంచెర్ల మండల సమీపంలో గొరుమానుకొండ, సీతారాంపురం, చిన్నమల్కాపురం, డోన్ కొండపేట కాలనీలోని అటవీ ప్రాంతం తదితర ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు అనుమతులు లేకపోవడంతో గత కొన్ని రోజులుగా ఆగిపోయాయి. గొరుమానుకొండ మెట్ట వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మలుపు ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. ఈ మలుపుల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అనుమతులు రావడంతో..

ఎట్టకేలకు అటవీ శాఖ అనుమతులు రావడంతో కొండను తొలిచే పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో యంత్రాలతో రహదారి పనులు వేగంగా చేస్తున్నారు. ఆర్.కొత్తపల్లె సమీపంలో టోల్‌గేట్ పనులు పూర్తయ్యాయి. ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు అందించే ఉద్దేశంతో టోల్‌గేట్ నిర్మాణం, ప్రయాణికుల సౌకర్యార్థం మూడు విశ్రాంతి గదులు నిర్మించారు. గ్రామాల కూడలి ప్రాంతాల్లో పేర్లను చూపే సూచికల బోర్డుల ఏర్పాటు, ప్రమాదకరంగా ఉన్న రహదారుల పక్కన వేగ నిరోధకాల ఏర్పాటును పూర్తి చేసినట్లు హైవే అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 44 కి.మీ. మేర రహదారి నిర్మాణ పనులు పూర్తైనట్లు పేర్కొన్నారు. 9 కి.మీ. మేర రహదారి పనులను ఆగస్టు చివరి వారంలో ప్రారంభించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తయితే వాహన చోదకులకు సౌకర్యంగా ఉంటుంది.

# పట్టణాభివృద్ధికి.. బృహత్ అడుగులు



చిత్తూరు : పట్టణాలకు వలసల తాకిడి పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సౌకర్యాలు ఉన్నాయా? అంటే లేవనే సమాధానమే వస్తోంది. ఈ నేపథ్యంలోనే పెరగనున్న జనాభా, ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని పట్టణాభివృద్ధి సంస్థల్లో (యూడీఏ) బృహత్ ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) ఆధారంగా తయారు చేయనున్నారు. కొత్త నిర్మాణాలకు అనుమతులు మొదలు అభివృద్ధి పనుల నిర్వహణ వరకు మాస్టర్‌ప్లానే ఆధారం. జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్‌లో 100 లేయర్లలో సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది.

**చుడాలో 3,450 చ.కి.మీ.** చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా) పరిధిలో 23 మండలాలున్నాయి. ప్రస్తుతం చిత్తూరు నగరం వరకే మాస్టర్‌ప్లాన్ ఉంది. 2041 అవసరాలు దృష్టిలో ఉంచుకుని అప్పట్లో రూపొందించారు. చుడా.. ఇప్పుడు పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పీలేరు నియోజకవర్గాలను కలిపి బృహత్ ప్రణాళిక తయారు చేయనుంది. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలు పీకేఎం ఉడాలో ఉన్నందున ఆ పట్టణాభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఇదే పనిలో ఉంది. నెలాఖరుకు ఏజెన్సీలు ఖరారు కానున్నాయి.

**తుడాలో 1,100 చ.కి.మీ.**

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) పరిధిలో 39 మండలాల్లో 25 లక్షల జనాభా ఉంది. తుడా పరిధి 8,353 చ.కి.మీ. ఉంది. ఇందులో గతంలో 1,100 చ.కి.మీ. వరకే మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బృహత్ ప్రణాళిక రూపొందించాలని ప్రైవేటు ఏజెన్సీలను ఆహ్వానించడంతో తుడా అధికారులు ఈ అంశంపై కసరత్తు చేస్తున్నారు. 6000 చ.కి.మీ. వరకు తుడా, మిగతా విస్తీర్ణంలో ఆయా మున్సిపాలిటీలే మాస్టర్‌ప్లాన్ తయారుచేస్తాయి. టెండర్లు ఖరారైన తర్వాత పనులు మొదలుపెట్టనున్నారు. చివరగా ప్రజల అభ్యంతరాలు స్వీకరించనున్నారు. మొత్తంగా 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ప్రతిఒక్కరికీ స్పష్టత ఉంటుంది** మాస్టర్‌ప్లాన్ తయారీతో పట్టణాలు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వం ఏదైనా ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే అక్కడ అవసరమైన భూమి ఉందా? లేదా? అనేది సులభంగా తెలుసుకోవచ్చు.

శుభం భన్సల్, తుడా వీసీ

# ఆక్రమణల చెరలో.. జలవనరులు



పుంగనూరు : జిల్లాలో సాగునీటి వనరుల ఆక్రమణలకు అడ్డుకట్ట పడడం లేదు. మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారులు, రైతులు వాటిని ఎడాపెడా కబ్జా చేస్తున్నారు. జిల్లాలో 4,303 చెరువులు, కుంటలు ఉండగా వాటి పరిధిలో 46,900 హెక్టార్ల సాగు భూములు ఉన్నాయి. కొన్నేళ్లుగా ఆక్రమణలు కొనసాగుతుండటంతో విస్తీర్ణం సగానికి సగం పడిపోయింది. గతంలో తెదేపా ప్రభుత్వం చెరువులు, కుంటలు సర్వేచేసి కందకాలు తవ్వడానికి శ్రీకారం చుట్టింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆక్రమణలను అడ్డుకోవడంపై దృష్టి సారించకపోగా అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలిచినట్లు ఆరోపణలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలకు, వ్యవసాయ భూములకు డిమాండు ఉండటంతో ఆక్రమణదారులు చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు.

పట్టణాలు, మండల కేంద్రాలు విస్తరిస్తుండటంతో ప్రభుత్వ పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురవుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో దూసుకొచ్చిన ఈ ఆక్రమణలు కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ ఆస్తులు అక్రమార్కుల పాలవుతున్నాయి. రాయలచెరువు, పుంగమ్మ చెరువుల కాలువలు పుంగనూరు పట్టణ నడిబొడ్డున ఉండటంతో అక్రమార్కులు వాటిని ఆక్రమిస్తున్నారు. పట్టణ పై భాగంలో రాయలచెరువు సుమారు వంద ఎకరాల్లో ఉంది. చెరువు కింద 135 ఎకరాల సాగుభూమిలో 50 ఎకరాలను ఇళ్లస్థలాలుగా మార్చేసి భవనాలు నిర్మించారు. సాగుభూమికి నీరందించే రాజుకాలువ చెరువు తూము నుంచి సుమారు కిలోమీటరు పొడవున 6 నుంచి 10 అడుగుల వెడల్పుతో వెళ్లే కాలువ స్థానిక ఎన్టీఆర్ కూడలి మీదుగా వెళ్తోంది. ఈ కాలువను తమ భూమిలోకి కలుపుకోవడానికి ఆక్రమణదారులు పోటీ పడుతున్నారు. చెరువుకింద గల రాజుకాలువ, ఉపకాలువల పూడికతీత చేపడితే భవిష్యత్తులో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండదు.

చౌడేపల్లె మండలం పెద్దయల్లకుంట్లకు చెందిన తుమ్మచెరువును ఆక్రమించి ముళ్లకంచె వేశారు. అలాగే కాటిపేరి గ్రామ పంచాయతీ పరిధిలో, సదుం మండలంలో గాండ్లపల్లె వద్ద చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయి.

**సర్వే చేయిస్తాం**

రాయలచెరువు రాజుకాలువ సర్వేచేసి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. రైతులు సైతం అధికారులకు సహకరించాలి.

రాము, తహసీల్దారు, పుంగనూరు.

# పట్టాలెక్కిన పారిశ్రామిక ప్రగతి



అచ్యుతాపురం : వైకాపా సర్కారు హయాంలో నిర్లక్ష్యానికి గురైన పరిశ్రమలు కూటమి ప్రభుత్వ పాలనలో గాడిలో పడుతున్నాయి. నష్టాలు భరించలేక పరిశ్రమలను మూసివేస్తున్నా ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ అనకాపల్లి జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహించినా పరిశ్రమలను తెరిపించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు చర్యలు తీసుకుంది. అచ్యుతాపురం సెజ్‌లో రెండు పెద్ద పరిశ్రమలు పునఃప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. సెజ్ పరిధిలో ఖాళీగా ఉన్న భూముల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఇప్పటికే సెజ్‌లో పర్యటించి ఖాళీస్థలాలు, తీసుకోవాల్సిన పరిశ్రమలు, మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని భూములు తీసుకుని ఏర్పాటు చేయని సంస్థలకు నోటీసులు జారీ చేశారు. అభిజీత్ అనుబంధ సంస్థ అయిన కైజాన్ పవర్ లిమిటెడ్‌కు కేటాయించిన 150 ఎకరాలను వెనక్కు తీసుకుంటామని నోటీసులు జారీ అయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏఐ ఆధారిత పరిశ్రమకు 40 ఎకరాలు కేటాయించారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. సెజ్‌లో ఖాళీగా ఉన్న భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ఎలక్ట్రికల్ ఇన్సులేటర్లు తయారుచేసే డబ్ల్యూఎస్ కంపెనీ గతంలో మూతపడింది. దీనికి ఎదురుగా ఉండే సదరన్ బయోడీజిల్ కంపెనీ, కాన్ఫిడెన్షియల్ గ్యాస్ లిమిటెడ్ కంపెనీలకూ తాళాలు వేశారు. డబ్ల్యూఎస్ కంపెనీ మూత పడటంతో వెయ్యి మంది, సదరన్ బయోడీజిల్‌లో 200 మంది, కాన్ఫిడెన్షియల్ గ్యాస్ లిమిటెడ్ కంపెనీలో 120 మందికి ఉపాధి లేకుండా పోయింది. వీరంతా వేర్వేరు ప్రాంతాలకు వలసపోయారు. ఇప్పుడు ఈ మూడు పరిశ్రమలు తిరిగి ఉత్పత్తిని ప్రారంభించనున్నాయి. డబ్ల్యూఎస్ కంపెనీ స్థానంలో విన్ విన్ స్పెషాలటీ ఇన్సులేటర్ కంపెనీ ఉత్పత్తిని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. సదరన్ బయోడీజిల్ కంపెనీ స్థానంలో సోలన బయో ఫ్యూయల్ కంపెనీ ఏర్పాటు కానుంది. కాన్ఫిడెన్షియల్ గ్యాస్ కంపెనీని పూర్తిగా తొలగించి గతంలోనే రాజరాజేశ్వరీ లలిత త్రిపుర సుందరీదేవి ఫెర్రో కంపెనీని నెలకొల్పారు.

# సేద్యానికి ‘సౌర’భం

ఒంగోలు : ‘పీఎం కుసుమ్’ పథకం అమలులో భాగంగా జిల్లాలోని ఉచిత వ్యవసాయ కనెక్షన్లకు సౌర విద్యుత్తు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ మేరకు తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన భూముల గుర్తింపు ప్రక్రియ తుది దశకు చేరింది. అత్యధిక కనెక్షన్లు ఉన్న పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దర్శి, దొనకొండ, పొదిలి, కొండపి, పీసీపల్లి, పామూరు, కనిగిరి, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారు. ఈ నిర్మాణ పనుల టెండర్‌ను హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. తాజాగా 70 ఎకరాల ప్రభుత్వ భూములు కేటాయిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. భూ సేకరణ విషయమై ఆయా మండలాల తహసీల్దార్లు, విద్యుత్తు అధికారులతో ఇప్పటికే జేసీ గోపాలకృష్ణ సమీక్షించి... రైతుల సుముఖతతో 200



ఎకరాల ప్రైవేటు స్థలాలను గుర్తించారు. లీజు ఒప్పందం పూర్తయితే పనులు ప్రారంభించేందుకు విద్యుత్తు, నెడ్‌క్యాప్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కార్యాచరణ ఇలా...**

జిల్లాలో మొత్తం 278 ఉప కేంద్రాలు ఉండగా... 41 కేంద్రాల పరిధిలో సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పి వాటికి అనుసంధానించనున్నారు. తద్వారా పంపిణీ వృథా తగ్గడంతో పాటు... సరఫరా నాణ్యత మెరుగు పడుతుందని భావిస్తున్నారు.

మొత్తం 109 మెగావాట్ల తయారీ లక్ష్యం కాగా ఇందుకు 499.75 ఎకరాలు అవసరమని గుర్తించారు. 250 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా... మిగతా 249.75 ఎకరాలు రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. సేకరించిన భూములకు సంబంధించి రైతులతో 25 ఏళ్లకు లీజు ఒప్పందం చేస్తారు. ప్రారంభ సంవత్సరం ఎకరానికి రూ.30 వేలు... తరువాత ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం పెంచి కౌలు రూపంలో చెల్లిస్తారు.

# మళ్లీ మొదలెట్టారు!

మద్దిపాడు : మద్దిపాడులో ఇసుక మాఫియా చెలరేగుతోంది. గుండ్లకమ్మ పరీవాహకంలో యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ వివిధ ప్రాంతాలకు రవాణా సాగిస్తున్నారు. సెలవు రోజుల్లో అధికారులు రారని మరింత బరితెగిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వాహనాలు జప్తు చేసినా...: గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణాలో చక్రం తిప్పిన ఓ ద్వితీయ శ్రేణి నాయకుడి జేసీబీ, ట్రాక్టర్లను ఇటీవల జేసీ గోపాలకృష్ణ జప్తు చేశారు. మరో ఇసుకాసురుడి డంప్‌లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. అప్పటి నుంచి స్తబ్దుగా ఉన్న వీరు... తాజాగా అధికార పార్టీ నాయకుల మధ్య తలెత్తిన విభేధాలను ఆసరాగా చేసుకుని మళ్లీ దందా సాగిస్తున్నట్లు సమాచారం. మరికొందరు స్థానికంగా పలుకుబడి కలిగిన వారిని మచ్చిక చేసుకుని దందా సాగిస్తున్నారు. **అంతటా ఇదే తీరు...**మల్లవరం, కొలచనకోట, వెల్లంపల్లి వంతెన దిగువన, కీర్తిపాడు, రాచవారిపాలెంలో జేసీబీతో తవ్వకాలు సాగుతున్నా యి. దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.2,500 నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు. గుండ్లకమ్మ నుంచి రోజుకు 70 ట్రాక్టర్ల మేర రవాణా సాగుతోంది. ఇనమనమెళ్లూరులో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన డీకే పట్టాలను కొనుగోలు చేసి... ఆయా ప్రాంతాల్లోనూ తవ్వకాలు సాగిస్తు న్నారు. టిప్పర్లతో రవాణాకు డంప్‌లు సిద్ధం చేస్తున్నారు. ఈ కారణంగా భూగర్భజలాలు పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఉద్యోగం వల.. చదువరులు విలవిల

భీమవరం: ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నతాధికారి మా బంధువు.. ఫలానా ప్రజాప్రతినిధి మా చుట్టం.. ఉద్యోగం గ్యారంటీ.. అంటూ కేటుగాళ్లు విసిరే వలలో చదువరులు సైతం చిక్కుకుంటున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన కొందరు అప్పులు చేసి మరీ సొమ్ములిచ్చి మోసపోతున్నారు. చేసేది లేక బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ ప్రకటనల్లో.. నిబంధనల మేరకు విద్యార్హతలు, ప్రతిభావంతుల జాబితానుసరించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. అడ్డదారిలో ప్రభుత్వ ఉద్యోగం ఎలా వస్తుందని ఒక్క క్షణం ఆలోచించకుండా రూ.లక్షల్లో ముట్టజెబుతూ మోసపోతున్నారు. దళారులకు డబ్బులిచ్చి మోసపోవద్దంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

**కొన్ని ఉదంతాలు..** ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి భీమవరం రెండో పట్టణానికి చెందిన ఓ మహిళ నుంచి ప్రసాద్‌రాజు అనే వ్యక్తి ఆగస్టు నెలలో రెండు విడతలుగా రూ.9.80 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించలేదు.

ప్రభుత్వ ఉద్యోగం ఎరవేసి తాడేపల్లిగూడేనికి చెందిన వ్యక్తి రూ.10 లక్షలు చొప్పున వసూలు చేశాడని తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు, తణుకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాధితులు ‘మీ కోసం’లో ఫిర్యాదు చేశారు.

రైల్వేలో ఉద్యోగం పేరుతో మోడి గ్రామానికి చెందిన యువకుడి నుంచి రూ.30 లక్షలను హైదరాబాద్‌కు చెందిన ముఠా మోసగించింది.

సచివాలయ ఉద్యోగాలు ఇప్పిస్తామని మొగల్తూరు మండలం కొత్తోటకు చెందిన ఇద్దరు యువకుల నుంచి రూ.12 లక్షలు తీసుకొని మోసగించారు. మంగళగిరి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌నని, హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానంటూ నరసాపురానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.8.5 లక్షలు తీసుకొని మోసగించాడు.

తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.8 లక్షలు ఓ వ్యక్తి తీసుకుని మోసం చేశాడని భీమవరానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

**ఫిర్యాదులు తక్కువ..** రాజీలే ఎక్కువ.. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లకు నెలలో 10కిపైగా ఇలాంటి ఫిర్యాదులొస్తున్నా వాటిలో ఒకటి, రెండు మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే ‘మీ కోసం’లో పలు ప్రాంతాల నుంచి వచ్చే అర్జీల్లో వాటి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. రాజీ చేసుకుంటే కొంత సొమ్ము అయినా తిరిగొస్తుందనుకుంటూ కొందరు ఫిర్యాదులకు వెనుకాడుతున్నారు.

## గవిమఠం.. అభివృద్ధి శూన్యం

ఉరవకొండ : ఉరవకొండలోని కరిబసవస్వామి గవిమఠం దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ చంద్రమౌళీశ్వరుడు ఉత్సవమూర్తిగా పూజలు అందుకొంటున్నాడు. ఈ మఠానికి ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 770 ఉప మఠాలు ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో 2,943 ఎకరాల సాగు భూమి ఉంది. ఒక్క ఉరవకొండ పట్టణంలోనే మఠం స్థలంలో 314 దుకాణాలు ఉన్నాయి. వీటన్నిటి ద్వారా సుమారు ఏటా రూ.2 కోట్లు మఠానికి ఆదాయం చేకూరుతోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లకు వడ్డీ రూపంలోనూ ఆదాయం



వస్తోంది. అన్ని వ్యయాలు పోగా మఠం ఏడాది ఆదాయం రూ.1.26 కోట్ల వరకు మిగులుతోంది. భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

**భవనాలు శిథిలం:** విశాల వాతావరణంలో శతాబ్దం కిందట నిర్మించిన గవిమఠం భవనాలు శిథిలం అవుతున్నాయి. చంద్రమౌళీశ్వరుని ఉత్సవ విగ్రహం ఉండే గర్భగుడితోపాటు ఇతర గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గర్భగుడిపై మొక్కలు మానులుగా ఎదుగుతున్నా... తొలగించే నాథుడే కరవయ్యాడు. మోస్తరు వర్షం కురిస్తే ఆలయం మొత్తం కారుతోంది. గదులన్నీ పాడవుతుండటంతో భక్తులు వచ్చినా ఉండడానికి అవకాశం లేదు.

**ప్రతిపాదనలు తయారు చేస్తాం**

రాణి, మఠం సహాయ కమిషనరు

మఠాన్ని ఇటీవల దేవదాయ ఇంజినీరింగ్ అధికారుల బృందం సందర్శించింది. ముందుగా డీజీపీహెచ్ స్కెచ్‌ను తయారు చేయాలని సూచించారు. మఠం పీఠాధిపతి, సిబ్బంది సంయుక్తంగా చర్చించుకుని తగిన నిర్ణయం తీసుకుంటాం.

## చెప్పిందొకటి.. చెల్లించేదొకటి

చిత్తూరు : మామిడి రైతుకు గిట్టుబాటు ధరపై భరోసా లేకుండాపోయింది. చెప్పిన ధరకు చెల్లిస్తున్న మొత్తానికి పొంతన లేకపోవడంపై వారు గగ్గోలు పెడుతున్నారు. పుత్తూరు మండలం కేబీఆర్‌పురానికి చెందిన 50 మంది రైతులు కార్వేటినగరం మండ లం అన్నూరు సమీపంలోని పరిశ్రమకు తోతాపురి తరలించారు. ప్రస్తుతం టన్నుకు రూ.4-7 వేల మధ్య ధర చెల్లిస్తున్నారు. ఈ ఏడాది తోతాపురికి డిమాండు లేకపోవడంతో ప్రభుత్వం రంగంలోకి దిగి.. టన్నుకు రూ.12 వేలు ధర నిర్ణయించింది. పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.8 వేలు, ప్రభుత్వం రూ.4 వేలు చెల్లించాల్సి ఉంది.

**సమావేశాలు నిర్వహించినా..**

ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో రైతు సంఘాలు, గుజ్జు పరిశ్రమల



యజమానులతో కలెక్టర్లు సమావేశాలు నిర్వహించి ధర నిర్ణయించారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు వచ్చిన సందర్భంలో గుజ్జు పరిశ్రమల యజమానులను పిలిచి మాట్లాడారు.

**ప్రశ్నిస్తే బెదిరింపులు..**

పరిశ్రమలకు కాయలు తరలించి రెండునెలలు గడిచిపోగా బిల్లుల కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితులు ఉండటంతో రెండురోజులుగా రైతుల ఖాతాల్లో నగదు వేస్తున్నారు. అయితే ఒక్కో రైతుకు ఒక్కోధర చెల్లిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇచ్చిందే తీసుకోవాలని బెదిరిస్తుండటంతో వారు లబోదిబోమంటున్నారు.

**31 యాజమాన్యాలకు నోటీసులు**

మామిడికి ప్రభుత్వం ప్రకటించిన ధరను చెల్లించాలంటూ అధికారులు గుజ్జు పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. రూ.5-6వేలు మాత్రమే చెల్లిస్తుండటంపై మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో 31 పరిశ్రమలకు నోటీసులిచ్చామని ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో తోతాపురి సాగు : 55 వేల హెక్టార్లు

గుజ్జు పరిశ్రమల కొనుగోళ్లు : 5.50 లక్షల టన్నులు

## దసరాకు గృహయోగం

చిత్తూరు : దసరా నాటికి నిరుపేద కుటుంబాలు గృహప్రవేశం చేసేలా కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పటిలోగా నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చూడాలని దిశానిర్దేశం చేసింది. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పేరుతో హడావుడి చేసింది. అరకొరగా నిధులు కేటాయించింది. ఫలితంగా చాలామంది ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. మరికొందరు అప్పులు చేయలేక మధ్యలోనే నిర్మాణాలు ఆపేశారు. ఫలితంగా మంజూరైన ఇళ్లలో 40 శాతం కూడా పూర్తికాని పరిస్థితి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది. దశలవారీగా నిర్మాణాలు పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించింది. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది. దీంతో చాలామంది గృహాలు నిర్మించేందుకు ముందుకొచ్చారు.

**36 వేలకు.. 23 వేలే..**

గత ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్ ధర రూ.1.80 లక్షలకు అదనంగా నిధుల్ని విడుదల చేసింది. దీంతో చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో జరుగుతున్న పనుల్లో వేగం పెరిగింది. వైకాపా ప్రభుత్వం చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాలకు 36,672 గృహాలను మంజూరు చేయగా.. 23 వేల ఇళ్లను పూర్తిచేశారు.

ఇవి పూర్తయితేనే పీఎంఏవై 2.0

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం లబ్ధి కోసం జిల్లాలోని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అయితే పీఎంఏవై 1.0 పథకంలో మంజూరైన ఇళ్లు పూర్తయితేనే కొత్త ఇళ్లు మంజూరు కానున్నాయి.

# బొప్పాయి.. లాభాలు లేవోయి



అనంతపురం : గత ఏడాది నుంచి లాభాలు చూసిన బొప్పాయి రైతులకు ఈసారి చేదు అనుభవం ఎదురైంది. మంచి దిగుబడి వచ్చినా.. మార్కెట్‌లో ధర భారీగా పడిపోయింది. గతంలో వచ్చిన లాభాలను చూసి ఈసారి ఎక్కువ మంది రైతులు బొప్పాయి సాగు చేశారు. అయితే వర్షాలు కురవడంతో దిల్లీ మార్కెట్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. దానికితోడు మహారాష్ట్రలో బొప్పాయి దిగుబడి అధికంగా రావడంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ప్రారంభంలో టన్ను రూ.10-12 వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.3-4 వేలకు పడిపోయింది. కనీసం మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదు. చేసేదిలేక రైతులు కాయలు, పండ్లను చెట్లపైనే వదిలేస్తున్నారు.

**1,500 హెక్టార్లలో సాగు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,500 హెక్టార్లలో బొప్పాయి సాగు చేశారు. హెక్టారు విస్తీర్ణంలో 3,060 మొక్కలు నాటుతున్నారు. ఒక్కో మొక్కకు డిమాండ్‌ను బట్టి రూ.15-20 ఖర్చవుతోంది. పంటసాగు చేసిన తొమ్మిదో నెల నుంచి కోతలు మొదలై 10 నెలలపాటు దిగుబడి వస్తుంది. 14-16 కోతలు రాగా, హెక్టారుకు 55-70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మార్కెటింగ్ చేసుకోవడం రైతులకు తలకు మించిన భారమవుతోంది..

**నిలిచిన పెట్టుబడి రాయితీ**

బొప్పాయి రైతులను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. గతంలో హెక్టారు విస్తీర్ణంలో పంట సాగుకు పెట్టుబడి రాయితీ తొలి ఏడాది రూ.16,500, రెండో ఏడాది రూ.6 వేలు చొప్పున మొత్తం రూ.23,500 అందించేవారు. ఈ ఏడాది నుంచి రాయితీని ఉద్యానశాఖ నుంచి తొలగించారు. కేవలం వడగండ్ల వానలు కురిసి పంట దెబ్బతింటేనే రూ.13,500 పరిహారం అందజేస్తున్నారు

**గిట్టుబాటు కాలేదు**

సంజీవరాయుడు, చోళసముద్రం (కూడేరు)

మూడెకరాల్లో బొప్పాయి సాగు చేశా. రూ.3.20 లక్షలు పెట్టుబడి పెట్టా. తెగుళ్ల నుంచి పంటను కాపాడుకున్నా. మార్కెటింగ్ సౌకర్యం లేదు. రెండు కోతల్లో రూ.లక్ష మాత్రమే వచ్చింది. టన్ను రూ.4-5 వేలకు చెప్పినా కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. కాయలు మాగుతున్నాయి. చేసేదిలేక పండ్లను చెట్లపైనే వదిలేశా. కొన్నేళ్లుగా పెట్టుబడి రాయితీ నిలిపేశారు. రాయితీ అందించి ఆదుకోవాలి.

**తిరిగి అమ్ముకుంటున్నాం**

ఓబయ్య, కమ్మూరు(కూడేరు)ఎనిమిదెకరాల్లో బొప్పాయి పంట సాగు చేశా. దిగుబడి బాగుంది. సీజన్‌లో దిల్లీ, ఆగ్రా, కలకత్తా, ముంబయి, చెన్నైల్లో మార్కెట్ సదుపాయం ఉండేది. అక్కడ వర్షాలు ఎక్కువగా కురవడంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడంలేదు. కాయలను అనంతపురంలో తిరిగి అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యంతో పాటు ధర కల్పిస్తే రైతులకు ఊరట కలుగుతోంది.

# నకిలీలలు ఎన్నో?



అనంతపురం : మెగా డీఎస్సీ-2025లో నకిలీ సర్టిఫికెట్ల కలకలం రేపుతోంది. గతనెల 28, 29, 30 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. అందులో కొన్ని నకిలీ సర్టిఫికెట్లున్నట్లు ఆరోపణలు రావడంతో పునఃపరిశీలన చేస్తున్నారు. ఇందులో అనేక నకిలీ సర్టిఫికెట్లను అధికారులు గుర్తించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 807 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నారు. 757 మంది ధ్రువపత్రాలు తొలివిడతలో పరిశీలించారు. రెండో విడతో 13మంది, మూడో విడతలో ముగ్గురు అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. సర్టిఫికెట్లు పరిశీలించి వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మొదట ధ్రువపత్రాల పరిశీలన సక్రమంగా జరగలేదని విమర్శలు వస్తున్నాయి. దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, టెట్ తదితర సర్టిఫికెట్లలో తేడాలు వెలుగులోకొచ్చాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెళ్లింది. ఇతర జిల్లాల నుంచి అధికార బృందం త్వరలో జిల్లాకు రానున్నారు. ఇతర జిల్లా అధికారులు సర్టిఫికెట్ల పునః పరిశీలన చేయనున్నారు.

**పరిశీలనలో చేతివాటం!**

ధ్రువపత్రాల పరిశీలనకు 16 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో నలుగురు అధికారులున్నారు. అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సర్టిఫికెట్లు సక్రమంగా లేకపోయినా ఓకే చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.

**గుర్తించలేక పాట్లు..**

ఓ అభ్యర్థి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ సమర్పించారు. ఆ అభ్యర్థి కుటుంబానికి ఆన్‌లైన్‌లో 11 ఎకరాల భూములున్నాయి. కానీ పట్టాపాసు పుస్తకంలో 3 ఎకరాలు మాత్రమే ఉంది. రెవెన్యూ అధికారి 3 ఎకరాలున్నట్లు సర్టిఫై చేశారు. అసలు సర్టిఫికెట్ ఏదో గుర్తించలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

దివ్యాంగుల సర్టిఫికెట్లు 24 మంది సమర్పించారు. మెడికల్ బోర్డు అధికారులు పునఃపరిశీలన చేశారు. దరఖాస్తులో 80 శాతం ఉండగా పునఃపరిశీలనలో 20 శాతం మాత్రమే వికలత్వం ఉన్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్లలో ఎక్కువగా నకిలీలున్నాయి.

ఓ అభ్యర్థి డిగ్రీ మార్కులు 56 శాతం వచ్చాయి. కానీ ప్రొవిజన్ సర్టిఫికెట్‌లో తృతీయశ్రేణిలో ఉత్తీర్ణత ఉన్నట్లు పేర్కొన్నారు.

మరో అభ్యర్థి టెట్ పేపర్-2లో మంచి మార్కులు సాధించాడు. స్పెషల్ ఎడ్యుకేషన్ టెట్ పరీక్షలో వచ్చిన మార్కులు ఆంగ్లం స్కూల్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేశారు. ఒక అంశంలో టెట్ ఉత్తీర్ణుడై, డీఎస్సీలో మరో సబ్జెక్టుకు దరఖాస్తు చేశాడు.

డిగ్రీలో ఒక సబ్జెక్టు చదివి, డీఎస్సీలో మరో సబ్జెక్టుకు దరఖాస్తు చేశాడు. కులధ్రువ పత్రాల్లో కూడా తేడాలున్నాయి. మహిళా అభ్యర్థులు తమ తండ్రి పేరుతో కులధ్రువపత్రాలు కొందరు సమర్పించారు. మరికొందరు భర్త పేరుతో కులధ్రువపత్రాలు సమర్పించారు.

# పీఎంశ్రీ.. విద్యార్థుల భవితకు భాగ్యశ్రీ

గోరంట్ల : జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా (పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం విద్యార్థులు పలు రంగాల్లో నైపుణ్యాలు, సామర్థ్యాలు సాధించడానికి దోహదపడుతుంది. క్రీడలు, వైజ్ఞానిక పరిజ్ఞానం, నీటి సంరక్షణ, గ్రంథాలయాలు, ప్రత్యేక ప్రయోగశాలలు, ఆరోగ్యం, పరిశుభ్రత, నిత్య జీవితంతో ముడిపడి ఉన్న అంశాలపై అవగాహన, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్.. ఇలా ఎన్నో అంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడానికి పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారు. ప్రస్తుతానికి రెండు విడతలుగా పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేస్తున్నారు.

**అన్నిచోట్ల పనులు సాగుతున్నాయి**

దేవరాజు, పథకం జిల్లా అదనపు సమన్వయకర్త

పీఎంశ్రీ పథకం అమల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా రెండో స్థానంలో ఉంది. రెండు విడతలుగా మంజూరైన అన్ని పాఠశాలల్లో ప్రత్యేక ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి.

పథకం : పీఎంశ్రీ, జిల్లా: శ్రీసత్యసాయి

ఎంపికైన పాఠశాలలు: 37 (మొదటి విడత-25, రెండో విడత-12)




పథకం ప్రారంభించినది: 2022 సెప్టెంబరు, 2026-27 విద్యాసంవత్సరానికి పూర్తి చేయాలి.

ఒక్కో పాఠశాలకు విడుదలయ్యే నిధులు: రూ.2 కోట్లు అంచనా

ప్రస్తుత పరిస్థితి: అన్ని పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

## చెత్తలో చేతివాటం.. 'రాశా'కుటిల వ్యూహం..!

పాయకరావుపేట : చెత్త సేకరణలో అక్రమాలకు పాల్పడి జీవీఎంసీకి రూ.కోట్లు నష్టం వాటిల్లేలా చేసిన 'రాశా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్' కంపెనీపై కమిషనర్ కేతన్‌గార్గ్ చర్యలు తీసుకున్నారు. తక్షణమే ఒప్పందాలను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్ల నుంచి ఆ సంస్థ చేసిన పనులను పరిశీలించిన కమిషనర్... క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశించారు. 'రాశా' అక్రమాలపై గతంలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి.

ఏళ్లుగా 'సీసీఎస్ ప్రాజెక్టు' ఆ సంస్థకే: నగరంలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించడానికి జీవీఎంసీ క్లోజ్డ్ కాంపాక్షన్ సిస్టం (సీసీఎస్) అమలు చేస్తోంది. పాతనగరం, గాజువాక, చీమలాపల్లి, భీమిలి, ముడసర్లోవలో చెత్త తరలింపు కేంద్రాలు ఉన్నాయి. వాటి నిర్వహణ బాధ్యతలను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టడానికి రాశా సంస్థ వచ్చింది. తర్వాత కొందరు ఇంజినీరింగ్ అధికారులను ప్రసన్నం చేసుకుని మరో కంపెనీ టెండర్ ప్రక్రియలో పోటీకి రాకుండా చేసింది.

నాలుగేళ్ల క్రితం వరకు ఒక్కో స్టేషన్ నుంచి చెత్తను తరలించడానికి రూ.60 లక్షలతో టెండర్ పిలిస్తే, ఆ తర్వాత రూ.1.20 కోట్లు, రూ.1.80 కోట్లతో టెండర్లు నిర్వహించారు.

ప్రస్తుతం ఆ మొత్తం రూ.2.10 కోట్లకు చేరింది. నాలుగేళ్లలో వ్యయం నాలుగు రెట్లకు చేరడం గమనార్హం.



**నెల నుంచి కమిషనర్ నిఘా..:** వర్షాల నేపథ్యంలో నెల రోజులుగా ఆయా కేంద్రాలలో చెత్త నిల్వలపై కమిషనర్ పూర్తి నిఘా ఉంచారు. గాజువాక, పాతనగరం కేంద్రాల్లో చెత్త భారీగా పేరుకుపోవడాన్ని గమనించారు. 'రాశా' సంస్థ నిర్వహణ బాధ్యతలు, చెల్లింపులు, తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

టెండరు నిబంధనలకు విరుద్ధంగా ఇతర వాహనాలతో చెత్తను తరలించి అదనంగా రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు కమిషనర్ గుర్తించారు. దీనిపై గుత్తేదారులు, ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. గాజువాక, పాతనగరం కేంద్రాల్లో స్టాటిక్ కాంపాక్టర్ పని చేయడం లేదని, మరమ్మతులకు రూ.1.50 కోట్లు అవసరమని తెలిపారు. దాని నిర్వహణ బాధ్యతలను రాశా సంస్థ చూడాలి. అందుకు విరుద్ధంగా ఏడాదిన్నర క్రితం ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి యంత్రం నిర్వహణకు రూ.1.50 కోట్లు వెచ్చించారు. అయినా అది పనిచేయకపోవడం గమనార్హం.

**నోటీసులు ఇచ్చాం- పీవీవీ సత్యనారాయణరాజు, జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు** రాశా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేదని గుర్తించి గుత్త రద్దు నోటీసు జారీ చేశాం. గాజువాక చెత్త తరలింపు కేంద్రంలో వందల టన్ను వ్యర్థాలు పేరుకుపోయి ఉండడంతో కమిషనర్ ఆగ్రహించి ఈ చర్యలకు ఆదేశించారు.

## 150 పనులకు రూ.12 కోట్లు

పాయకరావుపేట : జిల్లాలోని పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లలో నిధులు మంజూరయ్యాయి. ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో 150 పనులు చేపట్టనున్నారు. ఈ నిధులతో కేజీబీవీ, గురుకుల జూనియర్ కళాశాలలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వసతులు కల్పించనున్నారు. పాయకరావుపేట, ఎలమంచిలిలలో జడ్పీ బాలికోన్నత, నర్సీపట్నం, సబ్బవరం, మాడుగుల, మాకవరపాలెం, కశింకోట, వడ్డాది, రావికమతం, ఎస్.రాయవరం, దేవరాపల్లి, నాతవరం తదితర ప్రాంతాల్లోని కేజీబీవీల్లో బయాలజీ, భౌతిక, రసాయన శాస్త్ర ల్యాబ్‌లకు సుమారు రూ.ఆరు కోట్లు వెచ్చించనున్నారు. కశింకోట, మాకవరపాలెం, రావికమతం, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చోడవరం, రాంబిల్లి మండలాల్లోని ఏడు పాఠశాలల్లో రూ.26.6 లక్షలతో బాలికలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పిస్తారు. వీటితోపాటు తాగునీటి వసతి, రిసోర్సు గదుల నిర్మాణాలు చేపట్టనున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రయోగశాలలు, మరుగుదొడ్లు నిర్మించను న్నారు. తరగతి గదులకు మరమ్మతు, తాగునీటి సదుపాయం కల్పించేందుకు నిధులు ఖర్చు చేయనున్నారు. ర్యాంపుల నిర్మాణం, విద్యుద్దీకరణ సహా 22 రకాల పనులు చేపట్టనున్నారు. చీడికాడ, నర్సీపట్నం, మునగపాక, కశింకోటలోని ఏపీ మోడల్ పాఠశాలల్లో రూ.60 లక్షలతో భవనాల మరమ్మతు చేపడతారు. ఏడు పాఠశాలలకు ప్రహరీల నిర్మాణానికి రూ.67.5 లక్షలు కేటాయించారు. అనకాపల్లి, ఎస్.రాయవరం, బుచ్చెయ్యపేట, నక్కపల్లి మండలాల్లోని నాలుగు పాఠశాలలకు రూ.6 లక్షలతో విద్యుద్దీకరణ పనులు చేపట్టనున్నారు.

## ఖరీదైన భవనం.. వదిలేదే లే..!

గాజువాక : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆవరణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)కు కేటాయించిన భవనం ఎవరికి చెందాలనే విషయమై పీటముడి పడింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014లో రాష్ట్రానికి ఐఐటీ, ఐఐఎం, ఐఐపీఈ వంటి ప్రఖ్యాత విద్యా సంస్థలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో ఐఐటీని తిరుపతిలో, ఐఐఎం, ఐఐపీఈని విశాఖలో ఏర్పాటు చేశారు. నాడు ఐఐపీఈని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయం పైభాగంలో, ఐఐఎంను ఆంధ్రబ్యాంకు నూతనంగా నిర్మించిన భవనంలో ప్రారంభించారు. **ఏయూ, ఆంధ్రబ్యాంకు అవగాహన ఒప్పందం:** ఆంధ్రబ్యాంకు అప్పటి చైర్మన్ రామకృష్ణన్ ఏయూలో పీహెచ్‌డీ చేశారు. ఏయూకు తన వంతు సహాయం చేయాలన్న ఉద్దేశంతో సుమారు రూ.4కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చారు. తొలుత రూ.2కోట్లతో ఏయూ డీసీఎంఎస్ ముందు భాగంలో భవనం నిర్మించారు. దాన్ని ఏయూ డీసీఎంఎస్ విభాగం వాడుకోవడానికి ఏయూ- ఆంధ్రబ్యాంకులు అప్పట్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఐఐఎంకు శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి గంభీరంలో స్థలం కేటాయించారు. అప్పటిలోగా ఆంధ్ర బ్యాంకు భవనాన్ని కార్యకలాపాలకు కేటాయించారు. నాడు సుమారు రూ.8కోట్లతో సౌకర్యాలు కల్పించారు. గడువు తీరిన తర్వాత ఏయూకి విడిచి వెళ్తామని చెప్పారు. 2022లో గంభీరంలో శాశ్వత భవనాల నిర్మాణం పూర్తి కావడంతో ఐఐఎం అక్కడికి తరలివెళ్లింది. అయినా భవనాన్ని 2025 సెప్టెంబరు 30వరకు తమ ఆధీనంలో ఉంచుకుంటామని ఐఐఎం అధికారులు కోరడంతో ఏయూ అధికారులు సమ్మతించారు.

**మాకంటే మాకు కావాలి..:** ఈ నెలాఖరుకు ఐఐఎంకు ఇచ్చిన గడువు ముగియనుంది. సదస్సుల నిర్వహణకు మరి కొన్నాళ్లు భవనాన్ని తమ ఆధీనంలో ఉంచాలని ఐఐఎం అధికారులు మళ్లీ కోరుతుండగా ఏయూ డీసీఎంఎస్ అధికారులు తిరస్కరిస్తున్నారు. సొంత భవనాలు నిర్మించుకున్నాక కూడా అడగడం సబబు కాదని అంటున్నారు. విభాగానికి 21 తరగతి గదులు అవసరం కాగా, 12మాత్రమే ఉన్నాయని, వసతి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఆ భవనం డీసీఎంఎస్‌కు ఆంధ్రబ్యాంకు ఇచ్చినందున తమకే చెందుతుందంటున్నారు.

చురకలు



# గట్టుదాటని దిద్దుబాటు

కర్నూలు : తప్పులు సరి చేయలేదు.. రైతుల విన్నపాలు పట్టించుకో లేదు.. హడావుడిగా కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేయడంపై రైతులు మండిపడుతున్నారు. కర్నూలు జిల్లాకు 90,610, నంద్యాల జిల్లాకు 55 వేల వరకు పాసుపుస్తకాలు వచ్చాయి. వాటిని మండలాలకు చేర్చారు. వాటిని వీఆర్వోలు పరిశీలిస్తున్నారు. పేర్లు, ఫొటోలు, రెవెన్యూ గ్రామం వంటి వివరాలు సక్రమంగా ఉన్నాయి. కీలకమైన విస్తీర్ణం, సర్వే నంబరు, భూమి స్వభావం (మెట్ట లేదా మాగాణి) తదితర తప్పులు మాత్రం చాలావరకు అలాగే ఉన్నట్లు చెబుతున్నారు. వాటివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని రెవెన్యూ వర్గాలే చెబుతుండటం గమనార్హం.

**విన్నపాలు 'నేల'పాలు**

రీసర్వే గ్రామాల్లో జరిగిన తప్పులు సరిదిద్దేందుకు గతేడాది అక్టోబరు నుంచి నవంబరు వరకు గ్రామసభలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 450కి పైగా రీసర్వే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో 32,859 దరఖాస్తులు వచ్చాయి. అందులో సర్వే శాఖకు సంబంధించి 24,432, రెవెన్యూ శాఖకు సంబంధించి 8,227 అర్జీలు వచ్చాయి..డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో 472, నంద్యాల జిల్లాలో 444 గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో మొత్తం 11,566 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కూడా 80 శాతం ఎల్పీఎం నంబర్లకు సంబంధించినవే ఉ



న్నాయి. ఇప్పటికీ వాటికి పరిష్కారం చూపలేదు.

**అవగాహన కల్పించడంలో విఫలం**


గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీసర్వేలో తప్పులు దొర్లాయి. హక్కుదారుల పేర్లు, భూ విస్తీర్ణం, గ్రామం వంటి వివరాలు తప్పులతడకగా నమోదు చేశారు. స్పందించిన కూటమి ప్రభుత్వం ఉమ్మడి ఎల్పీఎం నంబర్లను విభజించాలని ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. సబ్ డివిజన్ సేవ కోసం చెల్లించాల్సిన రూ.500 రుసుమును ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. జాయింట్ ఎల్పీఎంల విభజనకు 344 దరఖాస్తులే వచ్చాయి. జాయింట్ ఎల్పీఎంలున్న రైతులు సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోయారు. దీంతో ప్రభుత్వం స్పందించి ఈ ఏడాది డిసెంబరు వరకు గ్రామ సచివాలయంలో రూ.50 చెల్లిస్తే జాయింట్ ఎల్పీఎంను విభజించే అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఆరు వేలకు మించి దరఖాస్తులు రాలేదు. రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో ఈ ప్రక్రియ కూడా ముందుకు సాగడం లేదు.

# ఇది మన బ్రాండ్..!

పొందూరు : పొందూరు అనగానే మదిలో మెదిలేది ఖాదీ వస్త్రాలే. జిల్లా పేరును దేశ, విదేశాలకు తీసుకెళ్లాయి. కొండ పత్తితో దారం తీసే ప్రక్రియ, వస్త్రాల తయారీలో చేపముల్లు వినియోగం వీటికి ఇంత ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. 1921లో మహాత్మాగాంధీకి ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యం గురించి తెలిసింది. దీనికి ముగ్ధుడైన బాపూజీ కుమారుడు దేవదాస్ గాంధీని పంపారు. దీనిపై గాంధీజీ 'యంగ్ ఇండియా' పత్రికలో ఓ కథనం ప్రచురించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దిల్లీ ఎగ్జిబిషన్ మైదానంలోని హస్తకళా ప్రదర్శనలో ఈ వస్త్రాలను చూసి ఆశ్చర్యపోయారు. 1955లో ఆచార్య వినోబా బావే శంకుస్థాపన చేసిన పొందూరు ఖాదీ చేనేత సంఘ భవనమే నేడు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మిక అభివృద్ధి సంఘంగా సేవలందిస్తోంది.

**పలాస జీడిపప్పు.. ప్రత్యేక గుర్తింపు**

పలాస ప్రాంతంలో లభించే జీడిపప్పునకు దేశ, విదేశాల్లోనూ పేరుంది. జిల్లా వ్యాప్తంగా 350 పరిశ్రమల ద్వారా రోజుకు 80 టన్నుల వరకు ఉ



త్పత్తి జరుగుతోంది. రుచితో పాటు నాణ్యత ఉండటంతోనే ఇంత పేరొచ్చింది. ఇక్కడ తయారైన పప్పు ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. దేశంలో కొత్తగా పలు రాష్ట్రాల్లో జీడి కర్మాగారాలున్నా పలాస సరకుకు గిరాకీ తగ్గలేదు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలోనూ పప్పునే వాడుతున్నారు.

**మందస కోవా.. రుచి వహ్వా..**

పాలకోవా అన్ని ప్రాంతాల్లో దొరుకుతుంది. మందస పాలకోవా రుచికి మాత్రం ఏదీ సాటిరాదు. అందుకు ఇది ప్రత్యేక గుర్తింపు పొందింది. వనమూలికలకు నిలయమైన మహేంద్రగిరులపై పచ్చిక బయళ్లలో మేత మేసే గేదె పాలతో వీటిని తయారు చేయడంతో రుచి, సుచి అద్భుతంగా ఉంటాయి. కట్టెల పొయ్యిపైనే తయారు చేస్తారు. కప్పుల్లో వేసి క్రీం కోవాగా మార్కెట్ చేస్తారు. ముద్దగా చేసి బిళ్లలు కూడా విక్రయిస్తారు.వన్నె తగ్గని బుడితి పరిశ్రమ..: వందేళ్ల చరిత్ర బుడితి కంచు, ఇత్తడి పరిశ్రమ సొంతం. దీనిపై ఆధారపడి 60 వరకు కుటుంబాలు జీవిస్తున్నాయి. పూర్వకాలంలో బరువైన బిందెలు, దీపం కుందులు, కంచాలు, గ్లాసులు తయారు చేసేవారు. వాటికి డిమాండు తగ్గడంతో ప్రస్తుతం పూలకుండీలు, దేవతామూర్తుల విగ్రహాలు, ఇళ్లలో అలంకరణ వస్తువులు చేస్తున్నారు. వాటిని ఆర్డర్లపై లేపాక్షికి వస్తువులు పంపుతారు. రాజమహేంద్రవరం, విశాఖ వంటి ప్రాంతాల నుంచి ముడి సరకు రప్పిస్తారు. దిల్లీ, ఆగ్రా, ముంబయి, కోల్‌కతా, చెన్నై వంటి మహానగరాల్లోనూ ప్రత్యేక స్టాళ్లలో వీటిని విక్రయిస్తారు.

**ఏడుకొండలపైకి ఇక్కడి బెల్లం..**ఆమదాలవలస నిమ్మతొర్లువాడ గ్రామంలో తయారయ్యే బెల్లానికి గుర్తింపు ఉంది. ఇందుకు కారణం తయారీ విధానం, సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన చెరకు వినియోగం. సేంద్రియ సాగు కారణంగా చెరకు సహజంగానే బంగారు రంగులో ఉండటంతో రసాయనాలు వాడకుండా చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల అవశేషాలతో పాటు తేమ లేకుండా ఉండటం, రంగురుచి బాగుండటంతో రెండున్నరేళ్ల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం ఈ బెల్లాన్ని తీసుకుంటోంది. ఆత్రేయపురం పూతరేకులు, కాకినాడ కాజాల తయారీలోనూ దీన్నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఒడిశా, బెంగాల్ వ్యాపారులు సైతం కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

# ఉపాధి చూపినా.. వెనకడుగే!!



విశాఖపట్నం: ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థుల కోసం జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. వీటిలో పలువురు యువత ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. అప్పటి వరకు ఉద్యోగం కోసం ఆశగా ఎదురు చూసి ఎంపికైన అభ్యర్థుల్లో.. 50 శాతానికి పైగా వాటిలో చేరట్లేదు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడానికి ఆయా యాజమాన్యాలు నెల రోజుల సమయం ఇస్తున్నాయి. ఆ సమయంలో పలువురు వెనకడుగు వేస్తున్నారు. మరికొందరు ఉద్యోగాల్లో చేరిన వారం రోజులకే యాజమాన్యాలకు సమాచారం అందించకుండా మానేస్తున్నారు. ఆ ఖాళీల కోసం మళ్లీ మేళాలు నిర్వహించాల్సిన పరిస్థితి.

**నైపుణ్యాలు మెరుగైతేనే..:** ఇంటర్, డిగ్రీ పూర్తయిన తర్వాత చాలామంది అభ్యర్థులు ఇతర నైపుణ్యాలపై దృష్టి పెట్టట్లేదు. నైపుణ్య శిక్షణ తీసుకొని, అనుభవం ఉన్న అభ్యర్థులు ఇతర మార్గాల్లో మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారు. మిగిలినవారు ఉపాధి కార్యాలయాల్లో మేళాలకు హాజరవుతున్నారు. వారు కమ్యూనికేషన్ స్కిల్స్, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంపొందించుకోవట్లేదని నిపుణులు చెబుతున్నారు. నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సూచిస్తే 'మళ్లీ నేర్చుకోవాలా.?' అనే వైఖరితో ఉంటున్నారు. మరోవైపు కంపెనీల యాజమాన్యాల ఎక్కువ నైపుణ్యాలున్న అభ్యర్థులను తీసుకోవడానికి ఆసక్తి చూపుతుండటం గమనార్హం. ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, మంచి అవకాశాలు చూపిస్తే ఎక్కువ మంది అభ్యర్థులకు ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కారణాలివేనా.....**

ప్రస్తుతం ఉత్పత్తి, రిటైల్, సేల్స్, మార్కెటింగ్, ఫార్మా కంపెనీల్లోనే ఎక్కువగా అవకాశాలుంటున్నాయి. వాటిలో కనీసం రూ.15 వేల నుంచి జీతాలు మొదలవుతున్నాయి. ఎక్కువ క్షేత్రస్థాయిలో తిరిగి పనిచేయాల్సినవే అధికం. ఆయా రంగాల్లో, ఒత్తిడికి గురయ్యే ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడట్లేదు. ఇప్పటికే ఉద్యోగం చేస్తున్న కొందరు అభ్యర్థులు ఎక్కువ జీతం వచ్చే మెరుగైన అవకాశం కోసం జాబ్‌మేళాలకు హాజరవుతున్నారు.

నైపుణ్యాలు, అనుభవం లేకపోయినా భారీగా అంచనాలు పెట్టుకుంటున్నారు. ప్రాథమిక స్థాయిలోనే ఎక్కువ జీతాలు ఆశిస్తున్నారు.

స్థానికంగానే ఉద్యోగాలు కావాలని కోరుకుంటున్నారు. పొరుగు జిల్లాలకు వెళ్లాలని సూచిస్తే ప్రతి 100 మందిలో 10 శాతం మాత్రమే రిపోర్ట్ చేస్తున్నారు.

మహిళా అభ్యర్థులు వసతి, ఇతర సదుపాయాలు సరిగాలేకపోవడంతో చేరట్లేదు. ఈ ఏడాదిలో నిర్వహించిన జాబ్‌మేళాలు: 27

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు: 924

**చిన్న కారణాలతో వెనకడుగు–అరుణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి**

జాబ్‌మేళాల ద్వారా యాజమాన్యాలు, అభ్యర్థులకు మధ్య వారధిలా పనిచేస్తున్నాం. బయటి జాబ్‌మార్కెట్‌పై కొందరు అభ్యర్థులకు పూర్తి అవగాహన ఉండట్లేదు. మేళాలకు హాజరైన 100 మందిలో 10 మంది ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. ఉద్యోగంలో చేరి, అనుభవం సంపాదించాలని సూచిస్తున్నా చిన్న చిన్న కారణాలతో పలువురు వెనకడుగు వేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

# క్యాన్సర్ రక్కసికి.. ఆధునిక చికిత్స




కాకినాడ: మారుతున్న జీవనశైలితో క్యాన్సర్ బారిన పడుతున్నవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. బోధనాసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నా ఆధునిక పరికరాలు లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇకపై కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలోనే (జీజీహెచ్) అత్యాధునిక చికిత్స అందుబాటులోకి రానుంది. ఇందుకోసం కొంగొత్త వైద్య పరికరాలు సమకూర్చుతున్నారు. కలెక్టర్ షాన్‌మోహన్, నేతల చొరవతో రూ.42 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలరేటర్ క్యాన్సర్ చికిత్స యంత్రాన్ని ఓఎన్‌జీసీ కంపెనీ ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఈ యంత్రం ఏర్పాటు, చికిత్స అందించేందుకు వీలుగా జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా రూ.6 కోట్లతో భవనం నిర్మిస్తారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీటికి శంకుస్థాపన చేయబోతున్నారు.

కాకినాడ జీజీహెచ్‌కు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి చికిత్సకు అధికసంఖ్యలో వస్తుంటారు. అందులో క్యాన్సర్ పీడితుల సంఖ్య భారీగానే ఉంటోంది. గత అయిదేళ్లలో కొత్తగా 2,303 క్యాన్సర్ కేసులు వచ్చాయి. కొత్త, పాతవి కలిపి ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారు 8 వేల మందికి పైగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్‌సీడీ సర్వేలో మరింతమంది అనుమానితులను గుర్తించి ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. వీరందరికీ ఇరవయ్యేళ్లక్రితం నుంచి వినియోగిస్తున్న కోబాల్ట్ యంత్రంతోనే నేటికీ చికిత్స అందిస్తున్నారు. కొన్నేళ్లుగా హెచ్‌డీఆర్ బ్రాకీ థెరప్మీ యంత్రం కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నా ఫలితం లేకపోయింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధుల కోసం పలుమార్లు ఓఎన్‌జీసీ దృష్టికి జిల్లా అధికారులు తీసుకువెళ్లారు. ఎట్టకేలకు ఆధునిక యంత్రం అందుబాటులోకి రానుంది.

**ప్రత్యేకంగా బంకర్..**లీనియర్ యాక్సిలరేటర్ యంత్రం ఏర్పాటుకు ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు అనుమతి ఉండాలి. రేడియో ధార్మిక కిరణాలు బయటకు సోకకుండా ఓ బంకర్ నిర్మించాలి. కాకినాడలో ఐటీఐ వెనుక రంగరాయ కళాశాలకు చెందిన స్థలం ఉంది. అందులో ఈ బంకర్‌తో పాటు రోగుల వార్డు, చికిత్సకు అవసరమైన 12 వేల చదరపు అడుగులతో భవనాన్ని నిర్మించనున్నారు. ఇందుకోసం రెడ్‌క్రాస్ నిధులను వెచ్చిస్తున్నారు.

**ఆధునిక యంత్రంతో ఉపయోగమిలా..**

క్యాన్సర్ బాధితులకు ప్రస్తుతమున్న యంత్రంతో రేడియేషన్ చికిత్స చేసినప్పుడు క్యాన్సర్ కణంతో పాటు మిగతా భాగాలపైనా ప్రభావం పడుతోంది. కచ్చితత్వం ఉండడం లేదు. లీనియర్ యాక్సిలరేటర్ వంటి అధునాత యంత్రాన్ని ఉపయోగిస్తే ఏ భాగంలో క్యాన్సర్ కణం ఉందో కచ్చితంగా అక్కడే చికిత్స ఇవ్వొచ్చు. చుట్టూ ఉన్న ఆరోగ్యకర కణజాలం దెబ్బతినదు. నొప్పి తగ్గించడానికి, ట్యూమర్ వృద్ధిని ఆపడానికి వీలవుతుంది బసవతారకం ఆసుపత్రిలో ఇలాంటి యంత్రంతోనే చికిత్స అందిస్తున్నారు.

# గట్టుదారి.. పట్టు జారి!



ఆచంట : పశ్చిమలో వశిష్ఠ గోదావరి తీరం వెంబడి పెనుగొండ మండలం దొంగరావిపాలెం నుంచి నరసాపురం వరకు మూడు నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న ఏటి గట్టు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. ఏటిగట్టు రోడ్ల అభివృద్ధికి వైకాపా ప్రభుత్వ హయాంలో పైసా కూడా ఖర్చు చేయలేదు. తీర గ్రామాల ప్రజల రాకపోకలకు, వరద సమయంలో సహాయక చర్యలకు ఈ మార్గమే ఆధారం. వర్షం కురిస్తే ఈ మార్గం పలుచోట్ల బురద కయ్యలా మారి ద్విచక్ర వాహనం కూడా కదలని దుస్థితి నెలకొంది.

**భారీ వాహనాల తాకిడితో..**పశ్చిమ గోదావరిలో 60 కిలోమీటర్ల మేర ఏటు గట్టు ఉంది. ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం నుంచి కంచుస్తంభం పాలెం వరకు భారీ గోతులు ఏర్పడ్డాయి. సిద్ధాంతం, నడిపూడి, కోడేరు, కరుగోరుమిల్లి గ్రామాల నుంచి గతంలో ఈ మార్గంలో పెద్ద ఎత్తున ఇసుక, మట్టి రవాణా జరిగింది. భారీ వాహనాలు అడ్డూ అదుపు లేకుండా తిరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, భీమలాపురం, కోడేరు, పెదమల్లం గ్రామాల్లో అయితే వాహనాల రాకపోకలకు ఏమాత్రం అవకాశం లేని విధంగా ఈ మార్గం ఛిద్రమైంది.

రినడిపూడి, చినమల్లం, పెదమల్లం తదితర తీర గ్రామాల నుంచి పచ్చిమిర్చి, కూరగాయలను రైతులు ఏటిగట్టు మార్గంలో సిద్ధాంతం మార్కెట్కు తరలించేవారు. ఇప్పుడు కనీసం సైకిల్‌పై కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. లంక గ్రామాల నుంచి కొబ్బరికాయలు, ఇతర పంట ఉత్పత్తులు తరలించేందుకు రైతులకు అవస్థలు తప్పడం లేదు. పరిమితంగానే నిధులు.. కూటమి సర్కారు వచ్చాక ఏటిగట్టు రోడ్డు అభివృద్ధికి మూడు భాగాలుగా ప్రతిపాదనలు చేశారు. పాలకొల్లు నియోజకవర్గ పరిధిలో కంచుస్తంభపాలెం– బాడవ మధ్య భాగానికి మాత్రమే రూ.4 కోట్లు మంజూరయ్యాయి. సిద్ధాంతం– కోడేరు, కోడేరు–భీమలాపురం పరిధిలో పనులకు మరో రూ.4 కోట్లు అవసరం కాగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. నిధులు కేటాయించిన ప్రాంతంలో వర్షాలు తగ్గాక రోడ్డు నిర్మాణం చేపడతామని ఏటిగట్టు పరిరక్షణ శాఖ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు.

# అలనాటి వైభవం.. ఆధ్యాత్మిక సౌరభం..!

శ్రీకాకుళం : సిక్కోలు నేలపై అడుగుపెడితే ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది. ఓ వైపు నాగావళి.. మరో వైపు వంశధార.. నదీమ తల్లి ఒడిలో వెలసిన పురాతన దేవాలయాలు.. పవిత్ర ప్రాంతాలకు కొదవ లేదు. సుదీర్ఘ చరిత్ర కలిగిన పుణ్యధామాలెన్నో దేదీప్యమానంగా వెలుగులీనుతూ జిల్లాను పునీతం చేస్తున్నాయి. నిత్య పూజలతో అలరారుతున్నాయి. తరతరాల సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలంగా నిలుస్తున్నాయి. ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని రెట్టింపు చేస్తున్నాయి. వజ్రోత్సవాల సందర్భంగా ప్రముఖ క్షేత్రాలపై ప్రత్యేక కథనం..

**అదిగో అరసవల్లి..**

జిల్లా పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చేది అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయం. శ్రీకాకుళం నగరానికి కూత వేటు దూరంలో కొలువైన ఈ క్షేత్ర సందర్శనకు నిత్యం ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. దేవేంద్రుడు ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణాల గాథ. రథసప్తమి రోజున ఇక్కడ స్వామి నిజరూపంలో దర్శనమిస్తారు. ఆరోజున వేల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తుం



టారు. ఏటా అక్టోబరు, మార్చి నెలల్లో ఆదిత్యుడి మూలవిరాట్‌పై సూర్యకిరణాల పడుతుంటాయి. ఏకాదశి పర్వదినాల్లో స్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహిస్తారు.

**700 ఏళ్ల నాటి కోవెల..**

చుట్టూ పచ్చని కొండలు.. ప్రశాంత వాతావరణం మధ్యన ఉండే మందస గ్రామంలో ఉంది వాసుదేవ్ పెరుమాళ్ స్వామి ఆలయం.దాదాపు 700 ఏళ్ల కిందట కళింగ రాజ్యంలో దీన్ని నిర్మించారు. అందుకే ఇక్కడి శిల్పకళ ఒడిశా సంప్రదాయాలను గుర్తు చేస్తుంది. ఒకప్పుడు వేద పాఠశాలగా వర్ధిల్లిన దేవాలయంలోనే త్రిదండి రామానుజ పెద్ద జీయర్‌స్వామి శ్రీభాష్యం అభ్యసించినట్లు సమాచారం. ఆయన శిష్యుడు త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి శిథిలావస్థలో ఉన్న వాసుదేవాలయాన్ని పునరుద్ధరించారు. ఏటా మాఘమాసంలో స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

**మన దగ్గరే దక్షిణ కాశీ..**

వంశదార నదీ తీరాన కొలువైన పవిత్ర శైవ క్షేత్రం శ్రీముఖలింగేశ్వరాలయం. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం గ్రామంలో ఉన్న ఈ కోవెలకు సుదీర్ఘం చరిత్ర ఉంది. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని శాసనాలు చెబుతున్నాయి. క్రీ.శ 573లో పూర్వ గంగ వంశీకులు హస్తివర్మ నిర్మించగా.. 14వ శతాబ్దంలో పర్లాఖెముండి రాజులు జీర్ణోద్ధరణ చేశారు. మహాశివరాత్రితో పాటు ఏటా మూడు రోజుల పాటు జరిగే చక్రతీర్థ స్నాన ఘట్టంలో పాల్గొనేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. గంగ, చాళుక్య శిల్ప కళతో క్షేత్రం నేటికీ నిత్యనూతనంగా విరాజిల్లుతోంది.

**శ్రీకూర్మం.. పవిత్ర ధామం..**

శ్రీమన్నారాయణుడు శ్రీకూర్మనాథుని అవతారంలో కొలువైన పవిత్ర స్థలం జిల్లాలోనే ఉంది. అదే జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గార మండలం శ్రీకూర్మం. ఆలయంలో రెండు ధ్వజ స్తంభాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఈ దేవాలయ మండపాన్ని 24 నల్లరాతి ఏకశిలా స్తంభాలతో నిర్మించారు. అద్భుతమైన శిల్పసౌందర్యం ఈ క్షేత్రం సొంతం. బేడా మండపంలోని కుడ్య చిత్రాలు నాటి చరిత్ర, క్షేత్ర మహత్యాన్ని కళ్లకు కడతాయి. ఇక్కడ ఎక్కువగా పితృకర్మలు నిర్వహిస్తుండటంతో ఒడిశాతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వస్తుంటారు.

**మరెన్నో క్షేత్రాలు..**

నాగావళి నదీ తీరంలో బలరాముడు ప్రతిష్ఠించి క్షేత్రాల్లో రెండు జిల్లాలోనే ఉన్నాయి. అవే శ్రీకాకుళం నగరం గుడి వీధిలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం, శ్రీకాకుళం గ్రామీణ మండలం కళ్లేపల్లిలోని మణినాగేశ్వరస్వామి ఆలయం.టెక్కలి మండలం రావివలసలో ఎండల మల్లికార్జున స్వామి ఎత్తైన రాతి శివలింగం రూపంలో భక్తులు దర్శనమిస్తారు.కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి, పాతపట్నం నీలమణి దుర్గమ్మ దేవస్థానాలు నిత్యం భక్తులతో కళకళలాడుతుంటాయి.

ఇవే కాకుండా ప్రసిద్ధి చెందిన, పురాతన ఆలయాలెన్నో సిక్కోలు నేలను పరమపవిత్రం చేస్తున్నాయి.

# ప్రయాణ కష్టాలకు మోక్షం..!

పొందూరు : రహదారి అధ్వానంగా ఉండటంతో వజ్రపుకొత్తూరు వెళ్లడానికి సమీప గ్రామాల ప్రజలు, అధికారులు అవస్థలు పడేవారు. ఒక వరుస మార్గం కావడంతో సమస్య మరింత తీవ్రమైంది. కొన్నేళ్ల నుంచి రెండు వరుసలతో విస్తరణ చేపట్టాలని స్థానికులు డిమాండు చేశారు. వైకాపా ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. పెద్ద గోతులు ఏర్పడి దారుణంగా మారింది. చిన్న వర్షం పడినా ప్రయాణానికి నరకయాత న పడాల్సిన పరిస్థితి తలెత్తింది. ప్రయాణ కష్టాలపైలో వరుస కథనాలు ప్రచురించడంతో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించారు. అపరిష్కృత బిల్లులు చెల్లించేలా చొరవ చూపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

**శరవేగంగా పనులు**

వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు నుంచి బెండి, బెండిగేటు మీదుగా పలాస మండలం రేగులపాడు వరకు సుమారు 16 కి.మీ రహదారిని సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్‌ఎఫ్) కింద రూ.25 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రెండు వరుసలతో తారు రోడ్డు విస్తరణను వైకాపా పాలకులు నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే శిరీష హామీ ఇచ్చారు. వారం రోజులుగా శరవేగంగా సాగుతున్నాయి. బెండి, గల్లీ మధ్య పాడైన కల్వర్టులు తొలగించి కొత్తవి నిర్మిస్తున్నారు. బెండిగేటు నుంచి తారు వేయడానికి సిద్ధం చేస్తున్నారు.

**నెలాఖరుకు పూర్తి చేస్తాం..:** గత ప్రభుత్వం రోడ్డు పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో పూర్తి చేయలేకపోయాం. ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బకాయిలు చెల్లించేలా చొరవ చూపడంతో తిరిగి ప్రారంభించాం. ఈ నెలాఖరుకు బీటీ రోడ్డు పనులు పూర్తి చేస్తాం. విక్రమ్, జేఈ, ఆర్అండ్‌బీ శాఖ, పలాస డివిజన్

# ముఖహాజరులో మాయాజాలం!



అనంతపురం : గుత్తి ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహం లో 291 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు. అక్కడ 180 మందికి మించి ఉండటం లేదు. ఉదయం హాస్టల్ వద్ద 20 నుంచి 30 మంది విద్యార్థులకు మాత్రమే హాజరు వేస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు వెళ్లి మిగిలిన విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు.

నార్పలలోని బీసీ బాలికల వసతిగృహంలో 400 మంది ఉన్నట్లు చూపుతున్నారు. 200 మందికి మించి లేరు. హాస్టల్‌కు ఆనుకుని ఉన్న పాఠశాలలోనే ప్రతి రోజూ మధ్యాహ్నం ముఖహాజరు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తున్నా కొందరు వార్డెన్లు అడ్డదారులు తొక్కుతున్నారు. పారదర్శకత కోసం తీసుకొచ్చిన ముఖహాజరు విధానాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. రోజూ ఉదయం హాస్టల్ ఆవరణలోనే విద్యార్థుల ముఖహాజరు వేయాల్సి ఉండగా.. ఇందుకు విరుద్ధంగా మధ్యాహ్నం వేళల్లో పాఠశాలల వద్దకు వెళ్లి నమోదు చేస్తున్నారు. బయటి విద్యార్థులను కూడా హాస్టళ్లలోనే ఉంటున్నట్లు హాజరు వేస్తున్నారు. వారంతా ఇక్కడే భోజనం చేస్తున్నట్లు చూపి బిల్లులు డ్రా చేసుకుంటున్నారు.

**లోపాలను ఆసరాగా తీసుకుని..**

గతంలో బీసీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో బయోమెట్రిక్ పద్ధతిలో విద్యార్థుల హాజరు నమోదు చేసేవారు. విద్యార్థులు ఉదయం 8 గంటల లోపు అల్పాహారం తిని వెళ్లేవారు. దీంతో ఉదయం 5 నుంచి 8 గంటల వరకే హాజరు వేసేందుకు అవకాశం ఉండేది. తర్వాత అటెండెన్స్ ఆప్షన్ లాక్ అయ్యేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ ఆధారిత హాజరు విధానాన్ని(ఎఫ్ఆర్ఎస్)ను తప్పనిసరి చేసింది. అయితే ఎలాంటి కాలపరిమితి విధించలేదు. ఎక్కడి నుంచైనా నమోదు చేసే వెసులుబాటు కల్పించింది. దీన్ని కొందరు వార్డెన్లు అవకాశంగా మలుచుకుంటున్నారు. పలుచోట్ల విద్యార్థుల వాస్తవ సంఖ్య కంటే ఎక్కువగా చూపుతున్నారు. అనంతపురం జిల్లాలోని గుత్తి (ఎస్టీ), నార్పల (బీసీ), అనంతపురం (కాలేజ్ బాయ్స్ హాస్టల్), ఉరవకొండ (బీసీ), కళ్యాణదుర్గం (బీసీ) హాస్టళ్లు, శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి (బీసీ), కొత్తచెరువు (బీసీ), ముదిగుబ్బ (బీసీ బాలికల) హాస్టళ్లల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

**తెలిసినా పట్టించుకోరా?**

ముఖహాజరులో అక్రమాలు ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?, ఏ సమయంలో.. ఎక్కడ హాజరు నమోదు చేస్తున్నారనే వివరాలు ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డులో కనిపిస్తాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని బీసీ, ఎస్టీ హాస్టళ్లలో 80 శాతం విద్యార్థుల హాజరు మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్యే నమోదు చేస్తున్నారు. ఇదంతా ఆన్‌లైన్‌లో స్పష్టంగా కనిపిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంగా అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివనారాయణశర్మ వివరణ కోరగా క్షేత్రస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# నగరం.. ఎన్నాళ్లీ నరకం

రాజమహేంద్రవరం : ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షం కురుస్తోంది. దీంతో నగరంలో ముంపు సమస్య తీవ్రమవుతోంది. వర్షాకాలం వచ్చిందంటే నగర ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. దశాబ్దాలుగా ముంపు సమస్య వేధిస్తూనే ఉంది. పాలకులు మారినా శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదు. కాలువలు విస్తరణకు నోచుకోకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా పల్లపు ప్రాంతాలు నీట మునగడం పరిపాటిగా మారింది.

**కానరాని కాలువల ప్రక్షాళన**

కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సి ఉన్నా..ఆ దిశగా యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు. పూడికలు పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వేసవి కాలంలోనే ఈ పనులు చేపట్టాల్సి ఉంది. కాలువల్లో చెత్త, చెదారం కొట్టుకువచ్చి పేరుకుపోతోంది. కనీసం వర్షాలను దృష్టిలో పెట్టుకొని వారానికి ఒకసారైనా పూడిక తొలగిస్తే ముంపు సమస్య తగ్గుతుంది.


**సిబ్బంది కొరతతో...** అర్బన్‌లో సుమారు 620 కి.మీ మేర కాలువ



వ్యవస్థ ఉంది. నల్లా ఛానల్, ఆవ ఛానల్‌లు 23 కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. వారానికి రెండు సార్లు పారిశుద్ధ్య కార్మికులు పూడిక తొలగించాల్సి ఉంది. సిబ్బంది కొరతతో ఈ పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ఇంటింటా చెత్త సేకరణకే సిబ్బందిని వినియోగిస్తున్నారు. మిగిలిన వారికి ముఖ్య రోడ్లు, జంక్షన్లను శుభ్రం చేయడానికి సరిపోతుంది. ఇక ప్రధాన కాలువల్లో యంత్రాల సహాయంతో పూడిక తొలగించాల్సి ఉంది. ః నగర పరిస్థితులకనుగుణంగా ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాల్సి ఉంది. నగరంలో సుమారు 920 మంది వరకూ పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. ప్రస్తుత అవసరాల దృష్ట్యా సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. తుమ్మలావ, కంబాలచెరువు, ఆర్యాపురం, కోటిపల్లి బస్టాండ్, ఆల్కట్‌గార్డెన్స్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ముంపు తీవ్రత ఎక్కువగా ఉంది.

# రూపాయికే ఇంటి ప్లాన్

చింతలపూడి : పట్టణాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలగనుంది. జీవో నం.20 ద్వారా 50 చదరపు మీటర్ల లోపు ఇల్లు కట్టుకునేవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఒక్క రూపాయి చెల్లిస్తే ప్లాన్ అనుమతి లభించనుంది. గతంలో ఇంటిప్లాన్ అనుమతి కావాలంటే ఫీజుల రూపంలో రూ.వేలకు వేలు చెల్లించడంతోపాటు, అధికారులకు అదనంగా చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనలు సులభతరం చేసింది. గతంలో 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో భవనం నిర్మించుకోవాలంటే అప్లికేషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, స్థల అనుమతులు, భవన అనుమతి, చెట్ల సంరక్షణ, ఇంకుడు గుంతలు, లేబర్ సెస్, తదితర ఛార్జీలతో ప్లాన్ పొందాలంటే తడిసి మోపెడయ్యేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించింది. మొత్తం ఆన్‌లైన్‌లోనే.. అనుమతి కలిగిన సాంకేతిక నిపుణులు (ఎల్‌టీపీ)ల ద్వారా సులువుగా పని జరిగిపోతుంది. ఖాళీ



స్థలం ఫోటోతోపాటు దస్త్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత అధికారుల పరిశీలన అనంతరం చరవాణికి చలానా సందేశం వస్తుంది. ఆ చలానా చెల్లించిన వెంటనే అనుమతి లభిస్తుంది. తాజా నిబంధనలతో లబ్ధిదారులు పట్టణ పరిధిలోని కార్యాలయాలకు వెళ్లకుండానే ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ప్లాన్ పొందవచ్చు. ఇప్పుడు సులభంగా పొందవచ్చు.. పట్టణాల్లోని పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఇంటి ప్లాన్ అనుమతులపై ప్రభుత్వం భారం తగ్గించింది. అవసరమైన వారు ఆన్‌లైన్ ద్వారా సులువుగా ఒక్క రూపాయికే అనుమతులు పొందవచ్చు. – షేక్ అజీద్‌బాబా పట్టణ ప్రణాళిక అధికారి, చింతలపూడి

## ఎరక్కపోయి వెళ్తే.. ఇరుక్కుపోవాల్సిందే

ఆదోని : ఆదోని పట్టణ శివారు 'దారి'ఉణంగా మారింది. బసాపురం బైపాస్ రహదారి నుంచి మార్కెట్‌యార్డుకు వెళ్లే రహదారిపై మోకాలు లోతు గుంతలు పడ్డాయి. ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో పరిశ్రమలు న్నాయి. మార్కెట్‌యార్డు ఉండటంతో రైతులు పంట ఉత్పత్తులను యార్డుకు తెచ్చేందుకు ఈ మార్గంలోనే వెళ్తుంటారు. సీజన్ సమయంలో రోజూ వేల వాహనాలు తిరుగుతాయి. గుంతలు దాటలేక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రహదారి



పంచాయతీ రాజ్ పరిధిలో ఉండటం, అటు మార్కెటింగ్ శాఖ, ఇటు పురపాలక సంఘం నిధులు వెచ్చించలేకపోతున్నాయి. దీంతో 17 ఏళ్లుగా దారి సమస్య పరిష్కారం కావటం లేదని స్థానికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధి అక్రమాలకు ఏఐతో చెక్



అనకాపల్లి : మండలం చింతనిప్పుల అగ్రహారంలో రాజాన లక్ష్మి పేరు మస్తరులో దిద్దుబాటు చేసి ఆమెకు రూ.690 వేతనం మంజూరు చేసి అక్రమాలకు పాల్పడ్డారు. మాకవరంలో సంతకాలు, వేలిముద్రలు వేయకుండానే తలారి గణేష్‌కు వేతనం మంజూరు చేసి ఆ మొత్తాన్ని స్వాహా చేశారు. కశింకోట మండలం ఇ.చౌడువాడలో ఉపాధి హామీ రికార్డుల్లో పనికి రాకపోయినా మస్తర్లు వేశారు. పేరు ఒకరిదైతే పనికి వచ్చేది మరొకరని చూపారు. సామాజిక తనిఖీల్లో బినామీ మస్తర్లతో రూ.87 వేలు కాజేసినట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. సామాజిక తనిఖీ ప్రజావేదికల్లో ఆడిట్ బృందాలు అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్నాయి. ఉపాధి శ్రామికులకు క్షేత్ర సహాయకులు కుమ్మక్కు అవుతున్నట్లు గుర్తించారు. 2024-25లో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.1.09 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చారు. ఎక్కువగా బోగస్ జాబ్‌కార్డులు, మస్తర్ల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇవన్నీ మండల స్థాయిలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చినవే. క్షేత్రస్థాయిలో వెలుగులోకి రానివి చాలానే ఉన్నాయి. ఇకపై అడ్డగోలు వ్యవహారాలు, అక్రమాలకు ప్రభుత్వం ఏఐ సాంకేతికతో చెక్ పెట్టనుంది. హాజరు నుంచి పని కొలతల వరకు ఎక్కడా అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టడం చేయనుంది. 24 మండలాల పరిధిలో 3,13,661 మంది కూలీలు ఉన్నారు. 2,79,897 మందికి జాబ్ కార్డులున్నాయి. వీరిలో 1,98,535 మంది పనులకు హాజరవుతున్నారు. ఇప్పటివరకు ఎన్ఎంఎంఎస్‌లో ఫొటోల అప్‌లోడ్ చేసే విధానం అమలులో ఉంది. రోజూ పనిచేసిన వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. బినామీ, బోగస్ శ్రామికుల ఫొటోలు పెట్టినా గుర్తించే సాంకేతికత లేదు. ఒకసారి అప్‌లోడ్ చేసిన ఫొటోలు 15 రోజుల తర్వాత యాప్‌లో కనిపించవు. దీంతో అడ్డగోలుగా వ్యహరించే వారు. ఏఐ ఆధారిత వ్యవస్థ ద్వారా ముఖ గుర్తింపు హాజరుతో ప్రతిదీ పక్కాగా నమోదు అవుతుంది. కూలీల ఫొటోలను జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో ముందుగా అప్‌లోడ్ చేస్తారు. పని ప్రదేశంలో రెండు పూటలా కూలీల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకరి బదులు మరొకరు వస్తే యాప్ అనుమతించదు. రెండు పూటల ఫొటో దిగితేనే వేతనం వస్తుంది. ఉపాధి హామీ పథకంలో ముందుగా గుర్తించిన పనులు చేసేటప్పుడు జీఐఎస్‌ని ఉపయోగించి ఇకపై జియోట్యాగ్ చేస్తారు. వీటిని శాటిలైట్ ఇమేజ్‌కు లింక్ చేస్తారు. తద్వారా రెండోసారి అవే పనులు చేయడానికి వీలుండదు. పదేపదే అవే పనులు చేయడానికి ప్రయత్నించిన సమాచారాన్ని అధికారులకు చేరవేస్తుంది. చేసిన పనులకు సంబంధించి తప్పుడు బిల్లుల చెల్లింపులకు ఆస్కారం ఉండదు.

# బాలికా జరభద్రం.. అప్రమత్తతే ఆయుధం

రాయదుర్గం : బాలికల భద్రతే లక్ష్యంగా 'శక్తి' బృందం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఇటీవల బాలికల పట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించడంతో పోక్సో కేసులు సైతం నమోదవుతున్న ఘటన ఉంటున్నాయి. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

**గుడ్ టచ్, బ్యాడ్ టచ్..**

ఎవరైనా బాలికలను తాకరాని చోట తాకినా, దురుద్దేశంతో వ్యవహరించినా.. నేరమేనని విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు, పోలీసులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. అలాగే ఉన్నత పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

**అన్నీ యాప్‌లోనే...**

పోలీస్‌స్టేషన్ వెళ్లకుండానే సచివాలయం, మహిళా పోలీసులకు సమాచారం అందాలంటే 'శక్తి' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. అందులోని హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు అనుకోకుండా అక్కడే రాత్రి బస చేయాల్సిన సందర్భం



వస్తే... శక్తి యాప్‌లో సమాచారం అందిస్తే మహిళా పోలీసులు రక్షణ కల్పిస్తారు. విద్యార్థినులు ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కినప్పుడు 'సేఫ్‌ట్రాక్, సేఫ్ హోమ్' యాప్‌లను వినియోగించి జాగ్రత్తలు తీసుకోవాల్సిన తీరుపై అవగాహన కల్పిస్తున్నారు.

**చైతన్యపరచడమే లక్ష్యం..** –విజయ్, ఏఎస్సై, శక్తిబృందం

ఇప్పటికే రాయదుర్గం నియోజకవర్గంలోని 68 పాఠశాలలు, 25 స్వయం సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాం. అన్ని పాఠశాలల్లో సదస్సులు పూర్తి చేస్తాం. విద్యాసంస్థల యాజమాన్యాలనూ అప్రమత్తం చేస్తున్నాం.

# శివభాష్యం నిండింది.. భవనాశి ఉప్పొంగింది

ఆత్మకూరు : భారీ వర్షాల నేపథ్యంలో ఆత్మకూరు మండల పరిధి.. నల్లమలలోని ఆర్లవాగుపై నిర్మించిన శివభాష్యం సాగర్ ప్రాజెక్టు బుధవారం పూర్తిగా నిండింది. దీంతో అధికారులు రెండు గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 0.4 టీఎంసీలు. పూర్తిగా నిండటంతో గేట్లు ఎత్తి విడుదల చేసినట్లు ఏఈ మురళీకృష్ణ తెలిపారు. 2009 తర్వాత ప్రాజెక్టుకు ప్రస్తుతం నీరు ఉద్ధృతంగా వచ్చిందని తెలిపారు. ఈ నీరంతా భవనాశి వాగులోకి చేరింది. ఫలితంగా ఆత్మకూరు–కురుకుంద మధ్య వాగు ఉప్పొంగి వంతెనపై ప్రవహిస్తోంది. ఫలితంగా పలు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.

**కొత్తపల్లిలో 20.4 మి.మీ.**

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. కొత్తపల్లి మండలంలో 20.4 మి.మీ.లుగా నమోదైంది. మిడుతూరు 16.4, రుద్రవరం 15.2,



ఆత్మకూరు 12.8, పగిడ్యాల 12.4, పాములపాడు 11.4, జూపాడు బంగ్లా, నంద్యాల అర్బన్ 10.2, నంద్యాల రూరల్ 7.6, శ్రీశైలం 7.2, నందికొట్కూరు 6.8, వెలుగోడు, మహానంది 5.8, బండిఆత్మకూరు 5.4, గడివేముల, శిరివెళ్ల 4.2, గోస్పాడు 4.0, బేతంచెర్ల 1.6, బనగానపల్లిలో 1.2 మి.మీ.లు కురిసింది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుందూ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆత్మకూరు, బండిఆత్మకూరు తదితర మండలాల్లో రహదారులపై పెద్దఎత్తున వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి.

**కుందూలో నీటి ఉద్ధృతి**

నంద్యాల నుంచి నందమూరినగర్‌కు వెళ్లే మార్గంలో వంతెన ఆనుకుని కుందూ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నది నిండుగా ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమై తగిన చర్యలు చేపట్టారు. మరోవైపు నదిపై ఉన్న పాత వంతెనపై రాకపోకలు సాగించేందుకు జనం ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కిందట నిర్మించడం.. మరమ్మతులు లేక దెబ్బతిందని పలువురు పేర్కొన్నారు. వెంటనే కొత్త వంతెన పనులు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

# కంటి'తుడుపు' వైద్యం

కర్నూలు : జిల్లాలో నేత్రదానం చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఏడాదికి సుమారు 400 మంది మృతుల నుంచి కార్నియాలను సేకరిస్తున్నారు. ఐబ్యాంకు లేకపోవడంతో సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లో ఎల్‌వీ ప్రసాద్ ఐబ్యాంకుకు పంపించాల్సి వస్తోంది. దీంతో కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు ఆశించిన మేరకు జరగడం లేదు.

**పరికరాలు మూలనపడేశారు**

ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో నలుగురు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్లు, పదిమంది అసిస్టెంట్లు, 30 మంది పీజీలు ఉన్నారు. 2010లో ఐబ్యాంకుకు సంబంధించిన స్పెక్యులర్ మైక్రోస్కోప్ తెప్పించారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దానిని మూలన పడేశారు. దీంతో ఐబ్యాంకు ఊసే లేకుండాపోయింది. రెండు దశాబ్దాలుగా ఐ కలెక్ట్ సెంటర్‌గానే మిగిలిపోయింది.

కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా మూలనపడేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిధులు సమకూరిస్తే ఐబ్యాంకు ఏర్పాటుతో పాటు కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేయడానికి ఆపరేషన్ థియేటర్, ఇతర వసతులు సమకూర్చుకోవచ్చు.



**కొరవడిన ప్రచారం**

జిల్లాలో నేత్రదానంపై అవగాహన సరిగా జరగడం లేదు. ప్రాంతీయ కంటి ఆసుపత్రి అధికారులు, అంధత్వ నివారణ సంస్థ జిల్లా సమన్వయ కర్త, అక్కడ పనిచేసే డెమోలు ప్రచారంపై దృష్టిపెట్టడం లేదు. జిల్లా అంధత్వ నివారణ కన్వీనర్, అక్కడ పనిచేసే హెల్త్ ఎడ్యుకేటర్ రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్నా కార్యాలయాలకే పరిమితమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాంతీయ కంటి ఆసుపత్రి పర్యవేక్షుడు దీనిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

**హైదరాబాద్‌కు పరుగులు**

జిల్లా వ్యాప్తంగా కార్నియా దెబ్బతిన్న వారు, ఇతర నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు వందల్లో ఉన్నారు. కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకోవాలంటే హైదరాబాద్‌లోని సరోజిని కంటి ఆసుపత్రి లేదా ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్‌కు వెళ్లాల్సి వస్తోంది.

ప్రైవేటుగా అయితే సుశీల నేత్రాలయ, అమీలియో ఆసుపత్రుల్లో తక్కువ సంఖ్యలో కార్నియా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. స్థానికంగా ఐబ్యాంకు లేకపోవడంతో వీరూ హైదరాబాద్ నుంచి కార్నియాలు తెప్పించుకుని శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తోంది. నగరంలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడానికి సౌకర్యాలున్నా శస్త్రచికిత్సలు చేయడానికి నిపుణులు లేకపోవడంతో అంధులకు నిరాశే మిగులుతోంది. జిల్లాలో ఏటా వందల సంఖ్యలో నేత్రాలు సేకరిస్తున్నా జిల్లా వాసులకు ఉపయోగపడని దుస్థితి నెలకొంది.

**సౌకర్యాలు లేవు :** డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి పర్యవేక్షకుడు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్ లేదు. శిక్షణ తీసుకొన్న వైద్యులు అందుబాటులో లేరు. ఈ కారణంగా ఇక్కడ కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం లేదు. ఇందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడ ఐబ్యాంకు లేకపోవడమూ సమస్యగా మారింది. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

## అప్పుడు సన్నీ లియోన్.. ఇప్పుడు తమన్నా??

బాలీవుడ్ స్టార్ ఫిల్మ్ మేకర్ ఏక్తా కపూర్ బ్యానర్ నుంచి వచ్చిన హర్రర్ ఫ్రాంచైజీ మూవీ 'రాగిణి MMS'. 2011లో వచ్చిన ఈ సినిమా ఫ్రాంచైజీలో వరుస సినిమాలు చేయాలని భావిస్తున్నారు. 2014లో రాగిణి MMS ఫ్రాంచైజీలో రెండో భాగం వచ్చింది. మొదటి మూవీలో కైనాజ్ మోతివాలా, రాజ్ కుమార్ రావు, రజత్ కౌల్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా రాగిణి MMS 2 సినిమాను తీసుకు వచ్చారు. మొదటి పార్ట్ కంటెంట్ కారణంగా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే, రెండో పార్ట్ మాత్రం సన్నీ లియోన్ కారణంగా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది అంటారు. రాగిణి MMS ఫ్రాంచైజీలో వచ్చిన రెండో సినిమాలో సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటించగా, భూషన్ పటేల్ దర్శకత్వం వహించాడు.

**రాగిణి MMS ఫ్రాంచైజీలో వరుస సినిమాలు....** ఏక్తా కపూర్



నిర్మాణంలోనే రెండు పార్ట్‌లు వచ్చాయి. అందులో భాగంగానే ఇప్పుడు మూడో పార్ట్‌ను ఏక్తా కపూర్ నిర్మించేందుకు రెడీ అవుతోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం హీరోయిన్ ఎంపిక విషయమై ప్రముఖంగా చర్చ జరుగుతోంది. రాగిణి MMS 2 వచ్చి పదేళ్లు దాటింది. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీలో రెండు మూడు సినిమాలు చేయాలని భావించినా కొన్ని కారణాల వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. ఎట్టకేలకు రాగిణి MMS 3 సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ రెడీ అయిందని, హీరోయిన్ ఎంపిక విషయమై చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. మొదట ఈ ఫ్రాంచైజీ మూడో సినిమాకు హీరోయిన్‌గా నోరా ఫతేహీని ఎంపిక చేయడం జరిగింది. కథ చర్చలు సైతం ఆమె తో జరిగాయని అన్నారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆమె ఈ సినిమాను చేయలేను అని చెప్పిందట.

## కోట్లు సంపాదిస్తున్నా? ఖర్చు విషయంలో జాగ్రత్తే!

సక్సెస్ లో ఉన్న సెలబ్రిటీలంటే కోట్ల రూపాయల సంపాదన. సినిమాలు..యాడ్స్ రూపంలో రెండు చేతులా ఆదాయమే. ఆదాయానికి తగ్గట్లే ఖర్చులుంటాయి. గ్లామర్ ఫీల్డ్ లో ఎంత సంపాదించినా? కరెన్సీ ఖర్చుకు లెక్కుండదు. అవకాశాలున్నా లేకపోయినా పీల్డ్ లో ఉన్నంత కాలం కొన్నిరకాల మెయింటనెన్స్ తప్పదు. ఇక్కడే బ్యాలెన్స్ తప్పితే లెక్కలన్నీ తారుమారవుతాయి. పాత తరం నటుల్లో కోట్లుసంపాదించిన వారంతా? చివరి కాలంలో చిల్లి గవ్వ లేకుండానే కాలం చేసారు. అయితే ఇప్పటి జనరేషన్ నటీమణులు డబ్బు విషయంలో జాగ్రత్తగానే ఉంటున్నారు. ఖర్చు విషయంలో ఆచితూచే వ్యవహరిస్తుంటారు. అలాంటి వాళ్లలో నేను ఉన్నానంటూ ముందు



కొచ్చింది ఐటం భామ మలైకా అరోరా. డబ్బు లేని రోజుల్ని.డబ్బున్న రోజుల్ని రెండింటిని చూసానంటూ చెప్పు కొచ్చింది. ఆర్థికంగా కుటుంబం పడిన కష్టాలు తెలియడంతోనే డబ్బు విషయాలు జాగ్రత్తగా ఉంటానని మలైకా తొలిసారి ఓపెన్ అయింది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన మలైకా తల్లి ఎంతో కష్టపడి తమని పెంచిందన్నారు. మెడలో పుస్తులు తాకట్టు పెట్టి మరీ స్కూల్ ఫీజులు కట్టేదని తెలిపింది. '17 ఏళ్ల కే తాను కూడా పనికి వెళ్లడం ప్రారంభించిందంది. డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా ప్రతీ రూపాయి కూడబెట్టేదాన్ని. స్నేహితులతో షికార్లకు వెళ్లడం, పార్టీలంటూ ఎంజాయ్ చేసింది లేదంది. సెలబ్రిటీ అయిన తర్వాత కూడా డబ్బుతో అంతే జాగ్రత్తగా ఉన్నట్లు తెలిపింది. పెట్టే ప్రతీ రూపాయి ఖర్చు డైలీ ఓ పుస్తకంలో రాస్తుందట. ఖరీదైన వస్తువులు వంటివి ఇప్పటికీ కొనదట. షాపింగ్ కి వెళ్తే ఎంత ఖర్చు చేయాలి? అన్నది ముందే రాసి పెట్టుకుంటుందట. ఆ లెక్క దాటకుండా ఖర్చు చేస్తానంది. 'ప్రతీసారి బ్రాండెడ్ వస్తువులే తీసుకోవాలి? అనేది ఏమీ ఉండదు. తనకు కావాల్సిన బ్రాండ్ లేకపోతే మరో కంపెనీ బ్రాండ్ తో అడ్జస్ట్ అవుతానంది. వీలైనంత వరకూ తక్కువ ఖరీదులో ఉండే ఐటం కోసమే సెర్చ్ చేస్తానని తెలిపింది. మొత్తానికి మలైకా అరోరా కూడా బడ్జెట్ పద్మనాభం టైపు అని అర్థమవుతుంది. ఇది మంచి అలవాటే. చేతిలో డబ్బుందని విచ్చల విడిగా ఖర్చు పెడితే? డబ్బు లేని రోజంటూ ఒకటి ఎదురైనప్పుడు ఇబ్బందులు తప్పవు. ఆ విషయాన్ని మలైకా బాగా అర్థం చేసుకుంది.




## మేం వచ్చేస్తున్నాం.. సిద్ధం కండి అంటున్న స్టార్ హీరోలు!







టాలీవుడ్లో స్టార్ హీరోలు సైతం సెంటిమెంట్ గా ఏదైనా పెద్ద పండుగలను భావిస్తూ తమ సినిమాలను కూడా అప్పుడే విడుదల చేసేలా ప్లాన్ చేస్తూ ఉంటారు. అలా సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి, దసరా, దీపావళి అంటూ ఈ పండుగలకు స్టార్ హీరోలు తమ చిత్రాలను రిలీజ్ చేస్తూ ఉన్నారు. ఒకరకంగా చెప్పాలి అంటే టాలీవుడ్ కి అతిపెద్ద పండుగ సంక్రాంతి..వరుసగా వచ్చే సెలవులను క్యాష్ చేసుకోవడానికి దర్శక నిర్మాతలు ,హీరోలు ఈ స్లాట్స్ బుక్ చేసుకుంటూ ఉంటారు.. ఇక ఎప్పటిలాగే వచ్చే ఏడాది కూడా 2026 సంక్రాంతిని టార్గెట్ చేసుకొని కొన్ని బడా చిత్రాలు రిలీజ్ కాబోతున్నాయి. ఈ ఏడాది వెంకటేష్'సంక్రాంతికి వస్తున్నాం' , రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' , బాలకృష్ణ 'డాకు మహారాజ్' వంటి చిత్రాలు విడుదలయ్యాయి. 2026లో కూడా స్టార్ హీరోల చిత్రాలు విడుదల కాబోతున్నాయి. వాటి గురించి చూద్దాం.

**మన శంకర వరప్రసాద్ గారు..** చిరంజీవి హీరోగా , డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న "మన శంకర వరప్రసాద్ గారు" సంక్రాంతికి రాబోతున్నామంటూ ఇదివరకే చిత్ర బృందం ప్రకటించారు. ఇందులో చిరంజీవితో పాటుగా మరో హీరో వెంకటేష్ కూడా నటిస్తున్నారు. హీరోయిన్ గా నయనతార నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ని కూడా అక్టోబర్లో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

**ది రాజా సాబ్..** ప్రస్తుతం పాన్ ఇండియా హీరోగా పేరు సంపాదించిన ప్రభాస్ – డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో వస్తున్న చిత్రం ది రాజా సాబ్. ఈ సినిమా వాస్తవానికి ఈ ఏడాది డిసెంబర్ 5న రిలీజ్ చేయవలసి ఉండగా.. కొన్ని కారణాల చేత ఈ సినిమాని వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దింపబోతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

**రవితేజ RT 76 మూవీ..** మరొక హీరో రవితేజ కథానాయకుడుగా డైరెక్టర్ కిషోర్ తిరుమల డైరెక్షన్లో వస్తున్న '#RT76' సినిమా కూడా సంక్రాంతి బరిలోనే దించేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ గా రాబోతోంది.

**అనగనగా ఒక రాజు..** అయితే ఈ స్టార్ హీరోల కంటే ముందుగా యంగ్ హీరో నటించిన నవీన్ పోలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సినిమా సంక్రాంతికి ఫిక్స్ అయింది. డైరెక్టర్ మారీ దర్శకత్వంలో జనవరి 14న ఈ సినిమాని రిలీజ్ చేయబోతున్నారు.

**జననాయకుడు..** అలాగే ఈసారి సంక్రాంతి బరిలో మెయిన్ చిత్రాలే కాకుండా.. డబ్బింగ్ చిత్రాలు కూడా విడుదల కాబోతున్నాయి. మరి వచ్చే ఏడాది టాలీవుడ్ సంక్రాంతి బాక్స్ ఆఫీస్ ను టార్గెట్గా చేసుకొని విడుదల కాబోతున్న డబ్బింగ్ చిత్రాల విషయానికి వస్తే.. హీరో విజయ్ దళపతి నటిస్తున్న 'జననాయకుడు' చిత్రం డైరెక్టర్ హెచ్ వినోద్ కుమార్ దర్శకత్వం వహించగా పూజా హెగ్డే హీరోయిన్గా నటిస్తోంది. అలాగే బాబి దేవోల్ కీలకమైన పాత్రల నటిస్తున్నారు. జనవరి 9న ఈ సినిమాని రిలీజ్ చేయబోతున్నారు. ఇకపోతే ఈ సినిమాలన్నీ కూడా సంక్రాంతి బాక్స్ ఆఫీస్ వద్ద పోటీ పడడానికి సిద్ధమవుతున్నాయి. కానీ అన్ని సినిమాలు అనుకున్న సమయానికి వస్తాయా అంటే చెప్పలేని పరిస్థితి.. కొన్ని చిత్రాల షూటింగ్ ఆలస్యం అవ్వచ్చు లేదా ఇంకొన్ని చిత్రాలకు వీఎఫ్ఎక్స్ ఆలస్యం కూడా అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా సంక్రాంతి బరిలోకి మేము వచ్చేస్తున్నాం .. మీరు సిద్ధంకండి అంటూ చాలామంది స్టార్ హీరోలు అభిమానులకు పిలుపునిస్తున్నారు. కానీ ఎవరు సంక్రాంతి బరిలో పోటీ పడబోతున్నారు అనే విషయం తెలియాలి అంటే వచ్చే ఏడాది జనవరి వరకు ఎదురు చూడాల్సిందే.


## చిరు - రావిపూడి మూవీ.. అనుకున్నట్టు జరుగుతుందా?



టాలీవుడ్ సీనియర్ అండ్ స్టార్ హీరో చిరంజీవి లీడ్ రోల్ లో సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఓ సినిమా తెరకెక్కి స్తున్న విషయం తెలిసిందే. కొన్నాళ్ల క్రితం షూటింగ్ స్టార్ట్ అవ్వగా.. ఎప్పటిలానే అనిల్ రావిపూడి షూటింగ్ జెట్ స్పీడ్ లో నిర్వహి స్తున్నారు. రీసెంట్ గా ముచ్చటగా మూడో షెడ్యూల్ ను పూర్తి చేయడం విశేషం. అయితే ఇది రావిపూడికి కామనే. ఎందుకంటే ఎప్పుడూ మెరుపు వేగంతో సినిమాలను కంప్లీట్ చేస్తుంటారు. సాధారణంగా ఆరు నుంచి ఏడు నెలల్లో గుమ్మడికాయ కొట్టేస్తారు. ఇప్పుడు చిరు మూవీ రెండు నెలల క్రితం స్టార్ట్ చేసినా.. అప్పుడే సగం షూటింగ్ ను పూర్తి చేశారు. వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. ఆ విషయాన్ని పలుమార్లు ప్రస్తావించారు కూడా. కానీ ఇప్పుడు అనిల్ రావిపూడి అనుకున్నది చేస్తారా చేయరా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిజానికి సినిమా రిలీజ్ కు ఇంకా టైం ఉంది. కాబట్టి షూటింగ్ ను అనిల్ ఈజీగా పూర్తి చేయగలరు. కానీ మధ్యలో ఇప్పుడు టాలీవుడ్ లో సినీ కార్మికుల సమ్మె అడ్డుపడింది. 30 శాతం వేతనాల పెంపు కోరుతూ కార్మికులు 14 రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయితే సమ్మె మొదలయ్యాక కొందరు నిర్మాతలు.. కొన్ని సినిమాల షూటింగ్స్ కోసం వేరే నగరాల నుంచి కార్మికులు రప్పించి కొనసాగించారని టాక్ వినిపించింది. కానీ ఆ తర్వాత ఛాంబర్.. చిత్రీకరణలు నిలిపివేయాలని ఆదేశించడంతో అన్నీ ఆగిపోయాయి. ఆ నేపథ్యంలో చిరు– అనిల్ మూవీ షూటింగ్ కు కూడా తాత్కాలికంగా బ్రేక్ పడింది. దీంతో సినిమా వాయిదా పడే అవకాశం ఉందని ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. కానీ అనిల్ రావిపూడి.. మాత్రం తన టార్గెట్ ను అందుకునేలా ఇప్పటికే ప్లాన్ చేసుకుంటున్నారని తెలుస్తోంది. గ్యాప్ కవర్ అయ్యేలా చూసుకుంటారట. దానికి తోడు తాజాగా ఫిలిం ఛాంబర్ కూడా నాలుగు ప్రతిపాదనలను ఫిలిం ఫెడరేషన్ కు పంపింది. వాటికి ఓకే అయితే నిర్మాతలు వేతనాలు పెంచుతారని చెప్పింది. అదే సమయంలో చిరు కూడా నిర్మాతలు, ఫెడరేషన్ సభ్యులతో చర్చలు జరపనున్నారు. దీంతో సమ్మె కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే అనిల్ రావిపూడి అనుకున్నట్లే చిరు సినిమాను కంప్లీట్ చేసేలా ఉన్నారు.

## టాలీవుడ్ లో సత్తా చాటుతున్న తెలుగమ్మాయి!

మిగతా భాష ఇండస్ట్రీలతో పోల్చుకుంటే టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో తెలుగమ్మాయిలకు అవకాశాలు చాలా తక్కువగా ఇస్తారని.. ఇప్పటికే ఎంతోమంది ఈ విషయంపై తమ గొంతును వినిపించారు. ముఖ్యంగా అంజలి, అనన్య నాగళ్ళ ఇలా ఎంతోమంది తెలుగు హీరోయిన్స్ సత్తా చాటే ప్రయత్నం చేశారు కానీ సొంత భాషలో అవకాశాలు రాకపోవడంతో పరాయి భాషలో అవకాశాలు అందుకొని.. అక్కడ స్టార్ హీరోయిన్ లుగా చలామణి అవుతున్నారు. కానీ ఇప్పుడిప్పుడే తెలుగు హీరోయిన్లు కూడా టాలీవుడ్ లో సత్తా చాటే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే బేబీ సినిమాతో సంచలనం సృష్టించి అందరి దృష్టిని ఆకట్టుకుంది వైష్ణవి చైతన్య. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో తెలుగమ్మాయి కూడా వచ్చి చేరింది. ఆమె శివాని నాగారం. తాజాగా వచ్చిన 'లిటిల్ హార్ట్స్' అనే సినిమాతో సరికొత్త విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది ఈ చిన్నది. అసలు




విషయంలోకి వెళ్తే... షార్ట్ ఫిలిమ్స్ ద్వారా కెరియర్ మొదలుపెట్టి ఇప్పుడు బిగ్ స్క్రీన్ లో సత్తా చాటుతూ ముందుకు వెళ్తోంది హైదరాబాదీ అమ్మాయి. ప్రస్తుతం 90స్ బయోపిక్ ఫేమ్ మౌళి సరసన లిటిల్ హార్ట్స్ సినిమాలో కాత్యాయని పాత్ర పోషించి యువ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అంతేకాదు పెద్ద పెద్ద స్టార్ సెలబ్రిటీల చిత్రాలకు పోటీగా నిలిచి స్వదేశీ ప్రతిభ బలంగా నిలబడగలదు అని నిరూపించింది ఈ ముద్దుగుమ్మ. విషయంలోకి వెళ్తే.. సెప్టెంబర్ 5వ తేదీన లిటిల్ హార్ట్స్ సినిమా విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమాకు పోటీగా అనుష్క 'ఘాటీ' , శివ కార్తికేయన్ 'మదరాసి' చిత్రాలు విడుదలయ్యాయి. ఈ ఇద్దరి బడా సెలబ్రిటీల చిత్రాలను కూడా వెనక్కి నెట్టి రూ.12 కోట్లకు పైగా కలెక్షన్లు వసూలు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది ఈ సినిమా.దీంతో టాలెంట్ ఉంటే ఏ భాషలో అయినా సత్తా చాటవచ్చు అని మరొకసారి తెలుగమ్మాయి నిరూపించింది అంటూ పలువురు ఈమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నేపథ్యం లోనే ఈమె ఎవరు? ఈమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి? అనే విషయాలు కూడా ఆరా తీస్తున్నారు.. శివాని నాగారం విషయానికి వస్తే.. ఈమె నటి మాత్రమే కాదు క్లాసికల్ డాన్సర్ అలాగే గాయని కూడా..

## అందాల నికిషా ఏమాత్రం తగ్గలేదు

2010లో 'పులి' సినిమాతో తెరంగేట్రం చేసిన ముద్దుగుమ్మ నికీషా పటేల్. తక్కువ సమయంలోనే ఈ అమ్మడికి మంచి గుర్తింపు దక్కింది. పవన్ కళ్యాణ్‌తో నటించే అవకాశం దక్కడంతో నికీషా ఖచ్చితంగా టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా మారే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ పవన్ వంటి స్టార్ హీరోతో సినిమా చేసే అవకాశం దక్కినా నికీషా కు లక్ కలిసి రాలేదు. పులి సినిమాతో ఇండస్ట్రీలో మంచి గుర్తింపు అయితే దక్కింది. అందాల ఆరబోత చేయడంతో నికీషా పటేల్ ఎప్పటికప్పుడూ ఆకట్టుకుంటూ ఉంది. గుజరాతీ కుటుంబంలో జన్మించిన ఈ అమ్మడు చిన్న వయసులోనే ఇండస్ట్రీలో అడుగు పెట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. హీరోయిన్‌గా టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు సినిమాలు చేసింది.

**పవన్ కళ్యాణ్ మూవీతో ఎంట్రీ...** పులి సినిమా తర్వాత కన్నడంలో నరసింహ సినిమా తో ఆకట్టుకుంది. కన్నడంలో ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ డకోటా పిక్చర్ సినిమాలోనూ నటించింది. తెలుగులో ఓం 3డి, అరకు రోడ్‌లో ఇలా కొన్ని సినిమాల్లో నటించింది. తెలుగులో



ఈమె చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. అయినా కూడా ఈ అమ్మడికి లక్ కలిసి వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ భాషల్లో సినిమాలు చేసిన ఈమెకు లక్ కలిసి రాలేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ అమ్మడు సినిమాలకు దూరంగా ఉంటుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఈమె రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ అమ్మడు సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తుంది.

**30 సినిమాలు చేసిన నికీషా పటేల్...** కెరీర్‌లో 30 కి పైగా సినిమాలు చేయడం ద్వారా నటిగా గుర్తింపు దక్కించుకున్న నికీషా పటేల్ ఆకట్టుకునే అందంతో ఎన్నో ఫోటో షూట్స్ ను షేర్ చేసింది. నికీషా పటేల్ అందాల ఆరబోత ఫోటోలు ఎప్పుడూ వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా మరోసారి క్లీ వేజ్ షో తో అందాల నికీషా పటేల్ ఫోటోలు షేర్ చేసింది. అందమైన నికీషా పటేల్ బంగారు వర్ణపు డ్రెస్‌లో మెరిసి పోతుంది. అంతే కాకుండా ఆమె స్కిన్ టోన్ సైతం కలర్ ఫుల్‌గా కన్నుల విందు చేసింది. క్లీవేజ్ షో చేస్తూ, నడుము నాభి అందాలను చూపడం ద్వారా ఆకట్టుకున్న నికీషా పటేల్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఇంత అందంగా ఉన్న నికీషా పటేల్ కి లక్ కలిసి రాకపోవడం వల్లే ఆఫర్లు రావడం లేదు అనేది కొందరి మాట.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536